

పురాతనమైన సమస్తరోగాలకు

ఆయుర్వేద చికిత్స

మూల వ్యాధి, తెల్లమచ్చలు,పక్షవాతములతోపాటు అన్ని రకాల రోగాలకు వనమూలికలతో వైద్యచేయబడును.

శ్రీ దత్తత్రిలింగేశ్వరామాలయము

నారాయణపేట రోడు,ఊట్కూర్‌మండలం మహబూబ్‌నగర్ జిల్లా సెల్ 9640418895



# వార్తాతరంగాలు

జాతీయ తెలుగు దిన పత్రిక

website: www.vaarthatarangalu.com email:vtarangalu.222208@gmail.com

Published from mahabub nagar సంపుటి :25 సంచిక :71 సంపాదకులు: కోటకొండ ఎడ్ల విజయరాజు మంగళవారం 21 జూలై 2026 పేజీలు :12 వేల రూ5 /-


## రాహుల్ గాంధీపై ప్రధాని మోదీ
# వ్యంగ్యాస్త్రాలు..

**56 ఏళ్ల యువకుడు అంటూ..**

**న్యూఢిల్లీ:** లోక్‌సభ ప్రతిపక్ష నేత, ఎంపీ రాహుల్ గాంధీపై ప్రధాని నరేంద్ర మోదీ పరోక్షంగా వ్యంగ్యాస్త్రాలు సంధించారు. సమావేశాలకు ముందు పార్లమెంట్ భవనం వెలుపల ప్రసంగించిన మోదీ.. భారత్ తొలి ప్రైవేట్ ఆర్బిటల్ రాకెట్ విక్రమ్-1 విజయాన్ని ప్రస్తావించారు. ఈ సందర్భంగా విజయానికి కారణమైన యువ శాస్త్రవేత్తలను ఆయన అభినందించారు. అదే సమయంలో ఎంపీ రాహుల్ గాంధీని ఉద్దేశిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. హైదరాబాద్‌కు చెందిన ప్రైవేట్ అంతరిక్ష సంస్థ స్కైరూట్ ఏరోస్పేస్ అభివృద్ధి చేసిన విక్రమ్-1 విజయవంతంగా కక్ష్యలోకి చేరడం దేశానికి గర్వకారణమని ప్రధాని మోదీ అన్నారు. ఈ ప్రాజెక్టుపై పని చేసిన బృందం సగటు వయస్సు కేవలం 28 సంవత్సరాలు మాత్రమేనని పేర్కొన్నారు. ఈ సందర్భంగా తాను 56 ఏళ్ల యువకుడి గురించి



మాట్లాడటం లేదంటూ రాహుల్ గాంధీపై - మిగతా3లో

## ప్రసంగాలతో
# ఇచ్చిపడేస్తున్న రేవంత్..

**హైదరాబాద్, జూలై 20:** తెలంగాణా రాజకీయాల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తనదైన శైలిలో ప్రత్యర్థులను ఉక్కిరిబిక్కిరి చేస్తూ దూసుకుపోతున్నారు. ఆయన మాటలు పదునైన ఆయుధాల్లా ప్రత్యర్థుల గుండెల్లోకి దిగిపోతుంటాయి. ఎదుటి వారు తనపై ఎన్ని విమర్శలు సంధించినా, తనదైన వాక్చాతుర్యంతో వాటిని తిప్పికొట్టడంలో ఆయన దిట్ట. రేవంత్ రెడ్డికి ఉన్న అతిపెద్ద సానుకూలత ఆయన ప్రసంగ శైలి. ఎంతటి క్లిష్టమైన అంశాన్నైనా సామాన్యులకు అర్థమయ్యే రీతిలో, ఆకట్టుకునేలా చెప్పడం ఆయన ప్రత్యేకత. తెలంగాణా యాస, మాండలీకాలు, సందర్భోచిత సామెతలను జోడించి ప్రసంగించడంతో జనం ఆయన మాటలకు బాగా కనెక్ట్ అవుతున్నారు. ప్రత్యర్థులపై విమర్శలు చేసేటప్పుడు ఆయన చూపే చొరవ, వ్యూహాత్మకమైన దూకుడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఏ విషయంపైనైనా విపక్షాల నుంచి ఎదురయ్యే ప్రశ్నలకు ఆయన ఇచ్చే సమాధానాలు వినడానికి



ఆసక్తికరంగా ఉండి, జనంలోకి - మిగతా3లో

## తెలంగాణలో క్యూఆర్ కోడ్‌తో కొత్త
# స్మార్ట్ రేషన్ కార్డులు..

- 3 నెలల బియ్యం ఒకేసారి పంపిణీ
- వారం రోజుల్లో సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా కార్డుల పంపిణీ కార్యక్రమం
- క్యూఆర్ కోడ్‌తో పటిష్ఠ భద్రతా ఫీచర్లతో కొత్త కార్డుల రూపకల్పన
- ఆగస్టు నుంచి మూడు నెలల రేషన్ బియ్యం ఒకేసారి పంపిణీ
- రేషన్ సరుకులకు జులై 31 లోగా ఈ-కేవైసీ పూర్తి చేసుకోవడం తప్పనిసరి




తెలంగాణలో అర్హులైన పేదలకు కొత్త రేషన్ కార్డులు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. ప్రస్తుతం వినియోగిస్తున్న కాగితపు కార్డుల స్థానంలో అత్యాధునిక టెక్నాలజీతో కూడిన ప్లాస్టిక్ స్మార్ట్ కార్డులను పంపిణీ చేయనుంది. వారం రోజుల్లోనే ఈ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి ప్రారంభించేందుకు పౌరసరఫరాల శాఖ ముమ్మర ఏర్పాట్లు చేస్తోంది. హైదరాబాద్‌లో జరిగే ప్రధాన కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత పీవీసీ స్మార్ట్ కార్డుల రూపంలో రేషన్ కార్డులు ఇవ్వడం ఇదే తొలిసారి. ప్రస్తుతం లబ్ధిదారులు వాడుతున్న ఏ4 సైజు కాగితపు కార్డులు త్వరగా చిరిగిపోవడం, పాడైపోతుండటంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. కొత్తగా అందించే స్మార్ట్ కార్డులపై లబ్ధిదారుడి వివరాలతో పాటు ప్రత్యేకమైన క్యూఆర్ కోడ్, ఆహార భద్రతా కార్డు నంబర్‌ను ముద్రించారు. భద్రతా ఫీచర్లతో పాటు సీఎం రేవంత్ రెడ్డి, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఫొటోలు కూడా ఉంటాయి. ఈ స్మార్ట్ కార్డుల ద్వారా ప్రజా పంపిణీ వ్యవస్థలో మరింత పారదర్శకత వస్తుందని అధికారులు విశ్వసిస్తున్నారు. రాజధానిలో సీఎం కార్యక్రమాన్ని ప్రారంభిస్తుండగా, అదే సమయంలో రాష్ట్రంలోని - మిగతా3లో

## రూ.10వేలు చెల్లించి ఇందిరమ్మ ఇళ్లకు
# దరఖాస్తు చేసుకోవాలి

**: మంత్రి పొంగులేటి**

**హైదరాబాద్, జులై 20** : క్యూర్ పరిధిలో ఫ్లాట్ల కోసం రేపటి నుంచి ఆగస్టు 10వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వ్యాఖ్యానించారు. మీ సేవ, వాట్సాప్, వెబ్‌సైట్‌లో వీటికోసం దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. రూ.10వేల టోకెన్ చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. డ్రా పద్ధతిలో లబ్ధిదారుల ఎంపిక ఉంటుందని స్పష్టం చేశారు. డ్రాలో ఇల్లు రానివారి డబ్బులు వెంటనే చెల్లిస్తామని వెల్లడించారు. ఆయా ఫ్లాట్లు పదేళ్ల పాటు అమ్మరాదని.. అద్దెకు ఇవ్వరాదని షరతును విధిస్తామని అన్నారు. కుటుంబంలో ఒకరికి ఇళ్లకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు.

వారికి తొలివిడతలో ప్రాధాన్యం కల్పిస్తాం.. క్యూర్ పరిధిలో ఇల్లు, స్థలం లేనివారికి తొలివిడతలో ప్రాధాన్యం కల్పిస్తామని మంత్రి చెప్పుకొచ్చారు. లబ్ధిదారుల పేరిట స్థలం రిజిస్ట్రేషన్ చేస్తామని తెలిపారు. స్థలంతో పాటు రూ.5లక్షల సబ్సిడీ అందజేస్తామని పేర్కొన్నారు. ఈరోజు (సోమవారం) ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన వాట్సాప్ దరఖాస్తులు,



ా×+ ఇళ్ల బ్రోచర్‌లను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడారు.

**రూ.5లక్షల సహాయం అందజేస్తాం..**

వారికి స్థలం ఇవ్వడంతో పాటు రూ.5లక్షల సహాయం అందజేస్తామని మంత్రి పొంగులేటి వెల్లడించారు. పదేళ్ల వరకు ఇళ్లు అమ్ముకునే - మిగతా3లో

## కొడంగల్ లో రెండు రోజులపాటు
# సీఎం రేవంత్ పర్యటన

**హైదరాబాద్:** ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి మంగళవారం నుంచి రెండు రోజుల పాటు వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గంలో పర్యటించనున్నారు. దుద్యాల్ మండలం హకీంపేటలో ఎడ్యుకేషన్ హబ్ పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారు. అనంతరం ఉన్నతస్థాయి సమావేశంలో సమీక్షిస్తారు. రాత్రి కొడంగల్లో బసచేసి మరుసటి రోజు బుధవారం నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులను సమీక్షిస్తారు. ఎస్ ఐ ఆర్ కొనసాగుతున్న తీరును ముఖ్యమంత్రి పరిశీలిస్తారు. మధ్యాహ్నం తర్వాత తిరిగి హైదరాబాద్కు బయలుదేరుతారు.



# గులాబీ గ్రాఫ్ పెరిగినట్టేనా

**హైదరాబాద్, జూలై 20:** బీఆర్ఎస్ క్రమంగా తెలంగాణ లో పుంజుకుంటుందన్న విశ్లేషణలు వెలువడుతున్నాయి. ఎన్నికలకు ఇంకా సమయం ఉండగానే బీఆర్ఎస్ ఎఫెన్స్ లో వెళుతుంది. రేవంత్ ప్రభుత్వంపై విరుచుకుపడుతుంది. అవినీతి ఆరోపణలతో హామీలు అమలు చేయకపోవడంపై నిలదీస్తుంది. వర్గాల వారీగా విభజించుకుని వారిని సమీకరించడంలో కొంత గులాబీ పార్టీ సక్సెస్ అయినట్లు కనిపిస్తుంది. ప్రధానంగా



రైతులు, విద్యార్థులు, నిరుద్యోగులను లక్ష్యంగా చేసుకుని కారు పార్టీ హస్తానికి గురిపెట్టింది. దీంతో బీఆర్ఎస్ క్రమంగా బలం పెంచుకుంటుందన్న వార్తలు అధికార పార్టీలో కలవరం రేపుతున్నాయి. ఈ విషయాన్ని సొంత పార్టీకి చెందిన రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరి చెప్పారు. బీఆర్ఎస్ బలం పుంజుకుంటుందని చెప్పిన ఆమె తర్వాత మాట మార్చినప్పటికీ మీడియాలో అన్న వార్తలు ఇప్పటికే - మిగతా3లో


## పామాయిల్ ధర పెంపునకు
# మా ప్రభుత్వం కృషి చేస్తోంది

**: భట్టి విక్రమార్క**

**ఖమ్మం జిల్లా, జులై 20 :** పామాయిల్ ధర పెంపునకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. ఖమ్మం జిల్లా వ్యవసాయంపై ఆధారపడిన జిల్లా అని పేర్కొన్నారు. ఈ రోజు(సోమవారం) ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం అంజనాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన గోద్రెజ్ ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ కార్యక్రమానికి హాజరు కావాల్సి ఉందని.. వివిధ కారణాలతో సీఎం రాలేకపోయారని చెప్పుకొచ్చారు. ఈ సందర్భంగా రైతులకు సీఎం రేవంత్‌రెడ్డి తన శుభాకాంక్షలు తెలిపారని అన్నారు.

**ఖమ్మం జిల్లా రైతులు అన్నిరకాల పంటలు సాగు చేస్తారు..**

అంజనాపురంలో ఆయిల్ పామ్ కాంప్లెక్స్ నిర్మించిన గోద్రెజ్ సంస్థకు భట్టి విక్రమార్క కృతజ్ఞతలు తెలిపారు. ఖమ్మం జిల్లాలో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ నిర్మాణానికి విశేషంగా కృషిచేసిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకి అభినందనలు చెప్పారు. ఖమ్మం జిల్లా రైతన్నలు అన్ని



రకాల పంటలు సాగు చేస్తారని వెల్లడించారు. తాను ఎన్నో రకాల పంటలు సాగు చేశానని ఏ పంటకు రాని దిగుబడి ఆయిల్ పామ్‌కు వచ్చిందని మంత్రి తుమ్మల స్వయంగా తనతో చెప్పారని అన్నారు. చివరకు ప్రకృతి విపత్తులను కూడా ఈ పంట తట్టుకొని నిలబడుతుందని చెప్పుకొచ్చారు. పామాయిల్ సాగు చేసిన రైతులకు ఎంతో మేలు జరుగుతుందని వెల్లడించారు. దేశంలో 25 లక్షల మిలియన్ టన్నుల పామాయిల్ అవసరం ఉందని తెలిపారు. దేశంలో కేవలం 12 లక్షల మిలియన్ టన్నుల పామాయిల్ మాత్రమే ఉత్పత్తి అవుతుందని చెప్పుకొచ్చారు.

## పారదర్శకంగా పోలీస్
# ఉద్యోగాల భర్తీ

**డీజీపీ సీవీ ఆనంద్**

**హైదరాబాద్:** పోలీస్ ఉద్యోగాల భర్తీని పారదర్శకంగా నిర్వహిస్తామని డీజీపీ సీవీ ఆనంద్, తెలిపారు. పోలీస్ ట్రైనింగ్ కంప్యూటర్ సర్వీసెస్ విభాగాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భం గా పోలీస్ రిక్రూట్మెం ట్ బోర్డు పనితీరు నియామకాల పురో గతిని పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. తెలంగాణ పోలీస్ రిక్రూట్ మెంట్‌లో ఇప్పటి వరకు ఒక్క పేపర్ లీక్ కూడా జరగలేద ని, ఇదే బోర్డు విశ్వస నీయతకు నిదర్శన మని రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్ అన్నారు. పోలీసు నియామకాల్లో పార దర్శ కతకు తెలంగాణ ఆదర్శమని కొనియాడారు.సీసీటీఎన్ఎస్ జాతీయ స్థాయి బెంచ్‌మార్క్‌ను చేరుకోవాలంటే అందరూ కష్టపడి పనిచేయాలని సూచించారు. కొత్త టెక్నాలజీ వాడాలనీ, అన్ని యాప్‌లూ వినియోగించాలని చెప్పారు. రిక్రూట్మెంట్ ప్రక్రియను పారదర్శ కంగా, నిష్పాక్షికంగా, విశ్వసనీయంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.2022-23లో రాష్ట్ర చరిత్రలోనే - మిగతా3లో




## గోద్రెజ్ ఆయిల్ పామ్
# ఫ్యాక్టరీ ప్రారంభం..

### రైతులకు మంత్రి తుమ్మల పిలుపు..

**ఖమ్మం జిల్లా:** కొనిజర్ల మండలం అంజనాపురంలో నిర్మించిన గోద్రెజ్ ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఖమ్మం జిల్లాలో గోద్రెజ్ కంపెనీ ఆయిల్ పామ్ కాంప్లెక్స్ నిర్మించడం సంతోషంగా ఉందని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. ఈ కాంప్లెక్స్‌లో అత్యాధునిక సీడ్ గార్డెన్ ఏర్పాటు చేశారని తెలిపారు. గోద్రెజ్ కంపెనీకి అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పిస్తున్నామని, రైతులకు అన్ని విధాలా అందుబాటులో ఉండేలా కంపెనీ సేవలందించాలని ఆకాంక్షించారు. ఆయిల్ పామ్ సాగులో తెలంగాణ ముందు ఉందని మంత్రి తుమ్మల తెలిపారు. రాష్ట్రంలో పది లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగుకు కృషి జరుగుతోందని చెప్పారు. ఈ సందర్భంగా రైతులంతా ఈ పంట సాగుకు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఆయిల్ పామ్‌తో ఎలాంటి నష్టం ఉండదన్నారు. ఆయిల్ పామ్ కింద ఇప్పటికే మూడు ఫ్యాక్టరీల నిర్మాణం పూర్తయిందని, మరో ఆరు ఫ్యాక్టరీల నిర్మాణం జరుగుతోందని వెల్లడించారు. తెలంగాణ భూములు ఆయిల్ పామ్ సాగుకు అనుకూలమని మంత్రి పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో - మిగతా3లో



# సంపాదకీయం

## భార్యల చేతిలో భర్తల 'బలి'...

దేశంలో భర్తల భద్రతపై ఆందోళన పెంచుతున్న 'ఏకం న్యాయ్ ఫౌండేషన్' నివేదిక సంచలనం రేపుతోంది. 2026 జనవరి నుండి జులై 14 వరకు ఆరు నెలల కాలంలో ఏకంగా 554 మంది భర్తలు హత్యలు లేదా ఆత్మహత్యల కారణంగా ప్రాణాలు కోల్పోయినట్లు ఈ నివేదిక వెల్లడించింది. ఇందులో 322 మంది భార్యలు లేదా వారి ప్రియుల చేతిలో దారుణంగా హత్యకు గురయ్యారు. మిగిలిన 232 మంది వైవాహిక విభేదాలు, గృహహింస, మానసిక వేధింపుల కారణంగా ఆత్మహత్య చేసుకున్నారు. ప్రతిరోజూ సగటున ఇద్దరు భర్తలు హత్యకు గురవుతుండగా, ఒకరి కంటే ఎక్కువ మంది ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ మరణాల వెనుక వివాహేతర సంబంధాలు, కుటుంబ కలహాలు ప్రధాన కారణాలుగా నిలుస్తున్నాయి. కుటుంబ వ్యవస్థలో పెరుగుతున్న అశాంతి పురుషుల జీవితాలను తీవ్ర ప్రమాదంలోకి నెట్టేస్తోంది. ఈ గణాంకాలు సమాజంలో నెలకొన్న విషాదకర పరిస్థితులకు అద్దం పడుతున్నాయి.భర్తలపై జరుగుతున్న హత్యలు, ఆత్మహత్యలపై గురుగ్రామ్‌కు చెందిన ఏకం న్యాయ్ ఫౌండేషన్ విడుదల చేసిన తాజా నివేదిక తీవ్ర చర్చనీయాంశంగా మారింది. 2026 తొలి ఆరు నెలల్లో దేశవ్యాప్తంగా 554 మంది భర్తలు హత్యలు, ఆత్మహత్యలు చోటు చేసుకున్నట్లు ఏకం న్యాయ్ ఫౌండేషన్ సంస్థ వెల్లడించింది. అయితే ఇవి ప్రభుత్వ అధికారిక గణాంకాలు కాదని.. మీడియా కథనాలు, ఫౌండేషన్ సేకరించిన వివరాల ఆధారంగా రూపొందించిన డాక్యుమెంటేషన్ రిపోర్టు మాత్రమేనని స్పష్టం చేసింది.ఈ నివేదిక ప్రకారం.. మొత్తం 322 మంది భర్తలు హత్యకు గురయ్యారని తెలుస్తోంది. వీరిలో అత్యధిక కేసులు భార్యలు లేదా వారి వివాహేతర సంబంధాల నేపథ్యంలో జరిగిన కుట్రలతో ముడిపడి ఉన్నట్లు ఆ సంస్థ పేర్కొంది. మొత్తం హత్యల్లో 194 కేసులు (సుమారు 60.2 శాతం) వివాహేతర సంబంధాల కారణంగానే జరిగినట్లు ఆ రిపోర్టు వెల్లడించింది. భార్యలు, తమ ప్రియులతో కలిసి కట్టుకున్న భర్తలను హత్య చేసిన ఘటనలు ఎక్కువగా నమోదు అయ్యాయని ఆ నివేదిక తెలిపింది.అదే సమయంలో 232 మంది భర్తలు ఆత్మహత్యలకు పాల్పడినట్లు ఏకం న్యాయ్ ఫౌండేషన్ పేర్కొంది. వీటిలో కుటుంబ కలహాలు, గృహహింస, మానసిక వేధింపులు, తప్పుడు క్రిమినల్ కేసులు, పిల్లలను కలవనివ్వకపోవడం వంటి కారణాలు ప్రధానంగా ఉన్నాయని నివేదికలో వివరించింది. ఈ కేసుల్లో విషం పెట్టి చంపడం, గొంతు నులిమి హత్య చేయడం, విద్యుత్ షాక్ పెట్టి హతమార్చడం, సజీవదహనం చేయడం, మృతదేహాలను ముక్కలు ముక్కలుగా నరకడం, చంపేసి ప్రమాదంగా లేదా ఆత్మహత్యగా చిత్రీకరించడం వంటి అత్యంత దారుణమైన నేరాలు నమోదు అయినట్లు ఆ నివేదిక తెలిపింది.రాష్ట్రాల వారీగా చూస్తే అత్యధికంగా 93 హత్యలు, 103 ఆత్మహత్యలతో ఉత్తరప్రదేశ్ అగ్రస్థానంలో నిలిచినట్లు ఏకం న్యాయ్ ఫౌండేషన్ రిపోర్టు తెలిపింది. ఆ తర్వాత మధ్యప్రదేశ్, రాజస్థాన్, తెలంగాణ, మహారాష్ట్ర, హర్యానా, బీహార్, కర్ణాటక, గుజరాత్ రాష్ట్రాల్లో కూడా ఇలాంటి కేసులు ఎక్కువగా నమోదు అయ్యాయని పేర్కొంది.అయితే.. ఈ నివేదికపై ప్రభుత్వ అధికారిక ధృవీకరణ లేదని ఆ సంస్థ స్పష్టం చేసింది. దేశంలో భర్తల హత్యలు లేదా పురుషులపై గృహహింసకు సంబంధించిన ప్రత్యేక జాతీయ డేటాబేస్ లేకపోవడంతో అసలు సంఖ్య మరింత ఎక్కువగా ఉండే అవకాశం ఉందని ఏకం న్యాయ్ ఫౌండేషన్ అభిప్రాయం వ్యక్తం చేసింది. ఇటీవల ఉత్తరప్రదేశ్‌లోని మీరట్ జిల్లాలో జరిగిన ఘటన అందరినీ దిగ్భ్రాంతికి గురిచేసింది. అతుల్ పవార్ అనే వ్యక్తిని తన భార్య దామిని, ప్రియుడు తుషార్‌తో కలిసి విషసర్పంతో కాటేయించి చంపేసింది. భర్త పేరుపై ఉన్న 20 లక్షల రూపాయల బీమా సొమ్మును కాజేయాలని, ప్రియుడితో కలిసి జీవించాలని ఆమె పన్నిన పన్నాగం ఇది. నిందితులు పామును కొనుగోలు చేసి, నిద్రమాత్రలు కలిపిన పాలు తాగించి ఈ దారుణానికి ఒడిగట్టారు. పోలీసులు సాంకేతిక ఆధారాలు, కాల్ డేటాను విశ్లేషించి నిందితులను అరెస్టు చేశారు. 20 రోజుల క్రితమే కారుతో ఢీకొట్టి చంపేందుకు ప్రయత్నించినట్లు విచారణలో తేలింది. ఈ కేసు భార్యాభర్తల మధ్య పెరిగిపోయిన ద్వేషాన్ని, డబ్బు కోసం ఎంతటి దారుణానికైనా తెగించే కఠిన మనస్తత్వాలను కళ్లకు కట్టినట్లు చూపిస్తోంది. ఇలాంటి ఘటనలు కుటుంబ సంబంధాల పునాదులను పూర్తిగా దెబ్బతీస్తున్నాయి.వైవాహిక జీవితంలో నెలకొంటున్న ఇటువంటి తీవ్రమైన సమస్యలను పరిష్కరించేందుకు కౌన్సెలింగ్, చట్టపరమైన అవగాహన కార్యక్రమాలు అత్యవసరమని నిపుణులు సూచిస్తున్నారు. కేవలం చట్టం మాత్రమే కాకుండా, సామాజిక బాధ్యతతో కుటుంబ వ్యవస్థను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మానసిక ఒత్తిడి, అపార్థాలను తొలగించుకోవడానికి సంభాషణలు మాత్రమే సరైన మార్గం. పురుషులు కూడా తమ సమస్యలను పంచుకునే వేదికలు, మానసిక ఆరోగ్య సేవలు అందుబాటులోకి రావాలి. ఈ గణాంకాలు ప్రభుత్వాలు, సమాజం కలిసి పని చేయాల్సిన సమయం ఆసన్నమైందని హెచ్చరిస్తున్నాయి. భర్తల ప్రాణాలను కాపాడడం, కుటుంబాలను విచ్ఛిన్నం కాకుండా చూడడం అందరి బాధ్యత. రాబోయే రోజుల్లో అయినా ఇటువంటి దుర్మార్గమైన ఘటనలు తగ్గుతాయని, ఆరోగ్యకరమైన కుటుంబ సంబంధాలు నెలకొంటాయని ఆశిద్దాం. సామాజిక చైతన్యం ద్వారా మాత్రమే ఇటువంటి దారుణాలకు ముగింపు పలకడం సాధ్యమవుతుంది.ఈ సమస్య తీవ్రతను అంచనా వేయాలంటే అధికారిక గణాంకాల సేకరణ అవసరమని ఏకం న్యాయ్ ఫౌండేషన్ సంస్థ సూచించింది.

# వెంకటేశ్వర కాలనీలో టీటీడీపీ ప్రజా పథం కార్యక్రమం

**సికింద్రాబాద్:**సికింద్రాబాద్ పార్లమెంట్ ఖైరతాబాద్ నియోజకవర్గంలోని వెంకటేశ్వర కాలనీ డివిజన్ లో ప్రజా పదం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు అరవింద్ కుమార్ గౌడ్ పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు స్థానిక ప్రజల వద్దకు వెళ్ళినప్పుడు గత పది సంవత్సరాల బిఆర్ఎస్ పాలనలో ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో ఎక్కడ ఎలాంటి అభివృద్ధి జరగలేదని, గత తెలుగుదేశం పార్టీ హయాంలో జరిగిన అభివృద్ధి మాత్రమే కనబడుతుందని తెలుగుదేశం పార్టీ అభివృద్ధిని గుర్తు చేసుకున్నారు. స్థానికంగా డ్రైనేజ్, రోడ్లు ,విద్యుత్, మంచినీటి ,సమస్యల పైన పెద్ద ఎత్తున చర్చించారు. తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలకు పెద్ద ఎత్తున స్వాగతం పలకడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మాజీ ఎమ్మెల్యే కాట్రగడ్డ ప్రసూన గారు , సికింద్రాబాద్ పార్లమెంట్ నాయకులు నల్లెల కిషోర్, రాష్ట్ర పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి జివిజి నాయుడు, సికింద్రాబాద్ పార్లమెంట్ ముఖ్య నాయకులు బాలరాజ్ గౌడ్, సికింద్రాబాద్ నియోజకవర్గం ఇన్చార్జి వల్లారపు శ్రీనివాస్, కాసుల సుదర్శన్ రెడ్డి, తడక వినోద్, శ్యాంసుందర్, వెంకటేష్ చౌదరి, కరణం కిరణ్, భాను ప్రకాష్, హైదరాబాద్ పార్లమెంట్ ముఖ్య నాయకులు అన్వర్, వంశీకృష్ణ, రాష్ట్ర మాజీ బీసీ సెల్ నాయకులు బాలాజీ గోస్వామి, రాష్ట్ర మాజీ టిఎన్టిసి నాయకులు ఏబిఆర్ మోహన్, ఎం నరసింహ, ప్రకాష్, ప్రదీప్ గౌడ్, వెంకట్ ,పెద్ద రమేష్, పద్మ నరేష్, ఎం సిద్ధికి, రాజు నాయుడు, ఎండి సలీం, తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆర్మూరులో వేడెక్కిన రాజకీయం

**నిజామాబాద్, జూలై 20:**నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ నియోజకవర్గంలో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. స్థానిక కాంగ్రెస్, బీజేపీ శ్రేణుల మధ్య జరుగుతున్న తీవ్రమైన మాటల యుద్ధం సోషల్ మీడియా వేదికల నుండి క్షేత్రస్థాయి వరకు పాకింది. ముఖ్యంగా అంకాపూర్ గ్రామంలో బీజేపీ ఎమ్మెల్యే రాకేశ్ రెడ్డి నివాసం వద్ద కాంగ్రెస్ నాయకులు చేపట్టిన నిరసన కార్యక్రమం రాజకీయ ప్రకంపనలు సృష్టిస్తోంది. ఎమ్మెల్యేను నిలదీసేందుకు కాంగ్రెస్ కార్యకర్తలు ప్రయత్నించగా, తన ఇంటి వద్దే వేచి ఉంటానని రాకేశ్ రెడ్డి సవాల్ విసరడంతో ఉద్రిక్తత పెరిగింది. ఈ పరిణామాల నేపథ్యంలో స్థానిక రాజకీయాలు రసవత్తరంగా మారాయి. పోలీసులు రంగంలోకి దిగి పరిస్థితిని అదుపు చేసేందుకు ఆర్మూర్ పట్టణం, అంకాపూర్ గ్రామంలో 144 సెక్షన్ విధించారు. ఇరువర్గాల కార్యకర్తల పోటాపోటీ ఆందోళనలతో ఆర్మూర్ నియోజకవర్గం మొత్తం ఒక్కసారిగా అట్టుడికిపోతోంది. శాంతి భద్రతల దృష్ట్యా భారీ పోలీసు బలగాలను మోహరించారు.రాజకీయ వివాదానికి ప్రధాన కారణం ప్రభుత్వ పథకాలపై జరుగుతున్న విమర్శలే. సీఎం రేవంత్ రెడ్డి యువతులకు ఎలక్ట్రిక్ బైక్‌లు ఇస్తామని ప్రకటించి మోసం చేశారని బీజేపీ ఎమ్మెల్యే రాకేశ్ రెడ్డి ఆరోపించారు. దీనిపై కాంగ్రెస్ నాయకులు చాలా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే రాకేశ్ రెడ్డి గతంలో ఎన్నికల ప్రచార సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ నేతలు ప్రధానంగా ప్రస్తావిస్తున్నారు. తాను గెలిస్తే ప్రతి గ్రామంలో రూపాయికే వైద్యం అందుబాటులో ఉంచుతానని, సొంత డబ్బుతో ప్రతి ఊరిలోనూ ఇళ్లు నిర్మిస్తానని ఆయన ప్రజలకు వాగ్దానం




చేశారు. అయితే అధికారంలోకి వచ్చి ఇన్ని రోజులు గడిచినా ఆ హామీలు నెరవేర్చలేదని కాంగ్రెస్ ఆరోపిస్తోంది. ఈ చర్చ ఇప్పుడు ఆర్మూర్ ప్రజల్లో పెద్ద ఎత్తున హాట్ టాపిక్‌గా మారింది. రెండు పార్టీలు పరస్పరం విమర్శలు చేసుకుంటూ ప్రజలను ఆకట్టుకునేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నాయి.సోషల్ మీడియాలో కూడా ఈ రాజకీయ పోరు తారాస్థాయికి చేరింది. కాంగ్రెస్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఒకరిపై ఒకరు వ్యక్తిగత దూషణలు, విమర్శలతో పోస్టు పెడుతున్నారు. ఆన్‌లైన్ వేదికలపై జరుగుతున్న ఈ రచ్చ క్షేత్రస్థాయిలో ఉన్న కార్యకర్తలను మరింత రెచ్చగొడుతోంది. అంకాపూర్ ఎమ్మెల్యే నివాసం ముట్టడి ఘటన తర్వాత ఆర్మూర్ ప్రధాన కూడళ్లలో ఉద్రిక్తత నెలకొంది. నిరసనలు, ప్రతి నిరసనలతో సాధారణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాజకీయ నాయకుల మాటలతో కార్యకర్తలు వీధుల్లోకి రావడం, రాళ్లు రువ్వుకోవడం వంటి సంఘటనలు చోటు చేసుకున్నాయి. పోలీసులు కఠినంగా వ్యవహరిస్తూ ఎక్కడికక్కడ అడ్డుకుంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో సామాన్యులు బయటకు రావాలంటేనే భయపడుతున్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కంటే రాజకీయ కక్షలు, ప్రతీకారాలతోనే సమయం వృధా అవుతోందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. దీనిని నివారించేందుకు రాజకీయ పార్టీలు సంయమనం పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.పోలీసు యంత్రాంగం పరిస్థితిని గమనిస్తూ అత్యంత అప్రమత్తంగా వ్యవహరిస్తోంది. ఆర్మూర్ పట్టణంలోని కీలక ప్రాంతాల్లో పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 144 సెక్షన్ అమలు చేస్తూ, నిబంధనలను ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సోమవారం ఆందోళనలు తీవ్రతరం అవుతాయనే సమాచారంతో పోలీస్ ఉన్నతాధికారులు ఆర్మూర్ చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఎలాంటి ఊరేగింపులు, సభలు, సమావేశాలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. అంకాపూర్ గ్రామంలో ఎమ్మెల్యే ఇంటి వద్ద భారీగా బలగాలను ఉంచారు. ఒకవేళ పరిస్థితి చేజారితే అదనపు బలగాలను దించేందుకు కూడా సిద్ధంగా ఉన్నారు. శాంతి భద్రతలను కాపాడేందుకు పోలీసులు చేస్తున్న ప్రయత్నాలు ఆర్మూర్ ప్రజల్లో కొంతలో కొంత ఊరట కలిగిస్తున్నాయి. అధికార యంత్రాంగం కూడా ఈ వ్యవహారంలో చొరవ తీసుకుని రాజకీయ నాయకులతో చర్చలు జరపాల్సిన పరిస్థితి వచ్చింది.

# ఐపీఎస్ శిక్షణలో లైంగిక వేధింపుల కేసు.. ట్రైనీ అధికారి ఉదయ్ కృష్ణారెడ్డి ఆత్మహత్యాయత్నం

- మహిళా అధికారిణిపై వేధింపుల కేసు.. ఐపీఎస్ ట్రైనీ ఆత్మహత్యాయత్నం
- హైదరాబాద్‌లోని బంధువుల ఇంట్లో విషం తాగి అపస్మారక స్థితిలోకి
- అంతకుముందు తనపై వచ్చిన ఆరోపణలు అవాస్తవమని సోషల్ మీడియాలో పోస్ట్
- పోలీస్ కానిస్టేబుల్‌గా జీవితం ప్రారంభించి ఐపీఎస్‌కు ఎంపికైన ఉదయ్ కృష్ణారెడ్డి
- పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు



హైదరాబాద్‌లోని సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ నేషనల్ పోలీస్ అకాడమీ (ఎస్‌వీపీఎన్‌పీఏ)లో శిక్షణ పొందుతున్న ఐపీఎస్ ట్రైనీ అధికారి ఉదయ్ కృష్ణారెడ్డి ఆత్మహత్యాయత్నానికి పాల్పడటం తీవ్ర కలకలం రేపింది. తనతో పాటు శిక్షణ పొందుతున్న ఓ మహిళా అధికారిణిని లైంగికంగా వేధించారన్న ఆరోపణలపై కేసు నమోదైన మరుసటి రోజే ఈ ఘటన చోటుచేసుకుంది. మోతీనగర్‌లోని తన బంధువుల నివాసంలో ఉదయ్ కృష్ణారెడ్డి విషపూరిత పదార్థం సేవించి అపస్మారక స్థితిలోకి వెళ్లారు. బంధువులు వెంటనే అతడిని ఎస్ఆర్ నగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా, ప్రస్తుతం ఐసీయూలో చికిత్స పొందుతున్నారు.

**ఆరోపణలు అవాస్తవం అంటూ సోషల్ మీడియా పోస్ట్**

ఆత్మహత్యాయత్నానికి పాల్పడటానికి ముందు ఉదయ్ కృష్ణారెడ్డి సోషల్ మీడియాలో ఒక పోస్ట్ పెట్టారు. తనపై వచ్చిన ఫిర్యాదులు, పుకార్లన్నీ నిరాధారమైనవని, వాటిలో ఎలాంటి నిజం లేదని పేర్కొన్నారు. న్యాయవ్యవస్థపై తనకు పూర్తి నమ్మకం ఉందని, కచ్చితంగా న్యాయం గెలుస్తుందని విశ్వసిస్తున్నట్లు తెలిపారు. వాస్తవాలను నిర్ధారించుకున్న తర్వాతే వార్తలను ప్రసారం చేయాలని మీడియాను కోరారు.

**బాధితురాలి ఫిర్యాదులో తీవ్ర ఆరోపణలు**

30 ఏళ్ల మహిళా ఐపీఎస్ ట్రైనీ అధికారిణి ఆదివారం అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఉదయ్ కృష్ణారెడ్డిపై ఫిర్యాదు చేశారు. జూన్ 23 నుంచి జులై 10 మధ్య శిక్షణ సమయంలో అతను తనను లైంగికంగా వేధించాడని ఆమె ఆరోపించారు. వాట్సాప్ ద్వారా అసభ్యకర సందేశాలు పంపడం, తోటి ట్రైనీల ముందు తన గురించి తప్పుడు ప్రచారం చేయడం, మరో ట్రైనీతో తనకు లైంగిక సంబంధం అంటగట్టడం వంటివి చేశాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. తన ఫోన్ లాక్కుని, పాస్‌వర్డ్ చెప్పాలంటూ బెదిరించి, వ్యక్తిగత సందేశాలను చూశాడని ఆరోపించారు. అంతటితో ఆగకుండా తనకు తెలియకుండా తన ప్రైవేట్ వీడియోను రికార్డ్ చేసి, బ్లాక్‌మెయిల్ చేసే ఉద్దేశంతో దాన్ని తన భర్తకు పంపాడని ఆమె తన ఫిర్యాదులో వివరించారు.

**పోలీసుల కేసు నమోదు.. దర్యాప్తు**

బాధితురాలి ఫిర్యాదు మేరకు అత్తాపూర్ పోలీసులు ఉదయ్ కృష్ణారెడ్డిపై భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)లోని సెక్షన్లు 74, 75, 77, 78, 79, 127(2), 115(2), 351(2) లతో పాటు ఐటీ చట్టంలోని సెక్షన్లు 66ఇ, 67ల కింద కేసు నమోదు చేశారు. కేసు నమోదైన తర్వాత ఉదయ్ కృష్ణారెడ్డి పోలీస్ అకాడమీ నుంచి వెళ్లిపోయి బంధువుల ఇంట్లో ఆత్మహత్యకు ప్రయత్నించారు.

**కానిస్టేబుల్ నుంచి ఐపీఎస్ అధికారిగా..**

ప్రకాశం జిల్లా ఊళ్లపాలెంకు చెందిన ఉదయ్ కృష్ణారెడ్డి ప్రస్థానం ఎంతో స్ఫూర్తిదాయకం. ప్రభుత్వ పాఠశాలలో చదువుకుని, 2013లో కానిస్టేబుల్‌గా పోలీసు శాఖలో చేరారు. ఐపీఎస్ కావాలనే లక్ష్యంతో 2018లో ఉద్యోగానికి రాజీనామా చేశారు. మూడుసార్లు విఫలమైనా పట్టువదలకుండా, నాలుగో ప్రయత్నంలో 780వ ర్యాంకు సాధించి ఇండియన్ రైల్వే మేనేజ్‌మెంట్ సర్వీస్ (ఐఆర్ఎంఎస్)కు ఎంపికయ్యారు. అయినా ఐపీఎస్ కావాలన్న కలను వదులుకోలేదు. శిక్షణలోనే మరోసారి ప్రయత్నించి గత ఏడాది సివిల్స్‌లో 350వ ర్యాంకు సాధించి ఐపీఎస్‌కు ఎంపికయ్యారు. ఆయన విజయంపై ఏపీ సీఎం చంద్రబాబు కూడా 'ఎక్స్' వేదికగా "ధైర్యం, అవిశ్రాంత శ్రమ ఉంటే ఏ కలా అసాధ్యం కాదు. ఉదయ్ కృష్ణారెడ్డి ప్రయాణం దీనికి నిదర్శనం" అని ప్రశంసించారు. ఇంతటి స్ఫూర్తిదాయక ప్రస్థానం ఉన్న అధికారిపై తీవ్రమైన ఆరోపణలు రావడం, ఆయన ఆత్మహత్యాయత్నానికి పాల్పడటం ఐపీఎస్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. పోలీసులు ఈ కేసుపై దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# జిప్‌లైన్ ప్రమాదం.. 40 అడుగుల ఎత్తునుంచి పడ్డ పర్యాటకుడు..

**ఇంటర్‌నెట్ డెస్క్:** కర్ణాటకలోని దండేలీలో జిప్‌లైన్ ప్రమాదం చోటుచేసుకుంది. జిప్‌లైన్ రైడ్ చేస్తుండగా సేఫ్టీ లాక్ ఊడిపోవటంతో ఓ పర్యాటకుడు 40 అడుగుల ఎత్తునుంచి కిందపడిపోయాడు. దీంతో అతడికి తీవ్రగాయాలు అయ్యాయి. ఈ సంఘటనకు సంబంధించిన పూర్తి వివరాల్లోకి వెళితే.. విజయపురకు చెందిన కుబేర్ సుర్పూర్ అనే వ్యక్తి తన ఫ్యామిలీతో కలిసి పర్యటన నిమిత్తం దండేలీ రిసార్ట్‌కు వెళ్లాడు. అతడు జిప్‌లైన్ రైడ్ చేస్తుండగా.. జిప్‌లైన్ సేఫ్టీ లాక్ ఊడిపోయింది. దీంతో అతడు 40 అడుగుల ఎత్తునుంచి కిందపడిపోయాడు. కాళ్లు, చేతులు విరిగిపోయాయి. కుటుంబసభ్యులు హుటాహుటిన అతడిని దండేలీ గవర్నమెంట్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అక్కడినుంచి మిరాజ్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. రిసార్ట్ యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగానే ఈ ప్రమాదం



జరిగిందని కుబేర్ కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. జిప్‌లైన్ పరికరాల నిర్వహణ సరిగా లేదని, ఆ పరికరాలు తుప్పుపట్టిపోయి ఉన్నాయని అంటున్నారు. జిప్‌లైన్ పరికరాలు సరైన స్థితిలో ఉండి ఉంటే ఈ ప్రమాదం జరిగేది కాదని చెబుతున్నారు. ఈ ప్రమాదంపై రిసార్ట్ యాజమాన్యం పూర్తి స్థాయి బాధ్యత వహించాలని డిమాండ్ చేస్తున్నారు. ఇక, ఈ సంఘటనకు సంబంధించిన దృశ్యాలను ఓ వ్యక్తి తన మొబైల్ ఫోన్‌లో వీడియో తీశాడు. ఆ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఆ వీడియోపై స్పందిస్తున్న నెటిజన్లు.. రిసార్ట్ యాజమాన్యంపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బాధితుడికి న్యాయం జరగాలని డిమాండ్ చేస్తున్నారు.

## అధిష్ఠానం ఎంట్రీతో ఈటెల, బండి మధ్య

# గ్యాప్ తగ్గినట్టేనా..

**హైదరాబాద్, జూలై 20:**తెలంగాణ భారతీయ జనతా పార్టీలో గత కొంతకాలంగా సాగుతున్న అంతర్గత విభేదాలకు చెక్ పెట్టేందుకు అధిష్ఠానం ప్రయత్నాలు షురూ చేసింది. రాష్ట్రంలో పార్టీని అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా పెట్టుకున్న ఢిల్లీ పెద్దలు, ఇక్కడి కీలక నేతల మధ్య ఉన్న కోల్డ్ వార్‌ను ముగించడానికి నేరుగా రంగంలోకి దిగారు. ఇందులో భాగంగానే పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి సునీల్ బన్సల్, ఎమ్మెల్యే అభయ్ పాటిల్ ఆధ్వర్యంలో బుజ్జగింపుల పర్వం ఊపందుకుంది. రాష్ట్ర బీజేపీలో అత్యంత కీలక నేతలుగా ఉన్న కేంద్ర మంత్రి బండి సంజయ్, ఎంపీ ఈటల రాజేందర్ మధ్య సయోధ్య కుదిర్చేందుకు హైకమాండ్ గట్టి ప్రయత్నాలే చేస్తోందిఈ వివాదాన్ని వీలైనంత త్వరగా సమసిపోయేలా చూడాలనే పట్టుదలతో అధిష్ఠానం ఉంది. ఇందులో భాగంగానే శుక్రవారం రాత్రి ఈటల రాజేందర్ నివాసానికి వెళ్లిన అభయ్ పాటిల్, రాత్రి పొద్దుపోయే వరకు ఆయనతో సుదీర్ఘంగా చర్చలు జరిపారు. పార్టీ అంతర్గత పరిణామాలు, విభేదాలకు గల కారణాలపై ఆయనతో ఆరా తీశారు. అనంతరం బండి సంజయ్‌తో కూడా అభయ్ పాటిల్ భేటీ అయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ క్రమంలోనే ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ నివాసంలో ఒక కీలకమైన భేటీ జరగనుంది. ఈ మీటింగ్‌కు ఈటల రాజేందర్, బండి సంజయ్ ఇద్దరూ హాజరుకానుండటం విశేషం. అధిష్ఠానం దూతలుగా వచ్చిన సునీల్ బన్సల్, అభయ్ పాటిల్ సమక్షంలో ఈ ఇద్దరు



నేతలను ఒకే వేదికపైకి తెచ్చి, వారి మధ్య ఉన్న మనస్పర్థలను తొలగించడానికి లక్ష్మణ్ నివాసం వేదిక కాబోతోంది.కొంతకాలంగా ఈటల రాజేందర్, బండి సంజయ్ మధ్య సఖ్యత లోపించిన విషయం బహిరంగ రహస్యమే. ఒకరిపై మరొకరు పరోక్షంగా పలుమార్లు విమర్శలు, ఆరోపణలు గుప్పించుకున్నారు. ఈ ఇద్దరు నేతల మధ్య ఉన్న గ్యాప్ చూసి వారి అనుచరులు, అభిమానులు మరింత రెచ్చిపోయారు. పలు సందర్భాల్లో పరస్పర వ్యతిరేక పోస్టర్లు, ఫ్లెక్సీలు కూడా వెలిశాయి. ఈ అంతర్గత విభేదాలు క్షేత్రస్థాయిలో పార్టీ క్యాడర్‌ను తీవ్ర గందరగోళానికి గురిచేశాయి. ఈ ప్రభావం పార్టీ బలోపేతంపై పడుతుండటంతో ఢిల్లీ పెద్దలు అలర్ట్ అయ్యారు.ఇటీవల తెలంగాణలో పర్యటించిన జాతీయ నేతలు నితిన్ నబీన్, జేపీ నడ్డా సైతం రాష్ట్ర నేతలకు స్పష్టమైన సంకేతాలు ఇచ్చారు. వ్యక్తిగత విభేదాలను పక్కన పెట్టి, పార్టీ ప్రయోజనాలే పరమావధిగా పనిచేయాలని కరాఖండిగా చెప్పారు. అయినప్పటికీ ఆశించిన స్థాయిలో మార్పు రాకపోవడంతో, ఇప్పుడు నేరుగా హైకమాండ్ రాయబారాన్ని పంపింది.తెలంగాణలో అధికారమే పరమావధిగా భావిస్తున్న బీజేపీకి ఈ ఇద్దరు నేతలూ అత్యంత అవసరం. బండి సంజయ్ మాస్ లీడర్‌షిప్, కేడర్‌లో ఉన్న ఫాలోయింగ్ పార్టీకి ఎంత ప్లస్సో.. ఈటల రాజేందర్ రాజకీయ అనుభవం, వ్యూహాలు అంతే ముఖ్యం. వీరిలో ఏ ఒక్కరిని వదులుకోవడానికి లేదా దూరం పెట్టడానికి అధిష్ఠానం సిద్ధంగా లేదు. ఇద్దరి బలాలు కలిస్తేనే తెలంగాణలో అనుకున్న లక్ష్యాన్ని సాధించగలమని ఢిల్లీ పెద్దలు బలంగా నమ్ముతున్నారు.అధిష్ఠానం నేరుగా రంగంలోకి దిగడం, ఇవాళ ఎంపీ లక్ష్మణ్ నివాసంలో ఇద్దరు కీలక నేతలు ముఖాముఖి కూర్చోనుండటంతో ఈ భేటీపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఈ చర్చల తర్వాతైనా ఇద్దరు నేతలు తమ పంతాలను వీడి, పార్టీ కోసం కలిసి నడుస్తారని సాధారణ కార్యకర్తలు, క్యాడర్ ఆశగా ఎదురుచూస్తున్నారు. మరి ఢిల్లీ పెద్దల బుజ్జగింపులు ఎంతవరకు పారుతాయో, టీ బీజేపీలో ఈ అంతర్గత సంక్షోభానికి తెరపడుతుందో లేదో చూడాలి.

# ప్రజాధనం వృథాకు నిలువెత్తు సాక్ష్యం

**నల్గొండ, జూలై 20:**నల్లగొండ జిల్లాలోని 7బి డిస్ట్రిబ్యూటరీ కాలువ కోట్లాది రూపాయల ప్రజాధనం వృథాకు నిలువెత్తు సాక్ష్యంగా నిలిచింది. పీఏ పల్లి మండలంలోని అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుండి గుర్రంపోడు మండల ఎగువ ప్రాంతాల వరకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో ఈ ప్రాజెక్టును మొదలుపెట్టారు. 2008లో 19 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో 18 కిలోమీటర్ల మేర ఈ కాలువ తవ్వకానికి శ్రీకారం చుట్టారు. 2009 జనవరిలో ప్రారంభమైన పనులు అత్యంత నత్తనడకన సాగి 2018 నాటికి తానేదారిపల్లి వరకు మాత్రమే పూర్తయ్యాయి. ఆ ఏడాది అట్టహాసంగా నీటిని విడుదల చేసినా, ఆ తర్వాత అధికారుల నిర్లక్ష్యం కారణంగా కృష్ణా జలాలు మళ్లీ ప్రవహించలేదు. సుమారు దశాబ్ద కాలంగా ఈ కాలువ కేవలం కాగితాలకే పరిమితమై, నీటి కోసం ఎదురుచూసే రైతులకు కన్నీళ్లను మిగులుస్తూ శిథిలావస్థకు చేరింది.ఈ ప్రాజెక్టు వైఫల్యానికి కాలువ డిజైనింగ్‌లో జరిగిన తీవ్రమైన లోపాలే ప్రధాన కారణమని స్పష్టమవుతోంది. ఇతర కాలువల వలె కాకుండా, దీనిని ఏకంగా 9 నుండి 12 మీటర్ల లోతులో డీప్ కట్‌గా తవ్వడం శాపంగా మారింది. దీని ఫలితంగా కాలువలో నీరు ఉన్నప్పటికీ, అవి గ్రావిటీ ద్వారా పక్కనే ఉన్న ఆయకట్టు పొలాలకు చేరడం అసాధ్యంగా మారింది. గతేడాది వర్షాకాలంలో ముక్కపల్లి చెరువు తెగి వర్షపు నీరు కాలువలోకి చేరగా, డీప్ కట్ కారణంగా కేవలం ఊట నీరు పైకి వచ్చిందే తప్ప అసలైన సాగునీరు అందలేదు. పీఏ పల్లి, గుర్రంపోడు మండలాల్లోని మొత్తం 10 వేల ఎకరాల ఆయకట్టుకు ఈ కాలువ ద్వారా నీరు అందించాలనే ప్రణాళికలు అశాస్త్రీయ నిర్మాణాల కారణంగా విఫలమయ్యాయి. డివిజన్ల విభజన గందరగోళంతో అధికారులు బాధ్యత తీసుకోక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.ప్రస్తుతం మైలాపురం నుండి తానేదారిపల్లి వరకు కాలువ తవ్వకం పూర్తి కాగా, అక్కడి నుండి తేనపల్లి చెరువు వరకు జరగాల్సిన మరో 3 కిలోమీటర్ల పనులు పూర్తిగా నిలిచిపోయాయి. తానేదారిపల్లి చెరువును రిజర్వాయర్‌గా మార్చి, కొత్త డిజైన్‌తో ముందుకు వెళ్తామని చెప్పిన అధికారులు ఆ తర్వాత అటువైపు కన్నెత్తి చూడలేదు. గతంలో మంజూరైన నిధుల్లో ఇప్పటికీ 5 కోట్ల రూపాయలు మిగిలి ఉన్నప్పటికీ పనులు ముందుకు సాగకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం. ఒకవేళ ఈ 3 కిలోమీటర్ల పనులు సకాలంలో పూర్తయితే, అదనంగా మరో 3 వేల ఎకరాలు సాగులోకి వచ్చే అవకాశం ఉంది. అరకొర పనుల వల్ల కాలువ పక్కన ఉన్న రైతులు తమ పొలాల్లోకి వెళ్లలేని దుస్థితి నెలకొంది. అంతర్గత బ్రిడ్జిల నిర్మాణం పెండింగ్‌లో ఉండటంతో రైతులు తమ సాగు పనుల కోసం తీవ్ర ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తోంది.కాలువ తవ్వకం వల్ల రైతులు తమ పొలాలకు వెళ్లేందుకు వీలు లేకుండా బ్రిడ్జిలు లేక రెండు విధాలుగా నష్టపోతున్నారు. మిగిలి ఉన్న 5 కోట్ల రూపాయల నిధులను తక్షణమే విడుదల చేసి నిలిచిపోయిన పనులను పూర్తి చేస్తేనే రైతులకు ప్రయోజనం చేకూరుతుంది. గుర్రంపోడు, గుడిపల్లి వాగుల్లో చిన్న తరహా రిజర్వాయర్లను నిర్మిస్తే భూగర్భ జలాలు స్థిరంగా ఉంటాయని నిపుణులు సూచిస్తున్నారు. దీనివల్ల కాలువ నీటిపైనే ఆధారపడకుండా బోరు బావుల ద్వారా రైతులు పంటలు పండించుకునే వెసులుబాటు లభిస్తుంది. డీప్ కట్ వల్ల నీరు అందని ప్రాంతాల్లో చిన్నపాటి లిఫ్ట్ మెకానిజం ఏర్పాటు చేయడం ద్వారా ఆయకట్టుకు నీరు మళ్లించేలా రీడిజైన్ చేయాలి. ఏళ్లుగా సాగునీరు అందక అలమటిస్తున్న వేలాది ఎకరాల భూములకు సాగునీరు అందించి, రైతాంగానికి ఆర్థిక భరోసా కల్పించాలని ఆ ప్రాంత రైతులు వేడుకుంటున్నారు.ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి 7బి డిస్ట్రిబ్యూటరీకి శాశ్వత మోక్షం కల్పించాలని స్థానిక రైతులు కోరుతున్నారు. కోట్లాది రూపాయల నిధులు వృథా కాకుండా చూడటంలో జిల్లా యంత్రాంగం, స్థానిక ప్రజాప్రతినిధుల పాత్ర కీలకం. నీటిని వృథాగా పోనివ్వకుండా, ఆయకట్టు పరిధిలోని ప్రతి ఎకరానికి నీరు అందేలా ప్రణాళికలు రూపొందించడంపై దృష్టి సారించాలి. క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలను అంచనా వేయకుండా చేసిన పనులు అట్టహాసంగా మొదలై చివరకు విఫలమయ్యాయి. ఇప్పుడు మిగిలి ఉన్న నిధులను పారదర్శకంగా వినియోగించి, నిర్మాణ లోపాలను సరిదిద్దడం ద్వారా మాత్రమే రైతుల కష్టాలకు తెర పడుతుంది. సాగునీటి సౌకర్యం కల్పిస్తేనే ఈ ప్రాంతం సస్యశ్యామలం కావడమే కాకుండా, రైతులు వ్యవసాయంలో లాభాలను పొందే అవకాశం ఉంటుంది. అధికారులు తక్షణమే స్పందించి యుద్ధప్రాతిపదికన పనులను పూర్తి చేయాలి.నల్లగొండ జిల్లా సాగునీటి ప్రాజెక్టుల్లో జరిగిన ఈ తప్పిదాలు భవిష్యత్తులో ఇతర పథకాల అమలులో అధికారులకు హెచ్చరికగా మారాలి. కేవలం నిధులు ఖర్చు చేయడం కాకుండా, క్షేత్రస్థాయిలో ప్రణాళికలు, అధికారుల సమన్వయం ఉండటం చాలా అవసరం. 10 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించాలనే సంకల్పం నెరవేరాలంటే ఇంజనీరింగ్ విభాగం తక్షణమే రీడిజైన్ ప్రక్రియను చేపట్టాలి. 5 కోట్ల నిధుల వినియోగంలో జాప్యం జరగకుండా చూడాల్సిన బాధ్యత కలెక్టర్ కార్యాలయంపై ఉంది. రైతుల ఆందోళనలను పరిగణనలోకి తీసుకుని, తానేదారిపల్లి నుండి తేనపల్లి చెరువు వరకు కాలువ తవ్వకం పూర్తి చేయాలి. బ్రిడ్జిల నిర్మాణం, లిఫ్ట్ పాయింట్ల ఏర్పాటుకు ప్రాధాన్యత ఇస్తేనే ప్రాజెక్టు సార్థకత ఉంటుంది. ఇప్పటికైనా యంత్రాంగం మేల్కొంటేనే వేల ఎకరాలకు నీరు అంది రైతులకు ఆర్థిక ప్రయోజనాలు చేకూరడం సాధ్యమవుతుంది

## గోద్రెజ్ ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ప్రారంభం..

- మొదటి పేజీ తరువాయి

అన్ని జిల్లాల్లో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీల నిర్మాణం జరగాలన్నదే తన లక్ష్యమని చెప్పుకొచ్చారు. దక్షిణ భారతదేశ నేతలందరూ ఆయిల్ పామ్ దిగుమతిపై సుంకం తగ్గించాలని కోరుతున్నామని మంత్రి చెప్పారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.రైతులకు అవసరమైన అన్ని వసతులు కల్పిస్తున్నామని, ఆయిల్ పామ్ సాగుతో వారి జీవితాల్లో వెలుగులు నింపుతామన్నారు మంత్రి తుమ్మల. తన యాభై సంవత్సరాల వ్యవసాయ అనుభవంలో ఎన్నో పంటలు పండించామని, ఏ పంటకు రాని ఆదాయం దీనికి వస్తుందన్నారు. ఆయిల్ పామ్‌ను ఎన్టీఆర్ ప్రవేశపెట్టిన నాటి నుంచి తాను కూడా సాగు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. మరోవైపు, ఎల్‌నినో ప్రపంచాన్ని కబళించే పరిస్థితి ఉందని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. దాని కారణంగా రుతుపవనాలు సరిగా రాలేదని, మానవజాతి చేసిన విధ్వంసం తిరిగి మన పాలిటే మహమ్మారిగా మారిందన్నారు. దక్షిణ భారతదేశంలో ఎల్‌నినో ప్రభావం ఎక్కువగా ఉందని, ఉద్యానవన పంటల సాగుతో భూములను చల్లబరచాలని మంత్రి తుమ్మల పేర్కొన్నారు.

# ప్రసంగాలతో ఇచ్చిపడేస్తున్న రేవంత్..

- మొదటి పేజీ తరువాయి

బలంగా దూసుకెళ్తున్నాయి.రాజకీయ మైదానంలో తనను ఎదుర్కొనే ధీటైన వక్త ఎవరూ లేకపోవడం రేవంత్ రెడ్డికి పెద్ద అడ్వాంటేజ్. తనను విమర్శించే వారి ఫ్లాష్‌బ్యాక్‌ను బయటకు తీసి, జరిగిన పాత విషయాలను ఆధారాలతో సహా ప్రజల ముందు ఉంచడం ఆయన అలవాటు. దీనివల్ల ప్రత్యర్థులు డిఫెన్సివ్‌లో పడుతున్నారు. గతంలో జరిగిన నియామకాలు, అధికార దుర్వినియోగం వంటి అంశాలను ఆయన తనదైన శైలిలో గుర్తు చేస్తున్నారు. ఎవరైనా తనపై విమర్శలు చేస్తే, దానికి అంతకు పదింతలు ఘాటైన కౌంటర్ ఇవ్వడం రేవంత్ స్టైల్. తన ప్రసంగాల ద్వారా ప్రత్యర్థుల బలహీనతలను ఎత్తిచూపుతూ, వారిని అపహాస్యం చేయడం ఆయన వ్యూహం. ఈ మాటల యుద్ధంలో రేవంత్ రెడ్డిని ఓడించడం బీఆర్ఎస్ నేతలకు సవాలుగా మారింది. ఏ విమర్శకైనా ఆయన రెడీగానే ఉండటం, కౌంటర్ అటాక్‌లో ఆయన చూపే వేగం రాజకీయాల్లో ఆయనను అగ్రస్థానంలో నిలబెడుతోందిఇటీవల నిరుద్యోగ సమస్యపై బీఆర్ఎస్ చేసిన ఆందోళనలను రేవంత్ రెడ్డి తన మాటలతో తిప్పికొట్టారు. ముఖ్యంగా కేటీఆర్ విమర్శలకు ఆయన ఇచ్చిన జవాబు స్ట్రాంగ్ డోస్‌గా మారింది. కేసీఆర్ ప్రభుత్వంలో జరిగిన ఉద్యోగాల కేటాయింపులను ఆయన పక్కా డేటాతో బయటపెట్టారు. కేటీఆర్, హరీష్ రావు, కవిత, వినోద్ కుమార్ వంటి కుటుంబ సభ్యులకే కేసీఆర్ ఉద్యోగాలు ఇచ్చారని ఆయన ఎద్దేవా చేశారు. ఎన్నికల్లో ఓడిపోయిన వారికి సైతం పదవులు కట్టబెట్టి, నియామక పత్రాలు ఇవ్వడం కేసీఆర్ కే చెల్లిందని ఆయన విమర్శించారు. పదేళ్ల కాలంలో నాలుగు కోట్ల తెలంగాణా ప్రజలు కేసీఆర్ కుటుంబానికి ఉద్యోగాలు ఇస్తే, వారు సమాజానికి ఏమిచ్చారని రేవంత్ రెడ్డి సూటిగా ప్రశ్నించారు. ఈ వాదన జనాల్లోకి బాగా వెళ్లడంతో, బీఆర్ఎస్ వాదనలు నీరుగారిపోయాయి. ఆయన ప్రయోగించే ఈ రకమైన రాజకీయ అస్త్రాలు ప్రత్యర్థులను పూర్తిగా ఇరకాటంలోకి నెడుతున్నాయిరేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నంత వరకు బీఆర్ఎస్ పార్టీకి రాజకీయంగా కష్టమేనన్న భావన బలపడుతోంది. మాట్లాడితే చాలు, గత ప్రభుత్వ అక్రమాలను, తప్పులను ఆయన ప్రస్తావిస్తూ ప్రత్యర్థుల నోరు మూయిస్తున్నారు. ఆయన చేసే ప్రసంగాల్లో ఉండే స్పష్టత, వాస్తవికత ప్రజలను ప్రభావితం చేస్తున్నాయి. రేవంత్ రెడ్డి ఏమి చెప్పినా, ఏ విమర్శ చేసినా అది బలంగా ప్రజలకు అర్థమవుతోంది. కేసీఆర్ కుటుంబానికి మళ్ళీ అధికారం దక్కనిచ్చే ప్రసక్తే లేదని ఆయన చేస్తున్న భీషణ ప్రతిజ్ఞలు గులాబీ పార్టీకి నిద్రలేని రాత్రులను మిగులుస్తున్నాయి. మాటకారి వ్యూహకర్త అయిన రేవంత్ రెడ్డితో పెట్టుకోవడం అంటే ప్రమాదకరమని ఆ పార్టీ నేతలు గుర్తిస్తున్నారు. ఆయనతో గొడవ పెట్టుకుంటే ఒకటి అని నాలుగు మాటలు వినక తప్పదన్న అభిప్రాయం వ్యక్తం అవుతోంది. రాజకీయ వ్యూహాల్లో రేవంత్ రెడ్డి వేస్తున్న ప్రతి అడుగు బీఆర్ఎస్ పార్టీ పునాదులను కదిలిస్తోంది.రేవంత్ రెడ్డి రాజకీయ శైలిని గమనిస్తే, ఆయన ఎంతటి తీవ్రమైన విమర్శలనైనా సులువుగా స్వీకరిస్తారని అర్థమవుతుంది. ఆ విమర్శల నుండి పాఠాలు నేర్చుకుంటూనే, తిరుగుదాడి చేయడంలో ఆయన చూపే వేగం ప్రత్యర్థులను ఆశ్చర్యపరుస్తోంది. ఒక ముఖ్యమంత్రిగా తన బాధ్యతలను నెరవేరుస్తూనే, మరోవైపు రాజకీయ ప్రత్యర్థులకు సరైన సమాధానం ఇవ్వడంలో ఆయన రాజీ పడటం లేదు. జనాల్లోకి వెళ్ళడానికి ఆయన ఎంచుకున్న మార్గం, మాట్లాడే పద్ధతి ఈ తరం ఓటర్లకు చాలా బాగా అర్థమవుతోంది. సోషల్ మీడియాలో కూడా ఆయన మాటలు ట్రెండింగ్‌లో ఉంటాయి. ఇలా రేవంత్ రెడ్డి ఒకవైపు అభివృద్ధి పనులు చేస్తూనే, ఇంకోవైపు రాజకీయ ప్రత్యర్థులపై తన మాటల వేటను కొనసాగిస్తున్నారు. రేవంత్ రెడ్డిని రాజకీయంగా ఎదుర్కోవడం, ఆయన వేసే ప్రశ్నలకు సమాధానం చెప్పడం అనేది విపక్షాలకు రాబోయే రోజుల్లో మరింత కష్టతరంగా మారే అవకాశం పుష్కలంగా ఉంది.

## రాహుల్ గాంధీపై ప్రధాని మోదీ వ్యంగ్యాస్త్రాలు..

- మొదటి పేజీ తరువాయి

పరోక్షంగా సెటైర్ వేశారు. ఇటీవల 56 ఏళ్లు పూర్తి చేసుకున్న రాహుల్ గాంధీని కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడిగా ప్రచారం చేస్తుండటాన్ని ఉద్దేశించే ప్రధాని ఈ వ్యాఖ్యలు చేసినట్లు తెలుస్తోంది. 2014 లోక్‌సభ ఎన్నికల వేళ ప్రధాని మోదీది '56 అంగుళాల ఛాతీ' అంటూ పలువురు బీజేపీ నేతలు చెప్పారు. ఈ వ్యాఖ్యను కాంగ్రెస్ నేతలు అనేక సందర్భాల్లో విమర్శలకు ఉపయోగించారు. ఈ ఏడాది పార్లమెంట్‌లో చైనా అంశంపై మాట్లాడిన రాహుల్ గాంధీ.. '56 అంగుళాల ఛాతీ ఏమైంది?' అంటూ ప్రధాని మోదీపై విమర్శలు గుప్పించారు. ఆ వ్యాఖ్యలకు ప్రతిస్పందనగానే ఇప్పుడు మోదీ '56 ఏళ్ల యువకుడు' అంటూ కౌంటర్ ఇచ్చినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఎంపీ రాహుల్ గాంధీపై విమర్శలు చేస్తూనే స్కైరూట్ యువ బృందం సాధించిన విజయం దేశ యువతలో అపారమైన ఆత్మవిశ్వాసాన్ని నింపిందని మోదీ అన్నారు. అంతరిక్ష రంగంలో దేశ యువత సామర్థ్యానికి ఇది నిదర్శనమని కొనియాడారు. ప్రపంచ వేదికపై భారత ప్రతిష్ఠ రోజురోజుకూ పెరుగుతోందని, దేశ యువత ఆశయాలకు ఆకాశమే హద్దు కాదనే సందేశాన్ని ఈ విజయం ఇచ్చిందన్నారు.మరోవైపు, వర్షాకాల సమావేశాలు దేశ ప్రయోజనాల దిశగా సాఫీగా సాగాలని మోదీ ఆకాంక్షించారు. పార్లమెంట్‌లో వాస్తవాలు, తర్కంతో కూడిన చర్చలు జరగాలని సభ్యులకు ఆయన పిలుపునిచ్చారు. ప్రతి సభ్యుడి స్వరం వినిపించేలా సభ నడవాలని, అనవసర గందరగోళానికి తావు లేకుండా ప్రజా సమస్యలపై నిర్మాణాత్మక చర్చలు జరగాలని ప్రధాని మోదీ సూచించారు.

## రూ.10వేలు చెల్లించి ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తు చేసుకోవాలి

- మొదటి పేజీ తరువాయి

అవకాశం లేదని చెప్పుకొచ్చారు. జఖ=జులో మొదటి దశలో 16నియోజకవర్గాల్లో ఇస్తున్నామని.. త్వరలోనే మిగిలిన నియోజకవర్గాల్లో కూడా ఇళ్లు ఇస్తామని స్పష్టం చేశారు. ఆయా పార్టీలు, రాజకీయాలకు సంబంధం లేకుండా ఇళ్లను కేటాయిస్తామనిపేర్కొన్నారు. రాష్ట్రంలో రెండు లక్షల ఇందిరమ్మ ఇళ్లు పూర్తి అవుతున్నాయని ఇప్పటికే రెండు విడతల్లో ఏడు లక్షల ఇళ్లు మంజూరు చేశామని పేర్కొన్నారు. ఇప్పటి వరకు సొంత స్థలాలు ఉన్న వారికి ఇందిరమ్మ ఇళ్లు అందజేశామని వెల్లడించారు.

**ఇంటి స్థలంలేని పేదల కల నెరవేరుస్తాం..**

ఇంటి స్థలంలేని పేదలకు కూడా వీటిని అందజేయాలని తమ ప్రభుత్వం నిర్ణయించిందని మంత్రి పొంగులేటి వివరించారు. లాభం, స్వార్థం లేకుండా పేదలకు ఇళ్లు నిర్మించి అందజేస్తున్నామని పేర్కొన్నారు. CURE పరిధిలో ఇళ్లు కట్టించే పథకాన్ని ఈ రోజు ప్రారంభించామని తెలిపారు. ఇందుకోసం పదహారు నియోజకవర్గాల్లో స్థలాలు ఎంపిక చేశామని చెప్పుకొచ్చారు. 528 అడుగుల చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఫ్లాట్లను నిర్మిస్తున్నామని వెల్లడించారు. కేసీఆర్ హయాంలో తప్పిదాలతో అప్పుడు కట్టిన ఫ్లాట్లు ఉపయోగపడకుండా పోయాయని చెప్పారు. నగరానికి దూరంగా 35 కిలోమీటర్ల దూరంలో కట్టడంతో పేదలు అక్కడకు వెళ్లలేదని తెలిపారు.

**పేదలకు ఇళ్లు ఇస్తామంటే కొందరు హేళన చేశారు..**

చదరపు గజానికి లక్షల విలువ ఉండే కోర్ ప్రాంతంలో టవర్లు నిర్మించి పేదలకు ఇస్తామని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. పేదలకు ఇళ్లు ఇస్తామంటే కొందరు హేళన చేశారని అన్నారు. ఈ పథకం ఫెయిల్ అయితే విమర్శించాలని కొందరు సంతోషపడ్డారని చెప్పుకొచ్చారు. రాష్ట్రానికి ఆర్థిక ఇబ్బందులు ఉన్నా పేదలకు ఇంటి కల నెరవేర్చాలని తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని తెలిపారు. బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో కూడా ఇలా ఇళ్లు కట్టించి ఇవ్వడం లేదని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు.

## తెలంగాణలో క్యూఆర్ కోడ్‌తో కొత్త స్మార్ట్ రేషన్ కార్డులు..

- మొదటి పేజీ తరువాయి

మొత్తం 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో స్థానిక ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీల చేతుల మీదుగా లబ్ధిదారులకు కొత్త కార్డులు అందజేయనున్నారు. ఈ బృహత్తర కార్యక్రమం కోసం పౌరసరఫరాల శాఖ సమగ్ర ప్రణాళికను రూపొందించింది.

**ఒకేసారి మూడు నెలల బియ్యం**

ఇదిలాఉంటే.. రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో పేదలకు ఇబ్బంది కలగకుండా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ నెలలకు సంబంధించిన రేషన్ బియ్యాన్ని ఒకేసారి పంపిణీ చేయనుంది. ఆగస్టు 1 నుంచి నెల రోజుల పాటు రేషన్ దుకాణాలు తెరిచి ఉంటాయి. లబ్ధిదారులు మూడుసార్లు వేలిముద్రలు వేసి తమ కోటాను పొందవచ్చు. అయితే, ఈసారి రేషన్ సరుకులు పొందాలంటే ఈ-కేవైసీ తప్పనిసరి అని అధికారులు స్పష్టం చేశారు. ఈ-కేవైసీ పూర్తి చేసుకునేందుకు జులై 31ని ఆఖరి తేదీగా నిర్ణయించారు. ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారు కూడా తమకు దగ్గరలోని రేషన్ దుకాణంలో ఈ-కేవైసీ పూర్తి చేసుకోవచ్చని అధికారులు సూచించారు. గడువులోగా ఈ-కేవైసీ పూర్తి చేసుకోని వారికి రేషన్ సరుకులు అందవని స్పష్టం చేశారు.

## గులాబీ గ్రాఫ్ పెరిగినట్టేనా

- మొదటి పేజీ తరువాయి

సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. రేణుక అన్నారని కాదు కానీ.. ప్రతి ఒక్క కాంగ్రెస్ నేత మనసులో కూడా ఇదే అభిప్రాయం ఉన్నట్లు కనపడుతుంది. కేసీఆర్ బయటకు రాకపోయినా.. ఆయనపై చేసే వ్యక్తిగత విమర్శలు కూడా ఆ పార్టీకి సానుభూతిని తెచ్చి పెడుతున్నాయంటున్నారు. దీంతో పాటు ప్రభుత్వం ఇచ్చిన హామీలపై వరసగా బీఆర్ఎస్ సమావేశాలను నిర్వహిస్తూ ప్రజలను తమ వైపునకు తిప్పుకునే ప్రయత్నం చేస్తుంది. బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్ రావులు జనంలోకి వెళుతున్నారు. వారి పర్యటనలకు కూడా మంచి స్పందన లభిస్తుంది. ఇచ్చిన హామీలను కొన్నింటిని అమలు చేసినా, అమలు చేయని వాటిని ఫోకస్ చేయడంతో పాటు ఎరువులు కొరత, పంటలకు గిట్టుబాటు ధర లేకపోవడం, కరువు ఇలాంటి విషయాలన్నీ తమకు అనుకూలంగా మలచుకోవడంలో బీఆర్ఎస్ సక్సెస్ అయిందనే చెప్పాలి. నిన్న జరిగిన యువ సంగ్రామ సదస్సు కూడా విజయవంతం కావడంతో పాటు కేటీఆర్ తాము అధికారంలో ఉన్నప్పుడు తప్పులు జరిగాయని, వాటిని సరిదిద్దుకుంటామని హుందాగా వ్యవహరించడం కూడా ఒకింత జనానికి చేరువ చేసిందనే చెప్పాలి. మొత్తం మీద కాంగ్రెస్ అప్రతమత్తం కాకుంటే వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి రావడం అంత సులువు కాదన్న విశ్లేషణలు వెలువడుతున్నాయి

## పారదర్శకంగా పోలీస్ ద్యోగాల భర్తీ

- మొదటి పేజీ తరువాయి

అతిపెద్ద పోలీస్ నియామక ప్రక్రియ ద్వారా 16, 654 పోస్టులు భర్తీ చేసినట్టు వెల్లడించారు. ఇప్పటివరకు జరిగిన నియామకా ల్లో 95 శాతం కానిస్టే బుల్ పోస్టులు, 5 శాతం ఎస్‌ఐ పోస్టులే ఉన్నట్టు వివరించారు.2025 నోటిఫికేషన్ల లో 118 అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్, 1,743 డ్రైవర్ ఆపరే టర్ పోస్టుల భర్తీ ప్రక్రియ కొనసాగు తోందని తెలిపారు. తొలిసారిగా నిర్వహిం చిన ఫింగర్ ప్రింట్ అండ్ ఫోరెన్సిక్ పోస్టుల నియామకం లో 60 పోస్టులకు 57 మంది ఎంపికయ్యా రని వివరించారు.రిక్రూట్మెంట్‌లో 33 శాతం రిజర్వేషన్, బయోమెట్రిక్ వెరిఫికేషన్, ఆన్‌లైన్ దరఖాస్తు విధానం, ఆరఎఫ్ఐడీ టెక్నాలజీ, మొబైల్ అండ్ ఈ-మెయిల్ రిజిస్ట్రేషన్, నెగెటివ్ మార్కింగ్ వంటి సంస్కరణలను వివరించారు. పోలీస్ ట్రైనింగ్, పోలీస్ కంప్యూటర్ సర్వీసెస్ ఆధునికీకరణపై డీజీపీ పలు కీలక సూచనలు చేశారు. సమావేశంలో నూతన కమ్యూనికేషన్ సెట్లను డీజీపీ సి.వి. ఆనంద్ ఆవిష్కరించారు.

# సీఎం రేవంత్‌రెడ్డి వార్నింగ్.. ఎమ్మెల్యేల అలర్ట్



**హైదరాబాద్, జులై 20** : ఆయా నియోజకవర్గాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ నేతలను ఆదేశించారు. ఈ క్రమంలో సీఎం వార్నింగ్‌తో ఎమ్మెల్యేలు అప్రమత్తం అయ్యారు. ఆగస్ట్ 3వ తేదీ వరకు నియోజకవర్గాలకు పరిమితం కావాలని దిశానిర్దేశం చేశారు. సీఎం ఆదేశాలతో నియోజకవర్గాలకు ఎమ్మెల్యేలు వెళ్లారు. నిన్న(ఆదివారం) సాయంత్రం నుంచి 'సర్' కార్యక్రమాల్లో ఎమ్మెల్యేలు పాల్గొంటున్నారు. 21 నియోజకవర్గాల్లో 'సర్' పనితీరు బాగాలేదని ముఖ్యమంత్రి అభిప్రాయం వ్యక్తం చేశారు. నాలుగు నియోజకవర్గాల్లో 'సర్' కార్యక్రమాలు ప్రారంభించలేదని రిపోర్ట్‌లో వెల్లడైందని పేర్కొన్నారు. ఈనెల 30వ తేదీన మరోసారి 'సర్'పై రివ్యూ చేస్తామని తెలిపారు. ఆలోపు నేతలు పనితీరు మార్చుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి వార్నింగ్ ఇచ్చారు.

# మాజీ ఎమ్మెల్యే పోడెం వీరయ్య పతనానికి ఎవరు కారకులు ?

**ములుగు:** గిరిజన హక్కుల పరిరక్షణ కోసం ఎన్నో ఏళ్లుగా పోరాడుతూ, గిరిజన గూడాలకు వెలుగునిచ్చిన నాయకుడిగా గుర్తింపు పొందిన మాజీ ఎమ్మెల్యే పోడెం వీరయ్య పేరు మరోసారి భద్రాచలం నియోజకవర్గ రాజకీయాల్లో హాట్ టాపిక్గా మారింది. గిరిజన భూ హక్కులు, అటవీ హక్కులు, విద్య, ఉపాధి, సంక్షేమం వంటి అంశాలపై నిరంతరం ప్రజల మధ్య ఉంటూ పోరాడిన నాయకుడిగా ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉందని ఆయన అనుచరులు చెబుతున్నారు.గత ఎన్నికల్లో పోడెం వీరయ్య ఓటమికి ప్రధాన కారణం ప్రత్యర్థుల కంటే సొంత పార్టీలోని కొందరు నాయకుల వైఖరేనని ఆయన అనుచరులు ఇప్పటికీ ఆరోపిస్తున్నారు. ఆయన మంచితనాన్ని, నమ్మకాన్ని ఆసరాగా చేసుకుని రాజకీయంగా, ఆర్థికంగా ఎదిగిన కొందరు చివరికి ఎన్నికల సమయంలో సహకరించకుండా వెన్నుపోటు పొడిచారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఎన్నికల సమయంలో చోటుచేసుకున్న అంతర్గత విభేదాలు, సమన్వయ లోపం, కొందరు నాయకుల వ్యవహార శైలి కలిసి పోడెం వీరయ్య విజయావకాశాలను దెబ్బతీశాయని రాజకీయ వర్గాల్లో కూడా చర్చ జరుగుతోంది. అయితే ఈ విషయాలపై సంబంధిత నాయకులు బహిరంగంగా స్పందించిన సందర్భాలు లేవు.ఇదిలా ఉండగా, గత ఎన్నికల్లో తనకు వ్యతిరేకంగా జరిగిన రాజకీయ పరిణామాలను పోడెం వీరయ్య పూర్తిగా అర్థం చేసుకున్నారని, సరైన రాజకీయ అవకాశాన్ని ఎదురుచూస్తున్నారనే ప్రచారం నియోజకవర్గంలో వినిపిస్తోంది. ఒకవేళ ఆయన భవిష్యత్తులో పార్టీ మార్పు నిర్ణయం తీసుకుంటే భద్రాచలం రాజకీయాల్లో కొత్త సమీకరణాలు ఏర్పడే అవకాశముందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు..ప్రస్తుతం పోడెం వీరయ్య రాజకీయ అడుగుపై నియోజకవర్గ ప్రజలు, కార్యకర్తలు, రాజకీయ నాయకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఆయన ఏ నిర్ణయం తీసుకున్నా అది భద్రాచలం రాజకీయాలపై గణనీయమైన ప్రభావం చూపే అవకాశం ఉందని చర్చ జరుగుతోంది..అయితే, పోడెం వీరయ్య పార్టీ మార్పు లేదా భవిష్యత్తు రాజకీయ నిర్ణయాలపై ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.

# బహదూర్‌గూడ భూములపై తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలు




**హైదరాబాద్, జులై 20:** శంషాబాద్ మండలం, బహదూర్‌గూడ భూములపై తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. బహదూర్‌గూడ భూముల్లో ప్రభుత్వం ఎలాంటి తదుపరి చర్యలు తీసుకోవద్దని ఆదేశించింది. సర్వే నంబర్లు 3, 4లో ఉన్న 28 ఎకరాలు తమవేనంటూ నలుగురు రైతులు హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. హైకోర్టు సోమవారం ఆ పిటిషన్‌పై విచారణ జరిపింది. సర్వే నంబర్లు 3, 4లో ఉన్న 28 ఎకరాల భూమిలో పిటిషనర్లు 30 ఏళ్లుగా వ్యవసాయం చేస్తున్నారని పిటిషనర్ల తరఫు న్యాయవాది హైకోర్టుకు తెలిపారు. ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ వాదనలు వినిపించారు. పిటిషనర్లుగా ఉన్న నలుగురు రైతుల పాస్ పుస్తకాల్లో అధికారుల సంతకాలు లేవని, కొన్నేళ్లుగా అక్కడ వ్యవసాయం చేస్తున్నారు కాబట్టే తమ భూమి అంటున్నారని ఆయన హైకోర్టుకు తెలిపారు. ఆ భూమి ప్రభుత్వ భూమి అని అన్నారు. ఇరు పక్షాల వాదనలు విన్న హైకోర్టు పిటిషనర్ల తరఫు న్యాయవాది వాదనలతో ఏకీభవించింది. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు నలుగురు రైతుల భూముల్లో ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవద్దంటూ ఆదేశాలు జారీ చేసింది.

# ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి సస్పెన్షన్



**హైదరాబాద్, జులై 20:** లైంగిక ఆరోపణల నేపథ్యంలో ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డిపై హైదరాబాద్ నేషనల్ అకాడమీ చర్యలు తీసుకుంది. కృష్ణారెడ్డిని తాత్కాలికంగా సస్పెండ్ చేస్తూ నిర్ణయం తీసుకుంది. నేషనల్ పోలీస్ అకాడమీ ప్రివిలేజ్ కమిటీ నిర్ణయం మేరకు ఉదయ్ కృష్ణ రెడ్డిని ఎన్‌పీఏ నుంచి అధికారులు పంపించేశారు. ఉదయ్ కృష్ణారెడ్డి ప్రవర్తన గురించి మొదట ఎన్‌పీఏ అధికారులకు మహిళా ట్రైనీ ఐపీఎస్ ఫిర్యాదు చేశారు. సీసీటీవీ కెమెరాల ఆధారాలతో పాటు అన్ని ఎవిడెన్స్ సేకరించాక ఉదయ్ కృష్ణారెడ్డిపై ఆరోపణలు నిజమేనని ప్రివిలేజ్ కమిటీ నిర్ధారించింది. దీంతో తక్షణమే ఎన్‌పీఏ నుంచి సస్పెండ్ చేస్తూ ప్రివిలేజ్ కమిటీ నిర్ణయం తీసుకుంది. సర్వీస్‌లో జాయినింగ్‌కు సంబంధించి డీవోపీటీ దే తుది నిర్ణయం అని నేషనల్ పోలీస్ అకాడమీ అధికారులు చెబుతున్నారు.

# సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన మేయర్ కొలగాని శ్రీనివాస్..

**కరీంనగర్ జూలై 20:** కరీంనగర్ నగరంలోని 20వ డివిజన్లో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, ఎంపీ బండి సంజయ్ కుమార్ సహకారంతో రూ.70 లక్షల యుఐడిఎఫ్ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలోని అన్ని డివిజన్లకు సమాన ప్రాధాన్యతనిస్తూ మౌలిక సదుపాయాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి లభిస్తున్న నిధులను సమర్థంగా వినియోగించి రహదారులు, డ్రైనేజీలు తదితర అభివృద్ధి పనులను వేగవంతం చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, డిప్యూటీ మేయర్ వై. సునీల్ రావు, కార్పొరేటర్లు పర్వతం మల్లేశం, సుధగోని మాధవి కృష్ణ, గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం, మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

# గులాబీ కంచుకోటపై కాంగ్రెస్ కన్ను

**కరీంనగర్, జూలై 20:** తెలంగాణ రాజకీయ క్షేత్రంలో ఇప్పుడు సరికొత్త, అత్యంత వ్యూహాత్మకమైన అంతర్గత పోరాటం సాగుతోంది. నిన్నటివరకు తిరుగులేని రాజకీయ శక్తులుగా, అజేయమైన కోటలుగా వెలిగిన బీఆర్ఎస్ టాప్ లీడర్ల సొంత నియోజకవర్గాలపై అధికార కాంగ్రెస్ పార్టీ ప్రత్యేకంగా కన్నేసింది. గులాబీ దళపతి కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అడ్డా సిరిసిల్ల, ట్రబుల్ షూటర్ హరీష్ రావు కంచుకోట సిద్దిపేట నియోజకవర్గాల్లో పొలిటికల్ హీట్ అమాంతం పెరిగింది. ప్రధాన నేతలను నేరుగా ఢీకొట్టడం కంటే, వారి రాజకీయ పునాదులను కదిలించేలా ద్వితీయ శ్రేణి నాయకత్వాన్ని టార్గెట్ చేస్తూ కాంగ్రెస్ వేస్తున్న అడుగులు క్షేత్రస్థాయి రాజకీయాలను వేడెక్కిస్తున్నాయి.నిన్నటివరకు బీఆర్ఎస్ పార్టీకి వెన్నుముకగా నిలిచిన స్థానిక సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, మండల పార్టీ అధ్యక్షులను కాంగ్రెస్ స్థానిక నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లు వ్యూహాత్మకంగా ఆకర్షిస్తున్నారు. ముఖ్యంగా గజ్వేల్ -- సిద్దిపేట సరిహద్దు ప్రాంతాల్లో ఈ సైలెంట్ ఆపరేషన్ అత్యంత వేగంగా విస్తరిస్తోంది. టాప్ లీడర్లు హైదరాబాద్‌లోనే ఉంటూ అసెంబ్లీ లేదా మీడియా వేదికలపై కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాడుతుంటే, క్షేత్రస్థాయిలో మాత్రం హస్తం శ్రేణులు గ్రామాల్లోని కరడుగట్టిన బీఆర్ఎస్ కార్యకర్తలను టార్గెట్ చేస్తున్నారు. గజ్వేల్ లాంటి ప్రాంతాల్లో క్యాంప్ ఆఫీసుల చుట్టూ జరుగుతున్న రాజకీయ ఘర్షణలు, నిరసనలు కేవలం పైకి కనిపిస్తున్న ఊహాగానాలు కావు, లోపల మాత్రం కాంగ్రెస్ తన పనిని నిశ్శబ్దంగా పూర్తి చేస్తోంది. పదేళ్ల కాలంలో గ్రామాల్లో పనులు చేసి బిల్లులు రాక ఆర్థికంగా




ఇబ్బంది పడుతున్న మాజీ సర్పంచులు, నిధుల కొరతతో సతమతమవుతున్న ప్రజాప్రతినిధుల బలహీనతలను కాంగ్రెస్ పార్టీ క్యాష్ చేసుకుంటోంది. వారికి అధికార పార్టీ అండగా ఉంటుందనే భరోసా ఇస్తూనే, మూడు రకాల ఆకర్షణీయమైన వ్యూహాలను అమలు చేస్తోంది. త్వరలో రాబోయే నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పిస్తామని లేదంటే స్థానిక నిధుల కేటాయింపుల్లో ప్రాధాన్యత ఇస్తామని హామీలు ఇస్తోంది. దారికి రాకపోతే అధికార బలంతో స్థానిక పనులకు బ్రేకులు వేయడం లేదా సహకరించడం ద్వారా ఒత్తిడి పెంచుతోంది. బీఆర్ఎస్ అధిష్టానానికి, స్థానిక లీడర్లకు మధ్య గ్యాప్ పెంచేందుకు ప్రయత్నిస్తోంది. మీరు ప్రతిపక్ష పార్టీలో ఉంటే మీకు లాభం ఉండదని, అధికార పార్టీలోకి వస్తే గ్రామాల అభివృద్ధి సాధ్యమనే ప్రచారాన్ని క్యాడర్‌లోకి బలంగా తీసుకెళు న్నారు. దీనివల్ల నియోజకవర్గ కేంద్రాల్లో బీఆర్ఎస్ ఇంకా బలంగానే కనిపిస్తున్నా, లోపలి గ్రామాల్లో మాత్రం గులాబీ కోటల పునాదులు నెమ్మదిగా బలహీనపడుతున్నాయి.అయితే, ఈ ఆపరేషన్ కాంగ్రెస్‌కు అంత సులభంగా ఏకపక్షంగా సాగడం లేదు. సిద్దిపేట, గజ్వేల్ పరిసర ప్రాంతాల్లో హరీష్ రావు లాంటి సీనియర్ నేతలు రంగంలోకి దిగి డ్యామేజ్ కంట్రోల్ చర్యలు చేపట్టారు. అలకపాన్పు ఎక్కిన కార్యకర్తలను బుజ్జగించేందుకు, పార్టీ మారిన వారిని తిరిగి సొంత గూటికి చేర్చుకునేందుకు గట్టిగానే ప్రయత్నిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీల వైఫల్యాలను, స్థానిక సంస్థల ఎన్నికల జాప్యాన్ని ఎండగడుతూ రివర్స్ అటాక్ చేస్తున్నారు. అయినప్పటికీ, అధికార పార్టీ విసిరిన వ్యూహాత్మక వలయం వల్ల ద్వితీయ శ్రేణి నాయకత్వంలో కొంత అయోమయం స్పష్టంగా కనిపిస్తోంది. కంచుకోటలుగా భావించే ఈ మూడు నియోజకవర్గాల్లో క్యాడర్ గనుక చెల్లాచెదురైతే, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అది బీఆర్ఎస్ ఉనికికే ప్రమాదకరంగా మారే అవకాశం ఉంది.గులాబీ నేతలకు హస్తం పార్టీ వేస్తున్న ఈ గాలం కేవలం తాత్కాలిక రాజకీయ ప్రయోజనాల కోసం లేదా కేవలం స్థానిక లీడర్లను మార్చడం కోసం మాత్రమే కాదు. దీని వెనుక పెద్ద స్కెచ్ ఉంది. కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావులను రాష్ట్రస్థాయి రాజకీయాలపై దృష్టి పెట్టకుండా, వారి వారి సొంత నియోజకవర్గాల రక్షణలోనే నిరంతరం బిజీగా ఉంచాలనేది కాంగ్రెస్ మార్క్ హైలెవల్ పొలిటికల్ స్ట్రాటజీ. తద్వారా రాష్ట్రస్థాయిలో ప్రభుత్వంపై వారి దూకుడును తగ్గించవచ్చని కాంగ్రెస్ భావిస్తోంది. ఈ మైండ్ గేమ్‌లో అధికార కాంగ్రెస్ ఎంతవరకు సఫలమవుతుంది, గులాబీ త్రయం తమ కంచుకోటలను ఎలా కాపాడుకుంటుంది అనేది రాబోయే రోజుల్లో తేలనుంది.

# తెలంగాణ లో వైద్యం, ఆరోగ్యం పడకేసాయి

**మాజీ మంత్రి హరీష్ రావు**

**హైదరాబాద్:** బాన్సువాడ మాతా-శిశు ఆసుపత్రిలో శస్త్రచికిత్స అనంతరం తీవ్ర అస్వస్థతకు గురై నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలింతలను, వారి కుటుంబ సభ్యులను మాజీ మంత్రి హరీష్ రావు పరామర్శించాను. బాలింతల ఆరోగ్య పరిస్థితి, అందుతున్న వైద్యంపై నిమ్స్ డాక్టర్లను అడిగి తెలుసకున్నారు. అలాగే, ఖమ్మంలో జరిగిన దారుణ ఘటనలో తీవ్రంగా గాయపడి నిమ్స్ లోనే చికిత్స పొందుతున్న మైనర్ బాలికను కూడా పరామర్శించి, వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. బీఆర్ఎస్ పార్టీ వారికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.హరీష్ రావు మాట్లాడుతూ ...ఈ నెల 13వ తేదీన బాన్సువాడ ఆసుపత్రిలో డెలివరీకి వెళ్లిన 10 మంది మహిళలకు సిజేరియన్ ఆపరేషన్ చేసిన తర్వాత ఇన్ఫెక్షన్స్ సోకి పరిస్థితి విషమించింది. వారిని నిజామాబాద్ ఆసుపత్రికి, అక్కడి నుంచి నిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం నిమ్స్ లో ఫాతిమా, రుక్సానా, జ్యోతి, లక్ష్మీప్రియ, సునీత అనే ఐదుగురు బాలింతలు చికిత్స పొందుతున్నారు. ఈ ఐదుగురిలో ముగ్గురి పరిస్థితి అత్యంత విషమంగా ఉంది. తెల్ల రక్త కణాలు తగ్గిపోవడం, ఊపిరితిత్తులు మరియు కిడ్నీలలో ఇన్ఫెక్షన్ కారణంగా వారు ఐసీయూలో డయాలసిస్ పైన ఉన్నారు. ఈ దారుణమైన సంఘటన జరిగి 10 రోజులు కావస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం నుంచి కనీస స్పందన లేదు. ఏ ఒక్క మంత్రి, ఎమ్మెల్యే లేదా వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారి వచ్చి బాధితులను పరామర్శించిన పాపాన పోలేదని అన్నారు.అసలు ఈ సంఘటన ఎందుకు జరిగింది? దీని వెనుక ఉన్న కారణాలు ఏంటి? అని తెలుసుకునే కనీస ప్రయత్నం కూడా ప్రభుత్వం చేయలేదు. ఇప్పటివరకు పూర్తి స్థాయి విచారణకు కూడా ఆదేశించకపోవడం దారుణం. బాలింతలు పూర్తిగా కోలుకోకపోతే రేపు ఆ పసిపిల్లల్ని ఎలా చూసుకోవాలి. ఆ కుటుంబ పరిస్థితులు ఎంత దారుణంగా దెబ్బతింటాయో ప్రభుత్వం ఒక్కసారి ఆలోచించాలి. 10వ తేదీన ఆరుగురికి సిజేరియన్ చేసినప్పుడు వారికి ఇన్ఫెక్షన్ వచ్చిందని తెలిసిన తర్వాత కూడా.. అదే థియేటర్లో మళ్ళీ మరో నలుగురికి సిజేరియన్ ఎందుకు చేశారు.. ఆపరేషన్ జరిగిన వారికి రాత్రి నుంచే మోషన్స్, వాంతులు, చలిజ్వరంతో ఇబ్బంది పడుతున్నా.. అదే ఆపరేషన్ థియేటర్లో మరో నలుగురికి సిజేరియన్ చేయడం వల్ల వారు కూడా ఇన్ఫెక్షన్ బారిన పడ్డారు. ఆపరేషన్ థియేటర్లో మెయింటెనెన్స్ సరిగా లేకపోవడం వల్లే ఇన్ఫెక్షన్ సోకిందని, డాక్టర్ల నిర్లక్ష్యానికి తాము బలయ్యామని బాధిత కుటుంబాలు చెబుతున్నాయి. కాలం చెల్లిన మందులు వాడటం వల్లే తమకు ఈ పరిస్థితి ఏర్పడిందని ఇంకొక పేషెంట్ బంధువులు ఆరోపిస్తున్నారు. ఇంత తీవ్రమైన ఘటన జరిగితే ప్రభుత్వం ఎందుకు గోప్యంగా ఉంచే ప్రయత్నం చేస్తోంది? దీనిపై ఎందుకు విచారణకు ఆదేశించలేదు.. ఈ ఘటనపై తక్షణమే పూర్తి స్థాయి విచారణ జరపాలి. నిర్లక్ష్యానికి కారణమైన వారిపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం. ఒక పేషెంట్ నిజామాబాద్ లోని ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్తే రెండు రోజుల్లోనే 3 లక్షల రూపాయలు ఖర్చు అయ్యాయి. వంటి మీదున్న బంగారం అమ్ముకుని, మూడు రూపాయల వడ్డీకి అప్పు తెచ్చి ఖర్చు పెట్టినా తన బిడ్డ ఆరోగ్యం ఇంకా మెరుగుపడలేదని ఆ తల్లి కన్నీరుమున్నీరుగా విలపిస్తోంది. ఇది ముమ్మాటికీ ప్రభుత్వ నేరపూరితమైన నిర్లక్ష్యం. రాష్ట్రంలో వైద్య ఆరోగ్య శాఖ పూర్తిగా పడకేసిందని అన్నారు.10 మంది మహిళల ప్రాణాలతో చెలగాటమాడినా ఈ ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు కూడా లేదు. మీ ఇందిరమ్మ పాలనలో మహిళల ప్రాణాలకు రక్షణ లేకుండా పోయింది. ఇందిరమ్మ పాలన అనేది కేవలం మాటల్లోనే ఉంది. మొన్నటికి మొన్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఆసుపత్రిలో జాయిన్ చేసుకోకపోవడం, బెడ్ ఇవ్వకపోవడం వల్ల నిలబడే బిడ్డకు జన్మనిచ్చిన హృదయ విధారకమైన సంఘటన ఈ రాష్ట్రంలో జరిగింది. తల్లులకు సోకిన ఇన్ఫెక్షన్ పాల రూపంలో పసిపిల్లలకు కూడా చేరి.. ఆ పిల్లలు జాండిస్ తో రకరకాల ఇబ్బందులు పడుతూ నీలోఫర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పరిస్థితి ఏర్పడింది. ఈ ప్రభుత్వం ప్రభుత్వ ఆసుపత్రులను గాలికి వదిలేసింది. కేసీఆర్ గారి ప్రభుత్వం ఉన్నప్పుడు బిడ్డ కడుపులో పడగానే న్యూట్రిషన్ కిట్, పుట్టగానే కేసీఆర్ కిట్ ఇచ్చాం. ఆరోగ్య లక్ష్మి



పథకం కింద పాలు, పౌష్టికాహారాన్ని అందించాం. కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో డెలివరీలు కేవలం 30-35% ఉంటే, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో దానిని 72 శాతానికి తీసుకువెళ్ళాం. కానీ ఈరోజు మళ్ళీ అది 50 శాతానికి పడిపోయింది. సి సెక్షన్ రేటు విపరీతంగా పెరిగిపోయింది. ఆసుపత్రులను మానిటర్ చేయడంలో ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందింది. రేవంత్ రెడ్డి ఏమీ బంద్ చేయలేదు అంటారు, కానీ న్యూట్రిషన్ కిట్, కేసీఆర్ కిట్ బంద్ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మందులు సకాలంలో లేకపోవడం వల్ల నమ్మకం సన్నగిల్లి డెలివరీల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మదర్ మోర్టాలిటీ రేటును 92% నుంచి 43 కు తగ్గించి, దేశంలోనే మూడవ ఉత్తమ రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దాం. కానీ మీ హయాంలో ప్రభుత్వ ఆసుపత్రులకు సుస్తీ పట్టింది. ఈ సంఘటన మీద మీరేమైనా ఎంక్వయిరీ ఆర్డర్ చేశారా? చేస్తే ఆ ఎంక్వయిరీ రిపోర్ట్ బయట పెట్టండి. ఆ సిబ్బంది ఎవరు, డాక్టర్స్ ఎవరు అన్నది వెల్లడించి వారిపై యాక్షన్ తీసుకోవాలి. ఆ తల్లులకు కాళ్లు వాపులు వస్తున్నాయి, డయాలసిస్ జరుగుతోంది. భవిష్యత్తులో కూడా లైఫ్ లాంగ్ డయాలసిస్ తీసుకోవాల్సి వస్తే మా పుట్టిన పిల్లల పరిస్థితి ఏంటి అని ఆ తల్లులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. బాధిత కుటుంబాలకు పూర్తి స్థాయి వైద్యం అందించి, వారికి తగిన ఎక్స్ గ్రేషియా ఇచ్చి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని అన్నారు.

# చామకూర దారెటు..

**హైదరాబాద్, జూలై 20:** తెలుగు నేల రాజకీయాల్లో బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి వ్యవహారం ఎప్పటికప్పుడు హాట్ కేక్ మాదిరిగానే ఉంటోంది. ఏ పార్టీలో ఉన్నా తనదైన మార్కు రాజకీయం, తనదైన మార్కు వ్యవహారంతో మల్లారెడ్డి నిత్యం వార్తల్లోనే ఉంటారు. ప్రస్తుతం బీఆర్ఎస్ లో కొనసాగుతున్న మల్లారెడ్డి... ఆ పార్టీని వీడతారంటూ చాన్నాళ్లుగా వార్తలు వినిపిస్తూనే ఉన్నాయి. అయితే ఎప్పటికప్పుడు ఆ వాదనలను కొట్టిపారేస్తున్న సీనియర్ నేత... మళ్లీ అవే వార్తలకు బలం చేకూర్చేలా వ్యవహారం నడుపుతూ నిజంగానే వార్తల్లో నేతగా నిలుస్తున్నారు. తాజాగా మల్లారెడ్డికి చెందిన ఓ వీడియో తెగ వైరల్ అవుతోంది. ఈ వీడియోను చూస్తుంటే... ఇక మల్లారెడ్డి బీఆర్ఎస్ కు వీడ్కోలు పలికినట్టేనన్న వాదనలు ఆసక్తి రేకెత్తిస్తున్నాయి.తెలంగాణ రాజకీయాల్లో అత్యంత చర్చనీయాంశంగా మారిన ఈ వీడియోలో మల్లారెడ్డి అసలు నోరు మెదపనే లేదు. ఈ వీడియోలో కాంగ్రెస్ పార్టీ కీలక నేత, తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ప్రసంగిస్తున్నారు. తన ప్రసంగంలో ఆయన బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావుపై ఓ రేంజిలో విమర్శలు గుప్పిస్తున్నారు. కేసీఆర్ పై ఆ రేంజిలో రేవంత్ విమర్శలు గుప్పిస్తూ ఉంటే...ఆయనకు వెనుక...ఆయనకు దాదాపుగా ఆనుకుని కూర్చుని ఉన్న మల్లారెడ్డి... తన ముఖంలో ఏ భావమూ కనిపించనీయకుండా అలా కూర్చుండి కనిపిస్తున్నారు..కేసీఆర్ బీఆర్ఎస్ అధినేతనే కదా. అంతేనా... టీడీపీ నుంచి బీఆర్ఎస్ లోకి రాగానే ఎమ్మెల్యే టికెట్ తో పాటుగా ఏకంగా మంత్రి పదవి ఇచ్చి... మల్లారెడ్డికి రాజకీయంగా అత్యధిక ప్రాధాన్యం కల్పించిన నేతగా కేసీఆర్ ఉన్నారు. అలాంటి కేసీఆర్ ను రేవంత్ రెడ్డి



ఓ రేంజి విమర్శలు సంధిస్తూ ఉంటే... మాట మాత్రంగా కూడా స్పందించని మల్లారెడ్డి...కనీసం అక్కడి నుంచి వెళ్లిపోవాలన్న సోయి కూడా లేకుండా కూర్చుని ఉన్నారంటూ బీఆర్ఎస్ నేతలు, రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా కొనసాగుతూ కేసీఆర్ ను ఆ రేంజిలో విమర్శలు గుప్పిస్తున్న వేదికపై అలా కూర్చుని ఉండిపోయిన మల్లారెడ్డి తీరు చూస్తుంటే... ఆయన గులాబీ పార్టీ నుంచి వేరు పడాలని దాదాపుగా నిర్ణయించుకున్నారన్న సరికొత్త విశ్లేషణలు రేకెత్తిస్తున్నాయి. బీఆర్ఎస్ పార్టీ అదికారం కోల్పోయిన తర్వాత అధికారం చేజిక్కించుకున్న కాంగ్రెస్ లోకో, లేదంటే కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీలోనో మల్లారెడ్డి చేరిపోయే దిశగా సాగుతున్నారన్న వార్తలు నిత్యం వినిపిస్తూనే ఉన్నాయి. అంతేకాకుండా తనతో ఉప్పూనిప్పులా వ్యవహరించిన రేవంత్ రెడ్డి నేతృత్వంలో జరిగిన సమావేశంలో మల్లారెడ్డి అలా స్పందన లేకుండా కూర్చున్నారంటే.. ఆయన బీఆర్ఎస్ ను వీడి కాంగ్రెస్ లో చేరిపోవాలని నిర్ణయించుకున్నట్టేనన్న వాదనలు వినిపిస్తున్నాయి. మరి ఏం జరుగుతుందో చూడాలి.

# తిరుమల ఘాట్ రోడ్డులో ప్రమాదం...

**తిరుమల:** సోమవారం ఉదయం తిరుమల ఘాట్ రోడ్డులో ప్రమాదం జరిగింది. రెండో ఘాట్ రోడ్డులోని 39వ మలుపు వద్ద కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న రక్షణ గోడను ఢీకొట్టింది. అదృష్టవశాత్తూ ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్కు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకున్నారు.

# దేశరాజుపల్లిలో డంపింగ్ యార్డు వద్దు..

**జై భీం యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ధర్నా**



**కరీంనగర్ జూలై 20:** కొత్తపల్లి మండలంలోని దేశరాజుపల్లి గ్రామంలో డంపింగ్ యార్డుకు వ్యతిరేకంగా సోమవారం జై భీం యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ధర్నా. కార్యక్రమం నిర్వహించారు. కొత్తపల్లి మున్సిపాలిటీకి చెందిన చెత్త వాహనాలు ప్రతిరోజూ గ్రామంలోని డంపింగ్ యార్డులో చెత్తను వేయడం వల్ల దుర్వాసన, కాలుష్యం ఏర్పడి చుట్టుపక్కల ప్రజలు తీవ్ర ఇబ్బందులు.ఎదుర్కొంటున్నారని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే గ్రామంలో చెత్త డంపింగ్ నిలిపివేసి ప్రజలకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎల్లపెల్లి లచ్చయ్య, ఉపసర్పంచ్ ఎం.డి. హైదర్, వార్డు సభ్యులు, జై భీం యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు కొత్తూరి అరవింద్, గ్రామ యువకులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# మంత్రి చేసిన అభివృద్ధి శూన్యం

**ఆత్మకూర్ జులై20( స్కై న్యూస్):**కాంగ్రెస్ పార్టీ నాయకుల మాటలు ఏమో కోటలు దాటుతున్నాయి కానీ పనులేమో గడప కూడా దాటలేదు.....మంత్రి వాకిలి శ్రీహరి గారు గెలిచి వచ్చే డిసెంబర్ తో మూడు సంవత్సరాలు పూర్తవుతుంది కానీ అమరచింత పట్టణంలో ఇప్పటివరకు మంత్రి గారు చేసిన అభివృద్ధి శూన్యం అని టిఆర్ఎస్ నాయకులు మండిపడ్డారు మంత్రి మీద అమరచింత మున్సిపాలిటీకి అభివృద్ధి 16కోట్లు మంజూరు చేసిన అని చెబుతున్నారుకానీ 16 కోట్ల దేవుడెరుగు కనీసం ఈ రెండున్నర సంవత్సరాలలో అమర్చింతలో రాష్ట్ర ప్రభుత్వం నిధుల చేత గాని మరియు టిడిపి గానీ 16 మీటర్లులసీసీ రోడ్డు కూడా వేయలేదు కాంగ్రెస్ పార్టీ నాయకులు పొద్దున లేస్తే ధర్మాపురం నందిమల్ల మస్తిపురం రోడ్ల గురించి మాట్లాడతారు మస్తీపురం నుంచి జూరాల డాం వరకు టిఆర్ఎస్ పార్టీ మా ప్రభుత్వంలోనే శాంక్షన్ అయిన మా టిఆర్ఎస్ ప్రభుత్వంలో రోడ్డు పనులు మొదలు కావడం జరిగింది. ధర్మపురం నందిమల్ల రోడ్డు బిఆర్ఎస్ పార్టీ ప్రభుత్వంలో మంత్రి వాకిట్టిశ్రీహరి ఆయనకు మంత్రి పదవి వచ్చిరెండున్నర సంవత్సరాలు గడిచిన అభివృద్ధి మాత్రం శూన్యం అనే బిఆర్ఎస్ నాయకులు మండిపడుతున్నారుచిట్టెం రామ్మోహన్ రెడ్డి గారు ఎమ్మెల్యేగా ఉండే మక్తల్ కి 150 పడకల ఆసుపత్రి డిగ్రీ కళాశాల గురుకుల పాఠశాల ఫైర్ స్టేషన్ కోర్టు మంజూరు తెచ్చాడు అదేవిధంగా అమరచింత పట్టణంలో



ప్రతి వార్డులో దాదాపు 3.50 కోట్లుమరియు ఎస్ డి ఎఫ్ నిధులచే సిసి రోడ్లు డ్రైనేజీలు పల్లె ప్రకృతి వనాలు క్రీడ ప్రాగణాలు జిల్లా కుల సంఘాలు భవనాలకు నిధులు మరియు శాంక్షన్ చేశారు అమర్ చింతల్ లోనే ప్రతి గ్రామాలకు సిసి రోడ్లు రైతు వేదికలు మన ఊరు మనబడి కార్యక్రమంలో భాగంగా స్కూల్ కొత్త భవనాలు కట్టడాలు కొత్త గ్రామపంచాయతీ భవనాలు దళిత బంధు ఇలా చాలా చాలా చిట్టెం రామారెడ్డి ఆధ్వర్యంలో ఇన్ని సంక్షేమ పథకాలు మున్సిపల్ అభివృద్ధికి తోడ్పాటు చేశాడు మంత్రి వాకిడి శ్రీహరి మంత్రిగా ఉండి ఏం తెచ్చాడో చెప్పండి ఊరికి చిట్టెం రామ్మోహన్ రెడ్డి గారు ఎమ్మెల్యేగా ఉండి మొత్తం నియోజకవర్గం లో 1కోటి 80 లక్షల చేప పిల్లలు నీటిలో వదలడం జరిగింది అదేవిధంగా ముదిరాజ్ సోదరులకు స్కూటర్లు బుల్లోరాలు డీసీఎం లో సూపర్ ఎక్సెల్ మంజూరు చేశారు వాకిటి శ్రీహరి మృతి కార్ల శాఖకు మంత్రిగా ఉండి ఎన్ని చేప పిల్లలు వదలారో మరి ముఖ్యంగా అమరచింతలో ఏం చేశారో చెప్పండిఅమరచింత మున్సిపాలిటీకి హామీలు ఇవ్వడమే తప్ప అభివృద్ధి పనులకు నోచుకోవడం లేదని టిఆర్ఎస్ నాయకులు మండిపడ్డారు గత కొన్ని నెలల క్రితం దుప్పాయి కుంట్ల విషయంలో పార్టీలో ధర్నా కార్యక్రమం నిర్వహించగా ఆ ధర్నా కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు కొంతమంది ఎమ్మార్వో ఆఫీస్ దగ్గర మంత్రిగారికి ఈ విషయం విన్నవించగా మంత్రిగారు మాట్లాడుతూ నేనే రేపే మీ ఊరి అఖిలపక్ష నాయకులకు ఫోన్ చేసి అఖిలపక్ష నాయకులను పిలిపించుకొని కలెక్టర్ దగ్గరికి పంపించి దుప్పాయి కుంట్ల పాట్లు పంపిణీ పూర్తి చేస్తానని హామీ ఇవ్వడం జరిగింది ఆమె ఇచ్చి కూడా ఇప్పటికీ ఒక సంవత్సరం కాలం పట్టింది అయినా సమస్య పరిష్కారం కాలే అది ఆచరణలోకి రాలేదు మళ్ళీ ఈ మధ్య ఇప్పుడు మంత్రిగారి ఆదేశం సారం మళ్ళీ ఒక నెలలో పూర్తి చేస్తా అంటున్నారు వేచి చూడాలి మరి ఇప్పుడు ఎన్ని నెలలు టైం పడుతుందో గత పది సంవత్సరాలుగా చిట్టెం రామ్మోహన్ రెడ్డి గారు ఎమ్మెల్యేగా ఉండి ఏ అభివృద్ధి చేశారో అందరికీ తెలిసిన విషయమే అని అని ప్రెస్ మీట్ లో బిఆర్ఎస్ నాయకులు తెలిపారు

## ప్రతిరోజు సేవా కార్యక్రమాలతో క్లాస్ మెంట్ క్లబ్ ముందంజ...



నాగర్ కర్నూల్ జులై 20( స్కై న్యూస్) దాతల సహకారంతో విస్తృతంగా సేవలు అందించేందుకు ఏర్పాటు చేసిన క్లాస్ మెంట్ క్లబ్ గత సంవత్సరముగా ప్రతిరోజు ఒక సేవా కార్యక్రమం నిర్వహించేలా ప్రణాళికలు రూపొందించుకొని ముందుకు సాగుతున్నట్లు క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు వాసా రాఘవేందర్ తెలిపారు. కొన్ని సంవత్సరాలుగా సేవా కార్యక్రమాలు నిర్వహించేట్లకు వినూత్నంగా 365 రోజులు 365 సేవా కార్యక్రమాల పేరుతో నిర్వహిస్తున్న కార్యక్రమాలు 200 రోజులు పూర్తి చేసుకోవడం జరిగిందని వివరించారు. వినూత్న కార్యక్రమాలతో మహనీయుల జయంతి మరియు వర్ధంతులను పురస్కరించుకొని పేద విద్యార్థుల విజ్ఞానాన్ని పెంపొందించేలా ఆర్థిక సాయం అందించేలా కార్యక్రమాలను నిర్వహించడం జరిగిందని తెలిపారు. స్వాతంత్ర సమరయోధులు మంగళ్ పాండే జయంతిని పురస్కరించుకొని పేద విద్యార్థికి ఐదువేల ఆర్థిక సహాయంతో పాటు ఎంసెట్లో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను సన్మానించారు అదేవిధంగా కుడికిల్ల గ్రామంలో పాఠశాల విద్యార్థులకు మహనీయుల జీవిత చరిత్ర పుస్తకాలను అందించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో విభిన్న సామాజిక విద్యా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు వివిధ పోటీలను నిర్వహించి ప్రతిభా విద్యార్థులను ప్రోత్సహించేందుకు బహుమతులను అందించడంతోపాటు సమాజంలో సేవలు అందిస్తున్న వారిని గుర్తింపుగా సన్మానించడం జరుగుతుందని తెలిపారు ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చిగుళ్లపల్లి రమణ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు లక్ష్మీ రాఘవేందర్ ప్రతినిధులు కందూరు లక్ష్మణ్ రవి ప్రకాష్ యాదయ్య పాండు స్వామి ప్రమోద్ విజయ్ సంబులక్ష్మి శ్రీను చంద్రకళ తదితరులు పాల్గొన్నారు

# షాద్‌నగర్‌లో ఘనంగా తెలంగాణ అమరవీరుల స్తూపం ఆవిష్కరణ

### అమరవీరుల ఆశయాలు నెరవేరినప్పుడే నిజమైన నివాళి :మంత్రి జూపల్లి కృష్ణారావు

**రంగారెడ్డి జిల్లా జూలై 20 (స్కై న్యూస్):** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లో తెలంగాణ అమరవీరుల స్తూపం ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ముఖ్య అతిథిగా హాజరై స్తూపాన్ని ఆవిష్కరించారు. మంత్రి జూపల్లి మాట్లాడుతూ తెలంగాణ కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుల ఆశయాలు పూర్తిగా సాకారమైనప్పుడే వారికి నిజమైన నివాళి అర్పించినవారమవుతామని అన్నారు. షాద్‌నగర్ నియోజకవర్గంలోని తెలంగాణ ఉద్యమంలో ప్రాణాలు కోల్పోయిన నలుగురు అమరవీరుల కుటుంబాలకు ప్రభుత్వం తరఫున లక్ష రూపాయల చొప్పున మొత్తం రూ.4 లక్షల ఆర్థిక సహాయం అందజేస్తామని ప్రకటించారు. ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ తెలంగాణ చరిత్రను వక్రీకరించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, అమరవీరుల స్తూపమే తెలంగాణ ఉద్యమంలో జరిగిన వేలాది త్యాగాలకు సజీవ సాక్ష్యమని పేర్కొన్నారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ షాద్‌నగర్ నియోజకవర్గంలోని నిజమైన తెలంగాణ ఉద్యమకారులకు ఇళ్ల స్థలాలు కేటాయించేందుకు 20 ఎకరాల భూమిని త్వరలో కేటాయిస్తామని ప్రకటించారు. ఉద్యమకారులకు తగిన గౌరవం, గుర్తింపు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రాష్ట్ర సాంస్కృతిక శాఖ






చైర్‌పర్సన్ వెన్నెల గద్దర్ మాట్లాడుతూ గుర్తింపు లేక మరుగున పడిన అసలైన ఉద్యమకారులకు న్యాయం చేయాలని కోరారు. తెలంగాణ ఉద్యమ చరిత్రను సమగ్రంగా లిఖించాల్సిన అవసరం ఉందన్నారు. అమరవీరుడు శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మ భావోద్వేగంగా మాట్లాడుతూ, తన కుమారుడి త్యాగం వృథా కాలేదని, తెలంగాణ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయాడని అన్నారు. మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకుడు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి, కవి వంగూరి గంగిరెడ్డి, ఉద్యమకారుడు పినపాక ప్రభాకర్ తదితరులు తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని కొనసాగించాలని పిలుపునిచ్చారు. సమస్యల పరిష్కారానికి పోరాటమే మార్గమని, ఉద్యమకారులకు తగిన గౌరవం, సంక్షేమం కల్పించాలని అభిప్రాయపడ్డారు. సభ ప్రారంభంలో అమరవీరులకు రెండు నిమిషాల మౌనం పాటించి నివాళులర్పించారు. అనంతరం ఉద్యమకారులను ఘనంగా సన్మానించారు. టీజేఏసీ నాయకులు మూలే జనార్ధన్, కరుణాకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని వివిధ మండలాల నుంచి ఉద్యమకారులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, ప్రజలు భారీగా హాజరయ్యారు.

## షాద్‌నగర్‌లో ఘనంగా మహనీయుల విగ్రహాల ఆవిష్కరణ

**భారీగా హాజరైన నాయకులు, కార్యకర్తలు, కుల సంఘాల ప్రతినిధులు**



**రంగారెడ్డి జిల్లా జూలై 20 (స్కై న్యూస్):** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం ప్రహరీ ముందు ఏర్పాటు చేసిన మహనీయుల విగ్రహాలను ఘనంగా ఆవిష్కరించారు. మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ఎమ్మెల్సీ కోదండరాం సంయుక్తంగా ఈ విగ్రహాలను ఆవిష్కరించారు. జాతిపిత మహాత్మా గాంధీ, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు, స్వాతంత్ర్య సమరయోధుడు రాజా వెంకటరెడ్డి, మాజీ రాష్ట్రపతి, ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ ఏ.పి.జె. అబ్దుల్ కలాం, ప్రజాకవి గద్దర్ విగ్రహాలను ఆవిష్కరించడంతో మండల పరిషత్ ఆవరణలో ప్రత్యేక సందడి నెలకొంది. ఈ సందర్భంగా మహనీయుల సేవలను స్మరించుకుంటూ వారికి ఘనంగా నివాళులర్పించారు. విగ్రహాల ఆవిష్కరణను కుల సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల ప్రతినిధులు స్వాగతిస్తూ హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు బస్వం, వైస్ చైర్మన్ అందే మోహన్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మొహమ్మద్ అలీ ఖాన్ బాబర్, మాజీ మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు విశ్వం, గిరిజన ఆదివాసీ కోఆర్డినేటర్ పి. రఘు, చెంది తిరుపతి రెడ్డి, కృష్ణారెడ్డి, సజీవన్, ముబారక్ అలీ ఖాన్‌తో పాటు ఐకాసా నాయకులు, కుల సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నమ్మిన సిద్ధాంతం తోనే పదవీ బాధ్యతలు...

**బీజేవైఎం జిల్లా అధ్యక్షునిగా దన్నోజు నరేష్ చారి**

**బలోపేతమే లక్ష్యంగా ఉద్యమాలు**



నాగర్ కర్నూల్ జులై 20( స్కై న్యూస్) నమ్మిన సిద్ధాంతం కోసం గత 16 సంవత్సరాలుగా భారతీయ జనతా పార్టీలోని ప్రజా సంఘాలలో పనిచేస్తూ ఇచ్చిన బాధ్యతలను అకుంఠిత దీక్షతో పూర్తి చేయడాన్ని గుర్తించిన రాష్ట్ర నాయకత్వం దన్నోజు నరేష్ చారిని బీజేవైఎం జిల్లా అధ్యక్షులుగా నియమించడం పట్ల పలువురు నాయకులు హర్షం వ్యక్తం చేశారు. బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షులు గుండె గణేష్ నేతృత్వంలో అన్ని జిల్లాల అధ్యక్షులను ప్రకటించడం జరిగిందని జిల్లా అధ్యక్షునిగా నియమించిన నరేష్ చారి 2010 నుండి పార్టీలో కొనసాగుతూ పార్టీ అభివృద్ధికి వివిధ ఎన్నికలలో కార్యకర్తల గెలుపునకు కృషి చేసినట్లు తెలిపారు. ఏబీవీపీ నాయకుడిగా మరియు ఆర్ఎస్ఎస్ కార్యకర్తగా బిజెపి యువమోర్చా నాయకులుగా పనిచేస్తూ విద్యార్థి యువజన సమస్యలను పరిష్కరించేందుకు ఎన్నో పోరాటాలు నిర్వహించారని పార్టీ నిర్వహించే ఉద్యమాలలో చురుకుగా పాల్గొని తనదైన ముద్ర వేసుకున్నట్లు తెలిపారు. బీజేవైఎం జిల్లా కార్యదర్శిగా రెండు పర్యాయాలు సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ గా పనిచేసిన ఆయనను యువ మోర్చా జిల్లా అధ్యక్షులుగా ఎన్నికచేయడం హర్షనీయమన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా సమయంలో పేదలకు సహాయం చేయడంతో పాటు పేద విద్యార్థులకు ఆర్థిక సాయంతో పాటు పాఠ్యపుస్తకాలను దేవాలయాలకు ఆర్థిక సహాయం అందించడం లాంటి కార్యక్రమాలను నిర్వహించడం జరిగిందని భవిష్యత్తులో తనకు అప్పగించిన బాధ్యతను నెరవేరుస్తూ రాష్ట్ర ప్రభుత్వం యువతకు ఇచ్చిన హామీలను అమలు చేసేదాకా పోరాటం నిర్వహిస్తామని తెలిపారు

## షిఫా మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ & చిల్డ్రన్ హాస్పిటల్ సెంటర్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే

**జోగులాంబ గద్వాల, జూలై 20(స్కైన్యూస్):** గద్వాల జిల్లా కేంద్రంలోని 2వ రైల్వే గేట్, సమీపంలో నూతనంగా షిఫా మల్టీ స్పెషాలిటీ ఌ చిల్డ్రన్ హాస్పిటల్స్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి హాజరయ్యారు.నూతన షిఫా మల్టీ స్పెషాలిటీ ఌ చిల్డ్రన్స్ హాస్పిటల్ ను ఎమ్మెల్యే రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించడం జరిగినది.ఎమ్మెల్యే కి, చైర్పర్సన్ కి డాక్టర్ యం.డి . షఫీక్ శాలువా కప్పి పుష్పగుచ్ఛం ఇచ్చి ఘనంగా సత్కరించారు.ఎమ్మెల్యే హాస్పిటల్ లో ఆపరేషన్ థియేటర్, వైద్య పరికరాలను పరిశీలించిన జరిగినది.అనంతరం డాక్టర్ షఫీ కుమార్తె జన్మదిన సందర్భంగా ఎమ్మెల్యే సమక్షంలో కేక్ కటింగ్ చేశారు. ఎమ్మెల్యే చిన్నారికి కేకు తినిపించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపి ఆశీర్వదించడం జరిగింది.

**ఎమ్మెల్యే మాట్లాడుతూ..**

గద్వాల ప్రాంతంలో దినదిన అభివృద్ధి చెందుతుంది కొత్త టెక్నాలజీ ప్రజలు వివిధ రకాల ఆరోగ్య సమస్యల పైన హైదరాబాద్ కర్నూల్ వంటి ప్రాంతాలకు వెళ్లి చికిత్సలు పొందేవారు. కానీ ఇప్పుడు గద్వాలలో అన్ని రకాల రోగాలకు సంబంధించిన హాస్పిటల్, ప్రజలకు అందుబాటులో ఎన్ని రకాల సౌకర్యాలు లభిస్తున్నాయి అని తెలపారు.భవిష్యత్తులో గద్వాల నియోజకవర్గం మీరు వ్యాపారం సంస్థ లో రావాలి గద్వాల్ నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందాలని కోరారు.ఈ కార్యక్రమంలో



మున్సిపల్ చైర్ పర్సన్ తుమ్మల జయలక్ష్మీ నర్సింహులు యాదవ్, మాజీ జడ్పీ చైర్మన్ బండారి భాస్కర్, మాజీ ఎంపీపీ విజయ్, జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షులు రాజశేఖర్,మున్సిపల్ వైస్ చైర్మన్ శంకర్, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్,కౌన్సిలర్స్ బాబర్, రామలింగేశ్వర కాంప్లే, చంద్రశేఖర్, మాజీ కౌన్సిలర్స్ మురళి, నరహరి శ్రీనివాసులు, పూడూర్ కృష్ణ, మహేష్, నరహరి గౌడ్, మాజీ ఆలయం కమిటీ ఛైర్మెన్ సతీష్, నాయకులు సాయి శ్యామ్ రెడ్డి, గోవిందు, ఆనంద్ గౌడు, వెంకటేశ్వర్ రెడ్డి, బంగి సుదర్శన్, రిజ్వాన్, ప్రవీణ్, నాగేంద్ర యాదవ్, ధర్మ నాయుడు, గంట రమేష్, కొత్త గణేష్, వీరేష్ చిరు, షాషా,నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా ఎండీ ఇబ్రహీం నియామకం

**రంగారెడ్డి జిల్లా జూలై 20 (స్కై న్యూస్):** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) ఆదేశాల మేరకు రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా ఎండీ ఇబ్రహీం నియమితులయ్యారు. ఈ సందర్భంగా తనపై నమ్మకంతో కీలక బాధ్యతలు అప్పగించిన పార్టీ అధిష్టానానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. టీపీసీసీ అధ్యక్షుడు బి. మహేష్ కుమార్ గౌడ్, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. అలాగే ఈ పదవి దక్కడానికి సహకరించిన షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ



ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డితో పాటు జిల్లా, నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలందరికీ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎండీ ఇబ్రహీం మాట్లాడుతూ, పార్టీ తనపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకునేందుకు అంకితభావంతో పనిచేస్తానన్నారు. జిల్లాలో పార్టీ బలోపేతంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నిరంతరం శ్రమిస్తానని ఆయన స్పష్టం చేశారు.

## కార్పొరేషన్పదవుల్లో శ్రీ వైష్ణవులకు ప్రాధాన్యం కల్పించాలి



హైద్రాబాద్ జులై 20;రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల చివర్లో భర్తీ చేయనున్న కార్పొరేషన్ చైర్మన్,మరియు డైరెక్టర్స్ పదవులలో "శ్రీ వైష్ణవ" అభ్యర్థులకు ప్రాధాన్యత కల్పించి,తగు న్యాయం చేయాలని కోరుతూ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు శ్రీ మహేష్ కుమార్ గౌడ్ ను కలిసి,శ్రీ వైష్ణవసేవా రాష్ట్ర సంఘం పక్షాన వినతి పత్రం సమర్పించారు.ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షులు తిరువరంగం ప్రభాకర్ మెసల్లడుతూ బ్రాహ్మణ పరిషత్ చైర్మన్ మరియు వైస్ చైర్మన్ పదవులను రెండింటిని వైదికుల (బ్రాహ్మణుల) చేతనే భర్తీ చేయడం ద్వారా " శ్రీ వైష్ణవులకు " తీవ్ర అన్యాయం జరిగిందని టిలిపారు.బ్రాహ్మణ పరిషత్ డైరెక్టర్స్ నియామకాలు ఈ నెల చివరిలో భర్తీ చేసే సందర్భం లో కనీసం 5 డైరెక్టర్స్ పదవులను " శ్రీ వైష్ణవులకు " కేటాయించాలని డిమాండ్ చేశారు.వైష్ణవ ఆలయాలలో నిత్యం అనుసరించే వైష్ణవ ఆగమం గూర్చి సంపూర్ణంగా అవగాహన కలిగిన శ్రీ వైష్ణవులను పాలకవర్గ సభ్యులుగా నియమించడం ద్వారా,సదరు ఆలయాలలో పూజాది కార్యక్రమాలు సజావుగా సాగేందుకు అనువుగా ఉంటుందని తెలిపారు.కాంగ్రెస్ పార్టీ లో సుదీర్ఘ కాలంగా సేవ చేస్తున్న శ్రీ శ్రీనివాసా చారికి తగు అవకాశం ఇచ్చి న్యాయం చేయాలని కోరారు.ఈ కార్యక్రమం లో ,రాష్ట్ర బాధ్యులు శ్రీ సుదర్శనా చార్యులు తదితరులు పాల్గొన్నారు.

## జీవో ప్రకారమే వైద్య విద్య అడ్మిషన్లు చేపట్టాలి



నాగర్ కర్నూల్ జులై 20( స్కై న్యూస్) వైద్య విద్య కౌన్సిలింగ్లో బీసీ ఎస్సీ ఎస్టీ విద్యార్థులకు తీరని అన్యాయం చేసే విధంగా రూపొందించిన జీవో నెంబర్ 114 రద్దుచేసి 550 జీవో ప్రకారం అడ్మిషన్లను చేపట్టాలని బిసి పొలిటికల్ జేఏసీ జిల్లా అధ్యక్షుడు అరవింద్ చారి డిమాండ్ చేశారు. గత నాలుగు సంవత్సరాలుగా ఎంబిబిఎస్ సీట్ల కేటాయింపులో అమలు చేస్తున్న రిజర్వేషన్లు లోప భూయిష్టంగా ఉన్నాయని విమర్శించారు 300 మంది వైద్య విద్యార్థులకు అన్యాయం జరిగిందని తెలిపారు. జీవోను సవరించి విద్యార్థులకు అన్యాయం చేయకుండా ప్రవేశాలకు అనుమతి ఇవ్వాలని కోరారు మంత్రులు ఎమ్మెల్యేలు వెంటనే స్పందించి సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు జీవో నెంబర్ 550 ప్రకారం అడ్మిషన్లు చేపట్టాలని డిమాండ్ చేశారు లేదంటే దళిత బడుగు బలహీన వర్గాల సంఘాలను ఏకం చేసి ఉద్యమం చేపడతామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో నాయకులు రాజు మహేష్ ఆకాష్ తిరుపతయ్య రాములు రమేష్ హేమాద్రి తదితరులు పాల్గొన్నారు

వార్తాతరంగాలు

మంగళవారం 21 జూలై 2026

## సిద్దాపూర్ డంపింగ్ యార్డ్ జీవో 641 వెంటనే రద్దు చేయాలి..

**సీపీఐ నేత బుద్ధుల జంగయ్య**



**రంగారెడ్డి జిల్లా, జూలై 20 (స్కై న్యూస్):** సిద్దాపూర్ డంపింగ్ యార్డ్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నెం. 641ను వెంటనే రద్దు చేయాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు బుద్ధుల జంగయ్య డిమాండ్ చేశారు. షాద్‌నగర్‌లో నిర్వహించిన సీపీఐ మండల కార్యదర్శులు, ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సిద్దాపూర్ గ్రామ శివారులో ప్రతిపాదిత డంపింగ్ యార్డ్ వల్ల పరిసర గ్రామాలు, గిరిజన తండాల ప్రజలకు తీవ్ర కాలుష్య ప్రభావం, ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందన్నారు. వర్షాకాలంలో కలుషిత నీరు హిమాయత్ సాగర్‌లో కలవడం వల్ల తాగునీరు, సాగునీరు కూడా దెబ్బతింటాయని ఆందోళన వ్యక్తం చేశారు. జీవో 641పై షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు ముందే సమాచారం లేదా అని ప్రశ్నించిన జంగయ్య, జీవో జారీ కాకముందే అడ్డుకోవాల్సిందిపోయి ఇప్పుడు కాంగ్రెస్ నాయకులు ఆందోళనలు చేయడం ప్రజలను తప్పుదోవ పట్టించడమేనని విమర్శించారు. నిజంగా చిత్తశుద్ధి ఉంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి జీవో రద్దు చేయించాలని సూచించారు. షాద్‌నగర్ వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతమని, ఇక్కడ డంపింగ్ యార్డ్ ఏర్పాటు భవిష్యత్ తరాల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. ప్రజలకు మేలు చేసే నిర్ణయాలను సీపీఐ స్వాగతిస్తుందని, ప్రజలకు నష్టం కలిగించే నిర్ణయాలను మాత్రం తీవ్రంగా వ్యతిరేకిస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వం వెంటనే జీవో నెం. 641ను రద్దు చేయాలని, లేకపోతే సీపీఐ, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో సీపీఐ, ఏఐఎస్ఎఫ్ నాయకులు, మండల కార్యదర్శులు పాల్గొన్నారు.

## కేజీబీవీ లో నెలకొని ఉన్న సమస్యలు పరిష్కరించాలి...



**నాగర్ కర్నూల్ జూలై 20( స్కై న్యూస్)** నియోజకవర్గంలోని తిమ్మాజీపేట మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ మోక్తాల శాంతన్ డిమాండ్ చేశారు సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టరేట్ కార్యాలయ పరిపాలన అధికారి చంద్రశేఖర్ కు వినతి పత్రం సమర్పించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేజీబీవీ పాఠశాలలో అనేక సంఘటనలు ఎదురవుతున్నాయని వాటిపై ప్రత్యేక దృష్టి సారించి సమస్యలకు నేలువుగా మారిన సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏఎన్ఎం పుష్పలత రాత్రి విధులలో విద్యార్థినీలతో నూనె పట్టించుకోవడం మసాజ్ చేయించుకోవడం చపాతీలు చేయించుకోవడం లాంటి సంఘటనలకు పాల్పడుతుందని విద్యార్థులు ప్రత్యేక అధికారికి సమాచారం అందించిన రెండు నెలల క్రితం సిసి ఫుటేజ్ ఆధారాలను అందించిన ఇంతవరకు ఎందుకు చర్యలు తీసుకోలేదని నిలదీశారు. కంప్యూటర్ ఇన్స్ట్రక్టర్ కవిత విద్యార్థులకు ఎలాంటి శిక్షణ ఇవ్వడం లేదని ఆన్లైన్ ద్వారా వస్తువులు కొనుగోలు చేసి అధిక ధరలకు విద్యార్థులకు అమ్ముతున్నారని తమ దృష్టికి రావడం జరిగిందని తెలిపారు డీఈవో ఆర్ జె డి లకు ఫిర్యాదులు చేసిన పట్టించుకోలేదని మండిపడ్డారు. ఈనెల 3న కుమ్మెర గ్రామానికి చెందిన సహర్ష మరియు అవికా విద్యార్థినిలు పాఠశాల సిబ్బంది పెడుతున్న ఇబ్బందులను తట్టుకోలేక ప్రహరీ గోడ దూకి మరుసటి రోజు ఉదయం 6 గంటలకు జిల్లా కేంద్రానికి చేరుకున్నారని తెలిసిన వారితో తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వడంతో తమ పిల్లలను ఇంటికి తీసుకువెళ్లారని ఇంత సంఘటన జరిగిన సిబ్బందికి తెలియకపోవడం దారుణం అన్నారు వెంటనే పాఠశాలపై ప్రత్యేక దృష్టి సారించి సమస్యలను పరిష్కరించడంతోపాటు ఇబ్బందులకు గురిచేస్తున్న సిబ్బందిపై సమగ్ర విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బంగారు బాబు తిమ్మాజీపేట మండల కన్వీనర్ వెంకటేష్ నాయకులు శ్రీశైలం శ్రీను రామకృష్ణ నగర కార్యదర్శి ప్రసాద్ కుమార్ సంయుక్త కార్యదర్శి శివ వంశీ మార్కండేయ భరత్ సందీప్ తదితరులు పాల్గొన్నారు

## సిద్ధాపుర్ డంపింగ్ యార్డు జీవో రద్దు చేయాలని మంత్రి జూపల్లికి వినతి



**రంగారెడ్డి జిల్లా జులై 20 (స్కై న్యూస్):** రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలం సిద్ధాపూర్ గ్రామ పరిధిలో ప్రతిపాదిత డంపింగ్ యార్డు ఏర్పాటుకు సంబంధించిన జీవో నెం. 641ను వెంటనే రద్దు చేయాలని కోరుతూ జేఏసీ ఛైర్మన్ అంబటి ప్రభాకర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎల్లారం శేఖర్ రెడ్డి, సిద్ధాపూర్ సర్పంచ్ బాసు నాయక్, ఆగిరు రవికుమార్ గుప్తాతో పాటు పరిసర గ్రామాల ప్రజలు రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావును కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డంపింగ్ యార్డు ఏర్పాటు వల్ల పరిసర ప్రాంతాల్లో పర్యావరణ కాలుష్యం పెరిగి, భూగర్భ జలాలు కలుషితమయ్యే ప్రమాదం ఉందని, స్థానిక ప్రజలు తీవ్ర ఆరోగ్య సమస్యలు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. రైతుల జీవనోపాధిపై కూడా ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రజల అభిప్రాయాలను గౌరవించి, జీవో నెం. 641ను వెంటనే రద్దు చేసి సిద్ధాపూర్ డంపింగ్ యార్డు ప్రతిపాదనను పూర్తిగా ఉపసంహరించుకోవాలని మంత్రి జూపల్లి కృష్ణారావును కోరారు. ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

## సమృద్ధిగా వర్షాలు కురవాలని శివాలయంలో ప్రత్యేక అభిషేకం పూజలో ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి





దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలోని శివాలయంలో సోమవారం వర్షాలు సమృద్ధిగా కురవాలని నిర్వహించిన ప్రత్యేక అభిషేకం, పూజ లో ఎమ్మెల్యే జి మసూద్ రెడ్డి. అనంతరం శ్రీ ఈశ్వర వీరప్పయ్య స్వామి వారిని దర్శించుకున్నారు. ఎమ్మెల్యే ను హర్షకులు ఆలయ నిర్వాహకులు శాలువాలతో ఆసన్మానించారు. ఎమ్మెల్యే స్వామికి ప్రత్యేక జలాభిషేకంతో జలాభిషేకం ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి చేశారు.

## డెక్కన్స్ హెల్త్ అండ్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో

# ఉచిత ఆరోగ్య శిబిరం...

**హైదరాబాద్ జులై 20;:** ది డెక్కన్స్ హెల్త్ అండ్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ కామర్స్ కళాశాలలో ఉచిత ఆరోగ్య శిబిరం విజయవంతంగా నిర్వహించబడింది. ఈ శిబిరంలో సుమారు 600 మంది విద్యార్థులకు సాధారణ ఆరోగ్య పరీక్షలు, కంటి పరీక్షలు, దంత పరీక్షలు మరియు రక్త గ్రూపింగ్ పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. నిపుణులైన వైద్యులు విద్యార్థులకు ఆరోగ్య సంబంధిత సూచనలు అందించడంతో పాటు, ఆరోగ్యకరమైన జీవనశైలి, కంటి సంరక్షణ, నోటి పరిశుభ్రత మరియు రక్త గ్రూప్ తెలుసుకోవడం యొక్క ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ది డెక్కన్స్ హెల్త్ అండ్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఎక్సగ్యూటీ డైరెక్టర్ జి.మాధవి మాట్లాడుతూ, యువత ఆరోగ్య పరిరక్షణే సమాజ అభివృద్ధికి పునాది అని, విద్యార్థుల కోసం ఇలాంటి ఉచిత ఆరోగ్య



శిబిరాలను భవిష్యత్తులో కూడా వివిధ విద్యాసంస్థల్లో నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ కామర్స్ యాజమాన్యానికి,



అధ్యాపకులకు, వైద్య బృందానికి, వాలంటీర్లకు మరియు పాల్గొన్న విద్యార్థులందరికీ ది డెక్కన్స్ హెల్త్ అండ్ ఎడ్యుకేషనల్ సొసైటీ తరపున ఆమె హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

## ఋతు సంబంధ పరిస్థితులు & ఇతర అభివృద్ధి కార్యకలాపాలు సమీక్షా సమావేశంలో జిల్లా ఇన్చార్జి, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి..

**గద్వాల ఎమ్మెల్యే, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు**

**జోగులాంబ గద్వాల, జూలై 20(స్కై న్యూస్):** మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో జిల్లా కలెక్టరేట్ ఐడిఓసి కార్యాలయం నందు ఋతు సంబంధ పరిస్థితులు ఒ ఇతర అభివృద్ధి కార్యకలాపాలు సమీక్షా సమావేశంలో కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా ఇన్చార్జి ఒ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రివర్యులు దామోదర రాజనర్సింహ ,రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి ,గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి ఉమ్మడి పాలమూరు జిల్లా ఎమ్మెల్యేలు గార్లు, కార్పొరేషన్ చైర్మన్ లు, ఉమ్మడి జిల్లాల కలెక్టర్లు,అన్ని శాఖల అధికారులు సమీక్ష సమావేశంలో హాజరయ్యారు. ఈ సమీక్ష సమావేశంలో గద్వాల ఎమ్మెల్యే మాట్లాడుతూ పాలీహౌస్ మొక్కలను పెంచడానికి సబ్సిడీ ద్వారానే రైతు లకు, అందించి గద్వాల జిల్లాలో ఎక్కువగా పాలీహౌస్ మొక్కలను పెంచుతున్నారు వాతావరణం పరిస్థితులకు బట్టి పెంచడం జరుగుతుంది కాబట్టి రైతులకు సబ్సిడీ ద్వారా మొక్కలు పెంచడానికి ప్రాధాన్యత కల్పించి అవకాశం



కల్పించాలని కోరారు. అగ్రికల్చర్ కన్నా హార్టికల్చర్ కు ఎక్కువ ప్రాధాన్యత కల్పించాలి ఆపిల్ మొక్కలను, వాతావరణం పరిస్థితి అనుకూలంగా వివిధ రకాల ఆపిల్ లను పండించడం జరుగుతుంది అని తెలపారు. అదేవిధంగా అవకాడో, నీల సంబంధించిన మొక్కలను కూడా హార్టికల్చర్ లో పెంచడానికి ప్రభుత్వం రైతులకు అవగాహన కల్పించి సబ్సిడీ ద్వారా వారికి అందించి హార్టికల్చర్ రైతులను ప్రభుత్వం ప్రోత్సహించాలని తెలిపారు. అలాగే రైతులకు ర్యాలంపాడు రిజర్వాయర్ ద్వారా రైతులకు దశలవారీగా( వారబందీగా) నీటిని విడుదల చేయాలని కోరారు. ప్రస్తుతం రైతులు నాట్లను నాటి నీటి కొరకు ఇబ్బంది పడుతున్నారు కాబట్టి త్వరగానే నీటిని విడుదల చేసి రైతులకు నీళ్లు అందించాలని మంత్రి ని కోరారు. అదేవిధంగా అన్ని రంగాలపై సమస్యలు పైన సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే గారు మాట్లాడడం జరిగింది. మంత్రి కూడా ఎమ్మెల్యే చెప్పిన విషయాలపై స్థానికులంగా స్పందించి త్వరగానే పూర్తి చేసే విధంగా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వాల్మీకి ఫెడరేషన్ కార్పొరేషన్ చైర్మన్ గట్టు తిమ్మప్ప, మున్సిపల్ చైర్ పర్సన్ తుమ్మల జయలక్ష్మి నరసింహులు యాదవ్, మాజీ ఎంపీపీ విజయ్, జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు రాజశేఖర్, మాజీ కౌన్సిలర్ నరహరి శ్రీనివాసులు, నాయకులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సమాజంలో జరుగుతున్న అవినీతి, అన్యాయాలపై మాజీ సైనికులు పోరాడాలి..

**బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు పిలుపు**

**హైదరాబాద్ జులై20:** సమాజంలో జరుగుతున్న అవినీతి, అన్యాయాలపైమాజీ సైనికులు పోరాడాలని, బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు పిలుపు నిచ్చారు బిజెపి రాష్ట్ర ఎక్స్-సర్వీస్‌మెన్ సెల్ ప్రతినిధుల సమావేశం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఘనంగా జరిగింది. ఈ రాంచందర్ రావు గారు ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా సరిహద్దుల్లో దేశాన్ని రక్షించిన మాజీ సైనికులు, రిటైర్మెంట్ తర్వాత సమాజంలో జరుగుతున్న అవినీతి, అన్యాయాలపై పోరాడాలని, సైనిక క్రమశిక్షణతో పనిచేసి తెలంగాణలో బీజేపీని అధికారంలోకి తీసుకురావడానికి భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. తెలంగాణలో తొలిసారిగా ఎక్స్-సర్వీస్‌మెన్ సెల్ ప్రతి జిల్లా నుంచి కన్వీనర్లతో బలమైన టీమ్‌లను ఏర్పాటు చేసుకుని, పార్టీలో అత్యంత క్రియాశీలక వింగ్‌గా రూపుదిద్దుకోవడం ఎంతో సంతోషకరమని పేర్కొన్నారు. న్యాయవాదులకు లీగల్ సెల్, కార్మికులకు లేబర్ సెల్ ఎలాగైతే పనిచేస్తాయో, ఎక్స్-సర్వీస్‌మెన్ సెల్ కూడా దేశ సరిహద్దుల్లో సేవలు అందించిన సైనికులకు అండగా ఉంటుందని అన్నారు. కలెక్టరేట్లలో ఉండే రిటైర్డ్ ఎంప్లాయిస్ బోర్డులు సక్రమంగా పనిచేసేలా చూడటంతో పాటు, మాజీ సైనికుల సమస్యల పరిష్కారానికి, దేశ సమస్యలపై స్పందించడానికి ఈ సెల్ చొరవ తీసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. రాబోయే జూలై 26న 'కార్గిల్ విజయ్ దివస్'ను రాష్ట్రవ్యాప్తంగా అత్యంత ఘనంగా నిర్వహించాలని రాంచందర్ రావు సూచించారు. క్లిష్టమైన కొండప్రాంతాల్లో శత్రువులను ఎదుర్కొని దేశమాతను రక్షించిన సైనికుల త్యాగాలను స్మరించుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని, నాటి ప్రధాని శ్రీ అటల్ బిహారీ వాజ్‌పేయి నేతృత్వంలో సాధించిన విజయాన్ని స్మరిస్తూ ఈ దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని తెలిపారు. ఈ సందర్భంగా



సరిహద్దుల్లో పనిచేసే సైనికుల నిబద్ధతను గుర్తుచేస్తూ, వన్ ర్యాంక్ – వన్ పెన్షన్ సిఫార్సుల కోసం వేసిన జస్టిస్ ఎల్. నరసింహారెడ్డి కమిషన్‌ను బిఎస్ఎఫ్ సైనికులు కలిసినప్పుడు జరిగిన ఒక నిజ జీవిత సంఘటనను ఆయన పంచుకున్నారు. సరిహద్దుల్లో విపరీతమైన వేడిని తట్టుకోవడానికి తమ జీతాలు లేదా పెన్షన్ల పెంపును కోరకుండా, కేవలం రేషన్‌లో "అరకిలో ఉల్లిగడ్డలు" పెంచమని మాత్రమే వారు వేడుకున్నారని గుర్తుచేశారు. డబ్బులు, ప్రమోషన్లు కాకుండా దేశ సేవ, ఆరోగ్యాన్నే ప్రాధాన్యంగా భావించే సైనికుల త్యాగనిరతి మనందరికీ ఆదర్శనీయమని కొనియాడారు. గత 12 ఏళ్ల ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ పాలనలో భారత్ "సురక్షిత భారత్"గా మారిందని, 'ఆత్మనిర్భర్ భారత్'లో భాగంగా రక్షణ రంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయని రాంచందర్ రావు స్పష్టం చేశారు. 2014లో రూ. 686 కోట్లుగా ఉన్న రక్షణ ఎగుమతులు నేడు రూ. 38,400 కోట్లకు పెరిగాయని, రక్షణ బడ్జెట్ రూ. 2.5 లక్షల కోట్ల నుంచి రూ. 8 లక్షల కోట్లకు చేరిందని వెల్లడించారు. అలాగే రక్షణ ఉత్పత్తుల విలువ రూ.



46,000 కోట్ల నుంచి రూ. 1.50 లక్షల కోట్లకు పెరిగిందని, ఆర్డినెన్స్ నిల్వల స్వయంసమృద్ధి 32% నుంచి 90%కి చేరుకుందని తెలిపారు. నేవీ, కోస్ట్ గార్డ్ నౌకల్లో 97% మేడ్ ఇన్ ఇండియా పరికరాలే ఉపయోగిస్తున్నామని, తేజాస్ యుద్ధ విమానాలు, ఐఎన్ఎస్ విక్రాంత్ వంటివి భారత రక్షణ సామర్థ్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. ఒకప్పుడు ఉగ్రవాదంపై "చర్చలు" మాత్రమే ఉండేవి కానీ, ఇప్పుడు "చర్చలు లేవు – కేవలం చర్యలే" అనే విధానంతో ఉరి సర్జికల్ స్ట్రైక్స్, బాలాకోట్ ఎయిర్ స్ట్రైక్స్ ద్వారా సత్తాచాటిన భారతదేశం ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన దేశంగా ఆవిర్భవించిందన్నారు. సైన్యంలో ఉన్నప్పుడు యూనిఫామ్‌లో దేశాన్ని కాపాడిన సైనికులు, రిటైర్మెంట్ తర్వాత కూడా సమాజంలోని అవినీతి,అన్యాయాలపై పోరాడి దేశాన్ని రక్షించాల్సిన అవసరం ఉందన్నారు. సైనిక క్రమశిక్షణతో పనిచేస్తూ అందరూ కలిసికట్టుగా పనిచేసి తెలంగాణలో భారతీయ జనతా పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి కృషి చేయాలని శ్రేణులకు పిలుపునిచ్చారు.

## అమరుల ఆశయాలకు ప్రతీకగా అమరవీరుల స్థూపం..

**ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు టీజేఏసీ సన్మానం**

**రంగారెడ్డి జిల్లా, జూలై 20 (స్కై న్యూస్):** ఫరూఖ్‌నగర్ మండల పరిషత్ ఆవరణలో నిర్మించిన తెలంగాణ అమరవీరుల స్థూపం నిర్మాణానికి సహకరించి, అమరవీరుల కుటుంబాలు, ఉద్యమకారులకు ప్రత్యేక గుర్తింపు కల్పించిన ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్‌ను తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ (టీజేఏసీ) షాద్‌నగర్ తాలూకా ప్రతినిధులు శాలువా, జ్ఞాపికతో ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ, అమరవీరుల స్థూప నిర్మాణం వంటి చారిత్రక కార్యక్రమాన్ని విజయవంతం చేసిన టీజేఏసీ నాయకులను ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించి, తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులను శాలువాలు, జ్ఞాపికలతో సత్కరించారు. టీజేఏసీ చైర్మన్ మూలే జనార్ధన్



మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తొలి, మలిదశ ఉద్యమాల్లో ప్రాణత్యాగం చేసిన అమరుల త్యాగాలను చిరస్థాయిగా గుర్తు చేసే ప్రతీకగా ఈ స్థూపం నిలిచిపోతుందని అన్నారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అందించిన సహకారం మరువలేనిదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీజేఏసీ కన్వీనర్ నక్క బాల్‌రాజ్ యాదవ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ త్రిప్పిశెట్టి కరుణాకర్, బాదేపల్లి సిద్ధార్థ, గంద్రాతి బాలరాజ్ గౌడ్, జక్కుల శ్రీనివాస్, రవీంద్రనాథ్, నడికూడ యాదగిరి యాదవ్, రవీందర్ రెడ్డి, పరంజ్యోతి, మందారం నరసింహులు, భీశ్వ కృష్ణయ్య, పద్మారం వెంకటేష్ యాదవ్, శివరాములు, జీవీఎస్ శ్రీను నాయక్, దేవగిరి అశోక్, ఆర్టీసీ బాలస్వామి, అమరవీరుల స్థూపం నిర్మాణంలో పాల్గొన్న బ్రహ్మం, జవహర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వార్తాతరంగాలు

మంగళవారం 21 జూలై 2026

# రామవరం లో సింగరేణి డిస్పెన్సరీ పునః ప్రారంభం

## వీకేసీఎంలో నాలుగు నూతన క్రేన్ల ప్రారంభించిన డైరెక్టర్ (పిడిపి) కె. వెంకటేశ్వర్లు

**సింగరేణి జూలై 20( స్కై న్యూస్):** కొత్తగూడెం ఏరియా పరిధిలోని రామవారంలో ఆధునిక సౌకర్యాలతో పునరుద్ధరించిన డిస్పెన్సరీని సింగరేణి డైరెక్టర్ (ప్లానింగ్ & ప్రాజెక్ట్స్) కె. వెంకటేశ్వర్లు ఘనంగా పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ (పిడిపి) కె. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, సింగరేణి ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు నాణ్యమైన వైద్య సేవలను మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో డిస్పెన్సరీని ఆధునికీకరించి తిరిగి అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సింగరేణి చీఫ్ మెడికల్ ఆఫీసర్ డా. కిరణ్ రాజ్ మాట్లాడుతూ, ఉద్యోగుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ డిస్పెన్సరీలో ఒక స్టాఫ్ నర్స్ ను నిరంతరం అందుబాటులో ఉంచడంతో పాటు అవసరమైన వైద్య సేవలు, మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ సందర్భంగా కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం. షాలేం రాజు మాట్లాడుతూ, రామవారంలో పునరుద్ధరించిన డిస్పెన్సరీ ద్వారా ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు పరిసర ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు మరింత చేరువ కానున్నాయని, ఈ వైద్య సదుపాయాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.వికేసిఎం లో నాలుగు నూతన క్రేన్ల ప్రారంభం:డైరెక్టర్ (పిడిపి) కె.





వెంకటేశ్వర్లు వీకేసీఎం లో నూతనంగా కొనుగోలు చేసిన నాలుగు క్రేన్లను ప్రారంభించారు. ఈ క్రేన్ల వినియోగంతో గని నిర్వహణ పనులు మరింత వేగవంతంగా, సమర్థవంతంగా సాగడంతో పాటు భద్రతా ప్రమాణాలు, ఉత్పాదకత మరింత మెరుగుపడుతాయని ఆయన పేర్కొన్నారు. ఈ క్రేన్లు భారీ యంత్ర పరికరాల తరలింపు నిర్వహణ పనులను సులభతరం చేస్తాయని ఉత్పాదకత లో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు . ఆధునికరణకు సింగరేణి సంస్థ నిరంతరం ప్రాధాన్యత ఇస్తుందని ఆయన అన్నారు. వికేసీఎం ప్రాజెక్టు ఆఫీసర్ ఎంవి . నరసింహరావు, ఏరియా ఇంజనీర్ వి. రామకృష్ణ , ఏరియా సేఫ్టీ ఆఫీసర్ మొక్కపాటి వెంకటేశ్వర్లు, డిజిఎం (ఐఈడి) యోహాన్, ఏఐటీయూసి సెంట్రల్ సెక్రెటరీ వంగా వెంకట్, ఏఐటియుసి బ్రాంచ్ కార్యదర్శి మల్లికార్జున్ రావు, ఐఎన్టియుసి వైస్ ప్రెసిడెంట్ ఎండి.రజాక్, రామవరం కార్పొరేటర్ కె. జమలయ్య ఎస్.ఓ టు జీఎం ఎం. గోవిందరావు, (సిఎంఓఏఐ) జనరల్ సెక్రటరీ ఉపేందర్, పర్సనల్ మేనేజర్ తిరుపతి , ఇన్‌చార్జ్ (సివిల్)కె. రాజారాం , మేనేజర్ (ఐటిగ) శేష శ్రీ , డివైపిఎం హరీష్ , ఏఐటియుసి అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ గట్టయ్య ఐఎన్టియుసి ఫిట్ సెక్రెటరీ సాగర్ , అధికారులు, వైద్యాధికారులు, వివిధ విభాగాల అధికారులు, కార్మిక సంఘాల నాయకులు, ఉద్యోగులు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనను అమలు చేయాలి

## బిజెపి జిల్లా అధ్యక్షులు వేముల నరేందర్ రావు.

**నాగర్ కర్నూల్ జూలై 20( స్కై న్యూస్)** తెలంగాణ రాష్ట్రంలో రైతులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని రాష్ట్రంలో వెంటనే అమలు చేయాలని బిజెపి జిల్లా అధ్యక్షులు



వేముల నరేంద్రరావు కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు చంద్రారెడ్డి బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేందర్ గౌడ్ డిమాండ్ చేశారు సోమవారం జిల్లా కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో జిల్లా అదనపు కలెక్టర్ అరుణ రెడ్డికి వినతి పత్రం సమర్పించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 23 రాష్ట్రాలలో మరియు కేంద్ర పాలిత ప్రాంతాలలో ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం అమలు కావడం వల్ల రైతులకు ఆర్థిక రక్షణ అందుతుందని తెలంగాణ రాష్ట్రంలో గత ప్రభుత్వ మరియు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అమలు చేయకపోవడం వల్ల రైతులకు తీరని నష్టం ఏర్పడుతుందని అన్నారు. ప్రస్తుతం సకాలంలో వర్షాలు కురియక కరువు ముంచుకొస్తున్న తరుణంలో ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టపోయిన అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కేంద్ర ప్రభుత్వ పథకం ద్వారా రైతులకు ఆదాయ భద్రత వ్యవసాయ స్థిరత్వం ఏర్పడుతుందన్నారు. ఖరీఫ్ మరియు రబీ పంటలకు పథకాన్ని వర్తింపచేయాలని కౌలు రైతులకు కూడా ఈ పథకం ద్వారా ప్రయోజనాలు అవే విధంగా ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టేలా కృషి చేయాలని కోరారు. మండల మరియు జిల్లాస్థాయిలో ప్రత్యేక సహాయ కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రక్రియను సులభతరం చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా రాష్ట్ర నాయకులు రామచంద్రారెడ్డి గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు రవీందర్ చౌహన్ మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు జాకీర్ హుస్సేన్ బిజెపి నాయకులు కృష్ణ రాజేశ్వర్ రెడ్డి మహేష్ రెడ్డి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు

# విస్తృత సేవలే వాసవి క్లబ్ లక్ష్యం...

## క్లబ్ జోన్ చైర్మన్ అర్థం సాయి కృష్ణ

**నాగర్ కర్నూల్ జులై 20 (స్కై న్యూస్)** అంతర్జాతీయ స్థాయిలో విస్తృతంగా సేవలు అందిస్తూ ఎందరికో ఆదర్శంగా వాసవి క్లబ్ నిలిచిందని క్లబ్ జోన్ చైర్మన్ అర్థం సాయి కృష్ణ అన్నారు ఆయన పర్యటన సందర్భంగా పేద ఆర్యవైశ్య విద్యార్థిని సాయి లక్ష్మికి 35 వేల ఆర్థిక సహాయాన్ని ఇంటర్ విద్యను అభ్యసించేందుకు అందించడం జరిగిందని క్లబ్ అధ్యక్షులు సంబు శ్రీను వాసులు తెలిపారు ఈ సందర్భంగా జోన్ చైర్మన్ మాట్లాడుతూ రాబోయే రోజులలో మరిన్ని సేవా కార్యక్రమాలను నిర్వహిస్తామని తన పరిధిలోని క్లబ్బులకు అన్ని విధాలుగా అండగా నిలుస్తానని అన్నారు సందర్భంగా పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు ఈ కార్యక్రమానికి ఇరుగంటి ధర్మయ్య ఐరవెంటి స్వామి చెరుకు యాదయ్య వాస రాఘవేందర్ కందూరు లక్ష్మణ స్వామి సంబు





శ్రీనివాసులు గార్లపాటి విజయ్ కుమార్ చెవ్వ ప్రమోద్ కుమార్ ఆర్థిక సహాయం అందించారు కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు సంబు శ్రీను కార్యదర్శి సంబు పాండు కోశాధికారి నాగరాజు పూర్వ అధ్యక్షులు కొట్ర బాలాజీ ఆకుతోట మధుమోహన్ చిగుళ్లపల్లి రమణ తోపాటు రవి ప్రకాష్ బాలరాజు బీసం రాఘవేందర్ రఘు వాస లక్ష్మి కందూరు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు

# బండారి జంపన్న పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన కాంగ్రెస్ నాయకులు

**చిన్న చింతకుంట జులై 20 (స్కై న్యూస్);** చిన్న చింతకుంట మండలం ఉంద్యాల గ్రామానికి చెందిన బండారి జంపన్న నిన్న లివర్స్ వ్యాధితో మృతి చెందారు. విషయం తెలుసుకున్న గ్రామ కాంగ్రెస్ నాయకులు పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను జంపన్న



పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం చేసినట్లు తెలిపారు.

# ఆత్మరక్షణకు కరాటే కీలకం

## జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జి పాటిల్

**నాగర్ కర్నూల్ జులై 20 (స్కై న్యూస్)** విద్యార్థులు యువత కరాటేలు శిక్షణ పొందడం ద్వారా ఆత్మ రక్షణతో పాటు మానసిక శారీరక దృఢత్వం ఏర్పడుతుందని జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జి పాటిల్ అన్నారు సోమవారం జిల్లాలోని లింగాల ప్రాంతానికి చెందిన పలువురు విద్యార్థులు కరాటే లో అంతర్జాతీయ స్థాయిలో



ప్రతిభ కనబరిచి గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించడం వారిని సన్మానించారు అనంతరం ఆయన మాట్లాడుతూ హైదరాబాద్లో వివిధ రాష్ట్రాల నుండి 1212 మంది క్రీడాకారులు పోటీలో పాల్గొన్నారని వారిలో జిల్లాకు చెందిన ముఖేష్ టీం ప్రతిభను కనబరిచి రికార్డు సృష్టించడం హర్షనీయమని అన్నారు. కరాటే మానసిక ప్రశాంతతకు శారీరక ఎదుగుదలకు ఎంతో ఉపయోగపడుతుందని గ్రామీణ విద్యార్థులు రికార్డు సృష్టించడం అభినందనీయమన్నారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడలలో కూడా ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు

# లివర్స్ వ్యాధితో బండారి జంపన్న యువకుడు మృతి

**చిన్న చింతకుంట జులై 20 (స్కై న్యూస్);** చిన్న చింతకుంట మండలం ఉంద్యాల గ్రామానికి చెందిన బండారు జంపన్న నిన్న అనారోగ్యం తో మరణించారు. విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు కోట రాములు 5,000 వేలు ఆర్థిక సహాయం అందించి ఆయన పార్థివ దేహానికి పూల మాల వేసి



నివాళులు అర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి నీ తెలిపారు. ఈ కార్యక్రమం లో బిఆర్ఎస్ నాయకులు మాజీ జడ్పీటీసీ వాలిళ్ళ వెంకటేశ్వర్ రెడ్డి, ఉంద్యాల గ్రామ పార్టీ అధ్యక్షుడు గొల్ల చిన్నారాయుడు ,ఉప సర్పంచ్ బి.యోనా, బాలకృష్ణ రెడ్డి, ఆర్.రామ్,మండల వైస్ ప్రెసిడెంట్ రియాజ్ వార్డు మెంబర్లు కృష్ణ , విజయ్ ,బాలస్వామి ,నాగేందర్ , యూత్ అధ్యక్షులు రాజు, అనతరావు ,తిరుపతి, కృష్ణ గౌడ్, బి.వజ్రం, బి .బాలు, వి.సతీశ్ , వి.మహేందర్, రామ్ గౌడ్, జగన్ , నవీన్ కటికే రాజు, బి.సతీశ్,బాబు నాయక్, తెలుగు రవి తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# పేట కలెక్టరేట్ ప్రజావాణి కి 32 ఫిర్యాదులు

**నారాయణపేట జులై 20: (స్కైన్యూస్):**నారాయణపేట కలెక్టరేట్ లో సోమవారం ప్రజావాణి సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 32 ఫిర్యాదు లు వచ్చాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను అదన పు కలెక్టర్ రెవెన్యూ శ్రీను కి



విన్నవిస్తూ అర్జీలు సమర్పిం చారు. కాగా, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ త్వరగా పరిష్క రించాలని అదనపు కలెక్టర్ అధికారులకుసూచించారు. ఈ కార్యక్రమంలో డి.ఆర్. ఓ.రాజేశ్వరి ఫణి రాజ్, డిప్యూటీ కలెక్టర్,వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# బస్సు సౌకర్యం కల్పించాలి....

## నూతనంగా పాఠశాల భవనాన్ని నిర్మించాలి

**నాగర్ కర్నూల్ జులై 20( స్కై న్యూస్)** జిల్లా కేంద్రంలో విద్యను అభ్యసిస్తున్న పేద విద్యార్థులకు రవాణా సౌకర్యాన్ని కల్పించాలని అందులో భాగంగా తాడూరు మండలం యాదిరెడ్డిపల్లి గ్రామం నుండి ఇంద్రకల్ గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని బిఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు సోమవారం డిపో మేనేజర్ జాదయ్యకు వినతి పత్రం సమర్పించారు అదేవిధంగా లింగసానిపల్లి గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలను అమ్మ ఆదర్శ పాఠశాల పథకంలో చేర్చి నూతన భవనాన్ని నిర్మించాలని కలెక్టర్ కార్యాలయ అధికారులకు వేరువేరుగా వినతి పత్రం సమర్పించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాదిరెడ్డిపల్లి గ్రామం నుండి సుమారు 35 మంది విద్యార్థులు నడుచుకుంటూ వచ్చి విద్యను అభ్యసిస్తున్నారని వర్షాకాలంలో ఇక్కట్లు ఎదుర్కొంటున్నారని వివరించారు. అమ్మాయిలు నడుచుకుంటూ వెళ్లే సమయంలో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రభుత్వ పాఠశాలలో పేద మధ్యతరగతి విద్యార్థుల విద్యను అభ్యసించడం



జరుగుతుందని బస్సు లేకపోవడంతో పరీక్షలకు సకాలంలో హాజరు కావడం లేదని అన్నారు అదేవిధంగా కలెక్టరేట్ అధికారులకు వినతి పత్రం సమర్పించిన తర్వాత ఆయన మాట్లాడుతూ గతంలో ప్రజలు అధికారులకు తమ గ్రామంలోని పాఠశాలను అమ్మ ఆదర్శ పాఠశాల పథకంలో చేర్చాలని కోరిన పట్టించుకోకపోవడం దారుణమని మండిపడ్డారు. గతంలో మనబడి మన ఊరు పథకంలో ఎంపిక చేస్తామని ప్రకటించి చేతులు దులుపుకున్నారే తప్ప



సమస్యను పరిష్కరించలేదని గ్రామ పాఠశాలలో కనీసం తాగునీటి సౌకర్యం కూడా లేదని మరుగుదొడ్లు లేవని పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకుందని వివరించారు. వెంటనే మిషన్ భగీరథ నీటి కనెక్షన్ ఇవ్వాలని నూతన భవనాన్ని నిర్మించాలని కోరారు ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు సాయిబాబు నాయకులు బోనాసి భాస్కర్ అంజి రఘురాం శరత్ తదితరులు పాల్గొన్నారు

# పోలీసు కుటుంబాలకు అండగా ఉంటాం

## ఎస్పీ డాక్టర్ వినీత్

**నారాయణపేట జులై 20 :( స్కైన్యూస్)** విధి నిర్వహణలో ఉన్న పోలీసు సిబ్బంది సంక్షేమా నికి తెలంగాణ పోలీసు శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, మరణించిన పోలీసు సిబ్బంది కుటుంబా లకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ తెలిపారు. నారాయణపేట జిల్లా డీఏ ఆర్కు చెందిన దివంగత ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ కె. బాల నర్సింహులు (హె=ఎజ-347) సతీమణి కె. భారతమ్మకు గ్రూప్ పర్సనల్ యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ కింద మంజూరై న రూ.5 లక్షల చెక్కును ఎస్పీ తన కార్యాలయంలో సోమవారం అందజేశారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు సిబ్బంది తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ప్రజల రక్షణ కోసం నిరంత రం సేవలందిస్తున్నారని,



అలాంటి పోలీసు సిబ్బంది కుటుంబాల సంక్షేమాన్ని ప్రభుత్వం, పోలీసు శాఖ అత్యంత బాధ్యతగా భావిస్తోందన్నారు. సేవలో ఉన్నప్పుడు లేదా అనుకోని పరిస్థితుల్లో మరణించిన పోలీసు సిబ్బంది కుటుంబా లకు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు, బీమా సౌకర్యాలు, ఆర్థిక సహాయ న్ని సకాలంలో అందేలా చర్యలుతీసుకుంటున్నామని తెలిపారు.మరణించిన పోలీసు కుటుంబాలు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా పోలీసు శాఖ అన్ని విధాలుగా తోడ్పాటు అందిస్తుందని, అవసరమైన సంక్షేమ ప్రయోజనాలనుత్వరితగతిన అందించేందుకు జిల్లా పోలీసు యంత్రాంగం కట్టుబడి ఉందని ఎస్పీ పేర్కొన్నారు.ఈ సందర్భం గా దివంగత ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ కె. బాల నర్సిం హులు సేవలను ఎస్పీ స్మరించుకుని, వారి కుటుంబ స భ్యులకు ప్రగాఢ సాను భూతి తెలిపారు. అనంత రం కె. భారతమ్మ చెక్కును స్వీకరించి, ప్రభుత్వం, పోలీసు శాఖకు కృతజ్ఞత లు తెలిపారు.ఈ కార్యక్ర మంలో ఆర్ ఐ విజయ్ భాస్కర్,డీపీ ఓ సూపరింటెండెంట్ శ్యాంసుందర్ రాజు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# సదాశివపేట లో జగన్నాథ రథ యాత్ర ను ప్రారంభించిన డిసిసి అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి

## సదాశివపేట పట్టణం లో ఇస్కాన్ ఆధ్వర్యం లో వైభవంగా జగన్నాథ రథయాత్ర

**సదాశివపేట జులై 20** అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం (ఇస్కాన్) ఆధ్వర్యంలో సదాశివపేట పట్టణంలో శ్రీ జగన్నాథ రథయాత్ర మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఈ ఆధ్యాత్మిక వేడుకకు డిసిసి అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, పూజలు నిర్వహించి రథయాత్రను ప్రారంభించారు. ఈ రథయాత్ర సదాశివపేట దుర్గమ్మ గుడి నుండి ప్రారంభమై శాస్త్రి రోడ్, హైవే, సుభాష్ రోడ్, గాంధీ చౌక్ మీదుగా బసవ సదన్ వరకు సాగింది. రథం కదిలిన వెంటనే భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని 'జగన్నాథ్ కీ జై' అంటూ హరినామ స్మరణ చేశారు. యాత్ర పొడవునా భక్తులు చేసిన భజనలు, ఆధ్యాత్మిక నాట్యాలు, సంకీర్తనలతో పట్టణ వీధులన్నీ భక్తిపారవశ్యంతో మారుమోగాయి. ముఖ్యంగా మహిళా భక్తులు సంప్రదాయ దుస్తుల్లో ప్రదర్శించిన కోలాట నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచి, వీక్షకులను అలరించాయి. భక్తులకు ఎక్కడికక్కడ ఇస్కాన్ నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందజేశారు.సదాశివపేట పట్టణంలో జగన్నాథ రథయాత్రను నిర్వహిస్తూ ఆధ్యాత్మికతను పెంపొందిస్తున్న ఇస్కాన్ స్థానిక శాఖ



ప్రతినిధులను నిర్మలా జగ్గారెడ్డి ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు.ఈ ఆధ్యాత్మిక కార్యక్రమం లో సదాశివపేట మున్సిపల్ వైస్ చైర్మన్ మునిపల్లె అంజమ్మ సత్యనారాయణ, వైస్ చైర్మన్ రేణుక చిరు, సిడిసి చైర్మన్ రామ్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కంది కృష్ణ, నాయకులు సత్యనారాయణ, పృథ్వీ రాజ్, ఇస్కాన్ ప్రతినిధులు మరియు పట్టణ ప్రముఖులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## తెలంగాణ రక్షణ సేన జెండా పండుగ




శేరిలింగపల్లి లో తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర అధ్యక్షురాలు శ్రీమతి కల్వకుంట్ల కవిత గారు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా తలపెట్టిన తెలంగాణ రక్షణ సేన జెండా పండుగ లో భాగంగా తెలంగాణ రక్షణ సేన జెండా శేరిలింగంపల్లి లో ౹ాజీ= స్టేడియం దగ్గర చందానగర్ డివిజన్ లో వాసిలి చంద్ర శేఖర్ ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్మించడం జరిగింది. ఈ రోజు తెలంగాణ రక్షణ సేన శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇన్ ఛార్జ్ వాసిలి చంద్ర శేఖర్ ప్రసాద్ ముఖ్య అతిధి గా పాల్గొని తెలంగాణ రక్షణ సేన జెండా ని ఆవిష్కరించడం జరిగింది. ఈ ఆవిష్కరణ కార్యక్రమం లో ౹=ా సీనియర్ నాయకులు షేక్ అస్లాం, విష్ణు చారీ , మురుగేసాన్, దయానంద్, లక్ష్మి, మాదవి,సందీప్, ప్రవీణ్, శ్రీనివాస్ మరియు నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ జెండా కార్యక్రమం విజయవంతం చేసినందుకు వాసిలి చంద్ర శేఖర్ ప్రసాద్ అందరికి పేరు పేరున కృతజ్ఞతలు తెలియచేసారు.

## ప్రత్యేక ఓటరు సవరణ సహాయక కేంద్రాన్ని పరిశీలించిన అభయ్ పాటిల్.

**కొంపల్లిలో ఆరు ప్రాంతాల్లో సహాయక కేంద్రాలు ఏర్పాటుచేయడం అభినందనీయం.**

**-మాజీ మంత్రి మర్రి శశిధర్ రెడ్డి.**



జాతీయ ఎన్నికల కమిషన్ నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమంలో కొంపల్లి ఓటర్లు అందరూ భాగస్వామ్యం అయ్యేవిధంగా భారతీయ జనత పార్టీ కొంపల్లి శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సహాయక కేంద్రాన్ని తెలంగాణ బీజేపీ ఇంచార్జీ అభయ్ పాటిల్ మరియు మాజీ మంత్రివర్యులు మర్రి శశిధర్ రెడ్డి పరిశీలించారు. బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సహాయక కేంద్రాల ఏర్పాటుద్వార ప్రజలకు కల్పిస్తున్న అవగాహన మరియు సహాయక కార్యక్రమాల గురించి ఆర తీసిన పాటిల్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో తెలంగాణ రాజకీయాల్లో కీలక మార్పులు జరిగే అవకాశం ఉన్నది. రాబోయే బల్దియా ఎన్నికలు దృష్టిల్ పెట్టుకుని ఈ సర్ కార్యక్రమాన్ని మరింత వృద్ధితంగా ప్రజల్లోకి తీసుకెళ్లి గడువు పూర్తయ్యేలోగా 100 శాతం ఈ ప్రక్రియను పూర్తిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా మర్రి శశిధర్ రెడ్డి మాట్లాడుతూ కొంపల్లి డివిజన్ పరిధిలో ప్రతి రోజు ఆరు చోట్ల సహాయక కేంద్రాలు నిర్వహిస్తూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్న స్థానిక డివిజన్ అధ్యక్షులు పెద్దబుద్దుల సతీష్ సాగర్ మరియు కొంపల్లి బీజేపీ నాయకులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక జిల్లా అధ్యక్షులు ఎస్.మల్లారెడ్డి, సర్ కన్వీనర్ నందనం దివాకర్, ఉపాధ్యక్షులు రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి గిరివర్ధన్ రెడ్డి, కౌన్సిల్ సభ్యులు జనార్ధన్ రెడ్డి, అసెంబ్లీ సర్ కన్వీనర్ శివాజీ రాజు, రాష్ట్ర మహిళా మోర్చా నాయకురాలు సరిత రావు, స్థానిక నాయకులు నర్సింహా, అశోక్, దుర్గా, ప్రకాష్ రావు, మాధురి, మహేందర్ సాగర్, అశ్విన్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఫ్యాన్స్ పేరుతో హీరోల ఇమేజ్‌తో ఆట

**హైదరాబాద్ :** తెలుగు రాష్ట్రాల్లో సినిమా, రాజకీయాల మధ్య బంధం ఇప్పటిది కాదు. కానీ ఇటీవల కాలంలో ఈ బంధం సరికొత్తగా, అత్యంత ప్రమాదకరమైన మలుపు తిరిగింది. జూనియర్ ఎన్టీఆర్, అల్లు అర్జున్ వంటి నటులు తమ అసాధారణ ప్రతిభతో పాన్ ఇండియా స్టార్లుగా ఎదిగి, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకునేందుకు అహర్నిశలు శ్రమిస్తున్నారు. సినీ కెరీర్ పరంగా క్షణం తీరిక లేకుండా వారు తమ మార్కెట్‌ను విస్తరిస్తుంటే.. కొందరు మాత్రం వారిని ప్రాంతీయ రాజకీయ చట్రంలో ఇరికించేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. వారిని పూర్తిగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాజకీయాలకే పరిమితం చేయాలనే ఒక నిగూఢ రాజకీయ కుట్ర క్షేత్రస్థాయిలో జోరుగా సాగుతోందని ఇటీవల పరిణామాలు నిరూపిస్తున్నాయి. ఈ కుట్రలో అత్యంత విస్మయపరిచే అంశం ఏమిటంటే.. సమాజంలో కొందరు వ్యక్తులు తమను తాము సదరు హీరోలకు వీరాభిమానులు గా ప్రొజెక్ట్ చేసుకుంటున్నారు. ఈ నిష్కల్మషమైన అభిమానం ముసుగులో వారు తమ సొంత రాజకీయ ఎజెండాలను అత్యంత చాకచక్యంగా అమలు చేస్తున్నారు. సోషల్ మీడియా వేదికగా హీరోల పేర్లతో అనధికారిక అసోసియేషన్లు, డిజిటల్ గ్రూపులు సృష్టించి.. తామే ఆ హీరోల తాలూకు ఏకైక , అధికారిక ప్రతినిధులమనే ఒక కృత్రిమ భ్రమను సామాన్య ఫ్యాన్స్‌లో కల్పిస్తున్నారు. పైకి చూసేందుకు ఈ గ్రూపులు సామాజిక సేవా కార్యక్రమాలు, రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నట్లు రంగులు అద్దుతాయి. కానీ తెరవెనుక అసలు కథ వేరే ఉంటుంది. సదరు హీరోకి ప్రత్యర్థులుగా భావించే రాజకీయ నేతలపై బురదజల్లడం, ఒక రాజకీయ పార్టీకి అనుకూలంగానూ, మరో పార్టీకి వ్యతిరేకంగానూ నర్మగర్భంగా పోస్టులు పెట్టడం వీరి అసలు వ్యాపకం. చివరికి ఈ అనధికార గ్రూపులే మీడియాలోనూ, సోషల్ మీడియాలోనూ సదరు హీరోల పొలిటికల్ ఎంట్రీపై తప్పుడు వార్తలను , పుకార్లను లేవనెత్తుతూ ప్రజల్లో గందరగోళాన్ని సృష్టిస్తున్నాయి. ఇలాంటి ప్రచారాల వెనుక రాజకీయ శక్తుల పరోక్ష హస్తం, వారి ఐటీ విభాగాల ఆర్థిక అండదండలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఒక స్టార్ హీరో ఇమేజ్, ఆయనకున్న లక్షలాది మంది ఫ్యాన్స్ ఓట్ బ్యాంక్‌ను తమ వైపు తిప్పుకోవడానికి లేదా వారిని చీల్చడానికి పొలిటికల్ పార్టీలు ఈ అనధికార అసోసియేషన్లను ఒక సాధనంగా వాడుకుంటున్నాయి. తాము ఏ రాజకీయ పక్షానికి చెందినవారము కాదని, పూర్తి స్థాయిలో సినిమాలకే పరిమితమని ఆయా హీరోల పీఆర్ టీమ్స్ ఎన్నిసార్లు అధికారిక ప్రకటనలతో క్లారిటీ ఇచ్చినప్పటికీ.. ఈ ముఠాలు మాత్రం పదే పదే పాత అబద్ధాలనే కొత్త సీసాలో పెట్టి వదులుతున్నాయి. నిజాయితీ గల అభిమానం ఎప్పుడూ తన హీరో ఎదుగుదలను కోరుకుంటుంది తప్ప.. వారి వ్యక్తిగత, వృత్తిపరమైన ప్రయాణాన్ని సంక్షోభంలోకి నెట్టదు. కేవలం సొంత పొలిటికల్ మైలేజ్ కోసం, తమ చేతిలో ఉన్న డిజిటల్ నెట్‌వర్క్‌ల ద్వారా హీరోల క్రేజ్‌ను వ్యాపారంగా మార్చుకునే ఈ స్వార్థపూరిత వ్యూహాలను సామాన్య నెటిజన్లు సైతం గుర్తించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ పొలిటికల్ మైండ్ గేమ్‌లకు ఎండ్ కార్డ్ పడకపోతే.. నష్టపోయేది కేవలం పరిశ్రమ మాత్రమే కాదు, ఆయా హీరోల నైతిక విలువలు కూడా. అసలైన అభిమానులు దీన్ని గుర్తిస్తారని అంటున్నారు.

# ఢిల్లీ లో నిరసనకారులపై లాఠీ చార్జిని ఖండించండి...

## కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి: సీపీఐ(ఎం ఎల్ )మాస్ లైన్

**నారాయణపేట జూలై 20:( స్కైన్యూస్)**సొనమ్ వాంగ్ చుక్ ఆమరణ నిరాహార దీక్ష విరమింప చేయాలని, కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ పార్టీ కేంద్ర కమిటీ నిరసన కార్యక్రమాలు చేపట్టాలనే పిలుపులో భాగంగా నారాయణపేట జిల్లా కేంద్రంలో సోమవారం అంబేద్కర్ చౌరస్తాలో నిరసన కార్యక్రమం చేపట్టారు .ఈ కార్యక్రమం లో మాస్ లైన్ నాయకులుకె కాశీనాథ్, ప్రశాంత్, ఎదురింటి నరసింహులు, సాయి కుమార్ మాట్లాడుతూ నీట్ పేపర్ లీక్ కారణంగా సుప్రీంకోర్టు జస్టిస్ వ్యాఖ్య లతోకాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో జంత ర్మంతర్ దగ్గర జరుగుతున్న నిరసనలో భాగంగా సొనమ్ వాంగ్ చుక్ ఆమరణ నిరాహార దీక్షకు నీటి పేపర్ లీకేజీ చేసిన దొంగలను కఠినంగా శిక్షించాలని కోరారు. పేపర్ లీకేజ్ కి బాధ్యత వహిస్తూ ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ చలో పార్లమెంట్ కార్యక్ర మానికి కాక్రోచ్ పార్టీ పిలు పు ఇచ్చారన్నారు. శాంతి యుతంగా నిరసన కార్యక్ర మం లో పాల్గొంటున్న నిరసనకారులపై ప్రభుత్వం లాటి చార్జ్ చేసిందన్నారు. లాఠీచార్జి అమానుషం అని ఖండించారు. బిజెపి ప్రభు త్వం నిరంకుశంగా వ్యవహ రిస్తున్నదనీ విమర్శించారు. నీట్ పేపర్ లీకేజీ వ్యవహా రంలో ఉన్న కేంద్ర విద్యాశా ఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలనీ, సోనం వాంగ్చుక్ తో చర్చలు జరిపి అమర నిరాహార దీక్షను విరమింప చేయాలి డిమాండ్ చేశారు.లేనిపక్షంలో ఆందోళన దేశవ్యాప్తంగా ఉధృతం చేస్తామన్నారు ఈ కార్యక్రమంలో నాయ కులు సలీం, చాకలి లాలూ ప్రసాద్, పృథ్వీరాజ్ , పిడి ఎస్ యు జిల్లా కార్యదర్శి మహేష్, పి డి ఎస్ యు నాయకులు, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.




# ఓటర్లపై జరుగుతున్న బెదిరింపులు, అక్రమాలపై జోక్యం, చేసుకోండి

## రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి బీజేపీ ప్రతినిధి బృందం పిర్యాదు

**హైద్రాబాద్ జులై 20 :** ఎస్ఐఆర్ (సర్) ప్రక్రియలో హైదరాబాద్, సికింద్రాబాద్, మల్కాజ్ గిరి, చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గాల్లో ఓటర్లపై జరుగుతున్న బెదిరింపులు, అక్రమ జోక్యం, ఓటరు నమోదు ప్రక్రియకు ఆటంకాలు మరియు బీఎల్ఓలపై ఒత్తిళ్ల అంశాలను తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి (జజూ) బీజేపీ ప్రతినిధి బృందం నివేదిక సమర్పించింది.అదేవిధంగా 2025 నుంచి బీఎల్ఓలకు పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే విడుదల చేసి వారికి న్యాయం చేయాలని, ఆదుకోవాలని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారిని (జజూ) డిమాండ్ చేశారు ఈ సందర్భంగా బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీ ఎన్. రాంచందర్ రావు గారు మీడియాతో మాట్లాడుతూ హైదరాబాద్, సికింద్రాబాద్, మల్కాజ్ గిరి, చేవెళ్ల ప్రాంతాల్లో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి ఇక్కడ స్థిరపడిన అర్హులైన ఓటర్ల పేర్లు నమోదు కాకుండా కొందరు కావాలనే అడ్డంకులు సృష్టిస్తున్నారు.ముఖ్యంగా కాంగ్రెస్, ఎంఐఎం పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు బీఎల్ఓలపై ఒత్తిళ్లు తీసుకొస్తూ, వారిని భయభ్రాంతులకు గురిచేస్తూ అర్హులైన ఓటర్ల పేర్లు నమోదు కాకుండా ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నరు.హైదరాబాద్ నగరంలో బీజేపీకి అనుకూలంగా ఉండే ఓటర్లను లక్ష్యంగా చేసుకుని వారి పేర్లు ఓటరు జాబితాలో నమోదు కాకుండా కాంగ్రెస్, ఎంఐఎం పార్టీలు ప్రయత్నిస్తున్నాయి.ఓటర్లు ఎవరూ భయపడాల్సిన అవసరం లేదు, ఓటు నమోదు విషయంలో ఎక్కడైనా ఒత్తిళ్లు, బెదిరింపులు, అక్రమాలు ఎదురైతే వెంటనే బీజేపీ దృష్టికి తీసుకురావాలని కోరారు.ఈ అంశాలపై సమగ్ర విచారణ జరిపి, ఓటర్ల హక్కులను పరిరక్షించేలా తగిన చర్యలు తీసుకుంటామని ప్రధాన ఎన్నికల అధికారి హామీ ఇచ్చారు.



# కేజిబివి యూఆర్ఎస్ సర్వ శిక్ష ఉద్యోగులకు మినిమం టైం స్కేల్ సర్వీస్ రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్

**టి ఎస్ యూటిఎఫ్ పోస్ట్ కార్డ్ ఉద్యమం**

**మెదక్,జూలై20( వార్తతరంగాలు):**తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టి ఎస్ యు టి ఎఫ్) రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు సోమవారం నాడు మెదక్ జిల్లా జిన్నారం మండల పరిధిలోని కేజీవీబీ పాఠశాల మరియు ఎంఆర్ సి లో పనిచేస్తున్న సర్వ శిక్ష ఉద్యోగుల పోస్ట్ కార్డు ఉద్యమాన్ని ప్రారంభించారు. ఈకార్యక్రమంలో పాల్గొన్న టీఎస్ యుటిఎఫ్ జిన్నారం మండల ఆధ్యక్షురాలు టీ. ఉమాదేవి మాట్లాడుతూ కేజీబీవీ,యుఆర్ఎస్ మరియు సర్వ శిక్ష ఉద్యోగుల డిమాండ్ల పరిష్కారం కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి కి పోస్ట్ కార్డుల ద్వారా విన్నవించడం కోసం ఈపోస్ట్ కార్డుల ఉద్యమాన్ని రాష్ట్రవ్యాప్తంగా తీసుకోవడం జరిగిందన్నారు. అన్నారు. ౹ాఖుఖీ , ఖ+దీఎ రాష్ట్ర ఆద్యక్షురాలు విశాలాక్షి మాట్లాడుతూ KGBV/URS/SSA ఉద్యోగ ఉపాధ్యాయులకు మినిమం టైమ్ స్కేల్ వర్తింప చేయాలని, రెగ్యులర్ ఉద్యోగులతో సెలవు సౌకర్యాలు కల్పించాలని, వార్షిక ఇంక్రిమెంట్, హెల్త్ కార్డులు మంజూరు చేయాలని, కేర్ టేకర్లను నియమించాలని, సమ్మె కాలపు వేతనాలు చెల్లించాలని మొదలగు డిమాండ్స్ పరిష్కరించాలని కోరుతూ గౌరవ ముఖ్య మంత్రి గారికి పోస్ట్ కార్డ్ ఉద్యమం ప్రంబించామని అన్నారు.ఈ కార్యక్రమంలో ౹ాఖుఖీ ఎస్త్రఎజ రాష్ట్ర ఆద్యక్షురాలు విశాలాక్షి. రాష్ట్ర కమిటీ సభ్యులు అమరేశ్వరీ జిన్నారం మండల అధ్యక్షురాలు ఉమాదేవి,జిన్నారం మండల జనరల్ సెక్రెటరీ కేశవ రావు, జిన్నారం ఖ+దీఎ ౹ాా కవిత, జిన్నారం గుమ్మడి దల టీచింగ్ అండ్ నాన్ టీచింగ్ సిబ్బంది పాల్గొన్నారు.




## నారాయణపేట లేబర్ కార్యాలయం ముందు కార్మికుల ధర్నా

**నారాయణపేట జూలై 20: (స్కై న్యూస్)**తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ సంక్షేమ స్కీములను ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పజెప్పే విధానాన్ని వెంటనే రద్దు చేయాలని, జీవో నెంబర్ 12ను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవా రం రోజు నారాయణపేట లేబర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించా రు .ఈ ధర్నాలో సిఐటియు జిల్లా కార్యదర్శి బండమీది బలరాం మాట్లాడుతూ సంక్షేమం బోర్డులో ఉన్న నిధులు జీవో నెంబర్ 12 ద్వారా 346 కోట్లు నిధుల ను ప్రవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు అక్రమంగా బదులు చేశారని విమర్శిం చారు.2025 జూలై 24న ప్రవేట్ ఇన్సూరెన్స్ కంపెనీ లకు అప్పజెప్పిన ప్రభు త్వం నేడు జూలై 24 వస్తే సంవత్సరం పూర్తవుతుం దని ఈ సంవత్సరంలో ప్రవేటు ఇన్సూరెన్స్ కంపె నీలను ఖర్చుపెట్టింది కేవ లం 150 కోట్లు మాత్రమే 200 కోట్ల రూపాయలు మిగిల్చుకున్నారని విమర్శించారు .కార్మికులకు ఎలాంటి ఉపయోగము లేని హెల్త్ టెస్టులు నిర్వహి స్తున్నారని హెల్త్ టెస్టుల పేరుతోనో సిఎస్సి ఏజెన్సీ వారికి 700 కోట్ల రూపాయ లు అక్రమంగా అప్పజెప్పా రనిమండిపడ్డారు .సంక్షేమం బోర్డులో ఉన్న నిధులన్నీ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి ఉపయోగించాలి తప్ప ఇతరులకు కాదన్న సంగతి ప్రభుత్వం గుర్తుతెరగాలని హెచ్చరించారు నారాయ ణపేట జిల్లా పరిధిలో 65లకు 10 గా 600కు పైగా ఫైలు పెండింగ్లో ఉన్నాయని ఐదు సంవత్సరాలు గడు స్తున్న నేటికీ ఒక్క రూపా యి కూడా మంజూరు కావడం లేదని విమర్శించా రు చిన్నచిన్న కారణాలతో దరఖాస్తులు వెనక్కి పంపు తున్నారని కార్మికులను ఆఫీస్ చుట్టూ తిప్పుకుం టున్నారని విమర్శించారు. లేబర్ అధికారుల తీరు మారకపోతే భవిష్యత్తులో పెద్ద ఎత్తునఉద్యమిస్తామని హెచ్చరించారు ఈ కార్యక్ర మంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జోషి భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు నర్సింలు హనుమంతు సిపిఎం సోషల్ మీడియా కన్వీనర్ సోఫీ మజార్ హుస్సేన్ సిఐటియు జిల్లా నాయకు లు బొమ్మల పాడు తదిత రులు పాల్గొన్నారు.

## పరిశీలించిన బి ఆర్ ఎస్ జిల్లా అధ్యక్షులు యస్. రాజేందర్ రెడ్డి

**నారాయణపేట జూలై 20: (స్కైన్యూస్)**నారాయణపేట జిల్లా కేంద్రంలో బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు నిర్వహిస్తున్న 7వ, 11వ, 18వ, 19వ వార్డులలో ఏర్పాటు చేసిన ఎన్యుమరేషన్ హెల్ప్ సెంటర్లను మాజీ ఎమ్మెల్యే,బి ఆర్ ఎస్ జిల్లా అధ్యక్షుడు యస్. రాజేందర్ రెడ్డి సోమవారం పరిశీలించారు. హెల్ప్ సెంటర్లలో ప్రజలకు అందు తున్న సేవలు, దరఖాస్తుల నమోదు ప్రక్రియను ఉచితంగా సేవలు నిర్వహి స్తున్న వారినీ అభినందిం చారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్యుమరేషన్ ప్రక్రియలో హెల్ప్ సెంటర్లకు వచ్చే ప్రతి ఒక్కరికీ త్వరితగతిన సేవలు అందేలా ప్రజలు ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరిస్తూ తమ వివరా లను సకాలంలో నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## అమరవీరుల స్థూపం ఉద్యమకారులకు దక్కిన గౌరవం..

**తెలంగాణ ఉద్యమకారుడు, కార్మిక సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ పినపాక ప్రభాకర్**

**రంగారెడ్డి జిల్లా, జూలై 20 (స్కై న్యూస్):** షాద్‌నగర్‌లో తెలంగాణ అమరవీరుల స్థూపం ఆవిష్కరణ సందర్భంగా ఉద్యమకారులను సన్మానించడం గౌరవప్రదమైన విషయమని తెలంగాణ ఉద్యమకారుడు, కార్మిక సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ పినపాక ప్రభాకర్ అన్నారు. సభలో తనను సన్మానించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు కృతజ్ఞతలు తెలిపిన ఆయన, భారీ కార్యక్రమాల్లో చిన్నచిన్న నిర్వహణ లోపాలు సహజమేనని, తనకు ఎలాంటి అగౌరవం జరగలేదని స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో తన పేరుతో తప్పుడు ప్రచారం చేయడం బాధాకరమని, పూర్తి విషయ పరిజ్ఞానం లేకుండా ట్రోలింగ్ చేయడం సరికాదన్నారు. తెలంగాణ ఉద్యమకారులను గౌరవించే కార్యక్రమాలను తాను స్వాగతిస్తున్నానని, ఉద్యమకారుల కోసం ప్రత్యేక కార్యక్రమం చేపట్టిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను అభినందించారు.

## బీఆర్ఎస్ కార్యకర్త వెంకటేష్ మృతి బాధాకరం..

**షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్**

**రంగారెడ్డి జిల్లా, జూలై 20 (స్కై న్యూస్):** ఫరూఖ్‌నగర్ మండలం రాయికల్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త వెంకటేష్ అకాల మరణం తీవ్ర విషాదకరమని మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్ అన్నారు. ఆదివారం రాయికల్ గ్రామానికి వెళ్లిన అంజయ్య యాదవ్, వెంకటేష్ పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. వెంకటేష్ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించిన ఆయన, ఈ విషాదాన్ని తట్టుకునే ధైర్యాన్ని కుటుంబ సభ్యులకు భగవంతుడు ప్రసాదించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని వెంకటేష్‌కు నివాళులర్పించారు.



## ఎల్ నినో ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు

# సమన్వయంతో పని చేయాలి...









**సమష్టిగా నిలబడదాం, రైతులు, ప్రజలను కాపాడుకుందాం.**
**ఆరుతడి పంటల సాగుపై విస్తృత అవగాహన కల్పించాలి.**
**రైతులను ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లించాలి.**
**కంట్రోల్ రూమ్, టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేయాలి.**
**ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ.**

**మహబూబ్ నగర్ జులై 20(స్పైన్యూస్ ):**ఎల్‌నినో ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కోవడంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా రాష్ట్రం కు నాంది కావాలని, ఉమ్మడి జిల్లాకు చెందిన ప్రభుత్వ యంత్రాంగం మిషన్ మోడ్‌లో పనిచేయాలని ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ అన్నారు. ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షపాతం గణనీయంగా తగ్గే అవకాశాలు ఉన్న నేపథ్యంలో రైతులు, ప్రజల ప్రయోజనాల పరిరక్షణే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ప్రకృతి విపత్తులను ముందుగానే అంచనా వేసి, వాటి ప్రభావాన్ని తగ్గించే దిశగా ప్రభుత్వం ఇప్పటికే సమగ్ర కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసిందని తెలిపారు. ఉమ్మడి జిల్లాకు చెందిన అధికారులు సమష్టి బాధ్యతతో పనిచేసి తెలంగాణకు మార్గదర్శకంగా నిలవాలని పిలుపునిచ్చారు.ప్రభుత్వ యంత్రాంగం ఒకే లక్ష్యంతో పనిచేయాలని సమన్వయంతో ముందుకు సాగాలని మంత్రి సూచించారు. ప్రజాప్రతినిధుల సూచనలను గౌరవిస్తూ, క్షేత్రస్థాయిలో రైతులకు ధైర్యం, భరోసా కల్పించే చర్యలు చేపట్టాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.సోమవారం మహబూబ్‌నగర్ కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు రూపొందించిన ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళికపై, ఇతర అభివృద్ధి కార్యకలాపాలపై ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా స్థాయి సమీక్ష సమావేశం మంత్రి దామోదర్ రాజనర్సింహ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ...ఎల్‌నినో ప్రభావాన్ని ప్రజలపై పడనీయొద్దని, తాగునీరు, సాగునీరు, వ్యవసాయం, విద్యుత్, పశుసంవర్ధకం సహా అన్ని శాఖలు అప్రమత్తంగా ఉండాలన్నారు.జూలై 31 నాటికి శాఖల వారీ కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. అన్ని శాఖలు యుద్ధ ప్రాతిపదికన పనులు చేయాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో ఏర్పడే వర్షాభావ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అన్ని శాఖలు యుద్ధప్రాతిపదికన పనిచేయాలని స్పష్టం చేశారు.రాష్ట్ర మంత్రివర్గం తీసుకున్న నిర్ణయాలు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు మహబూబ్‌నగర్ కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఎల్‌నినో కంటింజెన్సీ సమీక్ష సమావేశంలో మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, జోగులాంబ గద్వాల, నారాయణపేట జిల్లాల పరిస్థితులను శాఖల వారీగా మంత్రి సమీక్షించారు.సమావేశంలో ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్, ఎల్‌నినో ఎక్స్‌పర్ట్ కమిటీ చైర్మన్ జి. చిన్నారెడ్డి, స్పెషల్ ఆఫీసర్ షఫీ ఉల్లా,ఉమ్మడి జిల్లా శాసన సభ్యులు యెన్నం శ్రీనివాస్ రెడ్డి(మహబూబ్ నగర్),జి మధుసూదన్ రెడ్డి(దేవరకద్ర), జె అనిరుధ్ రెడ్డి(జడ్చర్ల),కూచుకుళ్ళ రాజేశ్ రెడ్డి(నాగర్ కర్నూల్), తూడి మేఘా రెడ్డి(వనపర్తి), బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి(గద్వాల), కసిరెడ్డి నారాయణ రెడ్డి(కల్వకుర్తి), డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ(అచ్చంపేట) వీర్లపల్లి శంకర్(షాద్ నగర్), విజయుడు(అలంపూర్) ఇతర ప్రజాప్రతినిధులు, ఐదు జిల్లాల కలెక్టర్లు ఖుష్బూ గుప్తా(మహబూబ్ నగర్), ఆదర్శ్ సురభి(వనపర్తి), సి హెచ్ ప్రియాంక(నారాయణ పేట), షేక్ రిజ్వాన్ భాషా(గద్వాల), హేమంత్ కేశవ్ పాటిల్(నాగర్ కర్నూల్),రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఒబెదుల్లా కొత్వాల్, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ చైర్మన్ శివ సేనా రెడ్డి,రాష్ట్ర గొర్రెలు,మేకల అభివృద్ధి సహకార సమాఖ్య చైర్మన్ సతీశ్,మహబూబ్ నగర్ నగర పాలక సంస్థ మేయర్ జి.మమత,ఉమ్మడి జిల్లా మున్సిపల్ చైర్మన్ అన్ని శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. శాఖల వారీగా ప్రస్తుత పరిస్థితులను, భవిష్యత్ కార్యాచరణను అధికారులు మంత్రికి వివరించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో సాధారణంగా ఈ సమయానికి నమోదు కావాల్సిన వర్షపాతంతో పోలిస్తే సుమారు 40 శాతం లోటు వర్షపాతం నమోదైందని తెలిపారు.

**ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..**

వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రతి శాఖ ముందస్తు ప్రణాళికతో పనిచేస్తేనే ఎల్‌నినో ప్రభావాన్ని సమర్థంగా తగ్గించగలమన్నారు. ఎల్‌నినో అంటే ఏమిటి, దాని ప్రభావం ప్రజల జీవితాలపై, వ్యవసాయంపై ఎలా ఉంటుందో గ్రామస్థాయిలో విస్తృతంగా అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రజల్లో అనవసర ఆందోళన కలగకుండా శాస్త్రీయ సమాచారం అందించాలని సూచించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని ప్రధాన సాగునీటి ప్రాజెక్టులు కృష్ణా నది జలాలపైనే ఆధారపడి ఉన్నాయని, కర్ణాటకలోని ఆల్మట్టి జలాశయం నిండిన తర్వాతే దిగువ ప్రాంతాలకు నీటి ప్రవాహం వచ్చే పరిస్థితి ఉంటుందని అధికారులు మంత్రికి వివరించారు. మంత్రి స్పందిస్తూ.... ప్రస్తుతం అందుబాటులో ఉన్న నీటి వనరులను అత్యంత సమర్థంగా వినియోగిస్తూ తాగునీటికి అత్యున్నత ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. ప్రజలకు ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, గ్రామాల్లో పనిచేయని హ్యాండ్‌పంపులు, బోర్లను వెంటనే మరమ్మతు చేయాలని, అవసరమైతే ప్రత్యామ్నాయ తాగునీటి ఏర్పాట్లు చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. భూగర్భ జలాల మట్టాలు తగ్గుతున్న నేపథ్యంలో వర్షపు నీటిని ఒడిసిపట్టే కార్యక్రమాలను వేగవంతం చేయాలని, బోరువెల్ రీఛార్జ్, ఇంకుడు గుంతలు, చెక్‌డ్యాంలు, పర్కొలేషన్ ట్యాంకులు, ఇతర నీటి సంరక్షణ పనులను విస్తృతంగా చేపట్టి భూగర్భ జలాల పెరుగుదలకు చర్యలు తీసుకోవాలని సూచించారు. వ్యవసాయ, ఉద్యానవన శాఖలు సమన్వయంతో పనిచేసి రైతులకు శాస్త్రీయ సూచనలు అందించాలని మంత్రి ఆదేశించారు. అధిక నీటి అవసరం ఉండే పంటలకు బదులుగా తక్కువ నీటితో, తక్కువ వ్యవధిలో పూర్తయ్యే పూలు, ఉద్యాన పంటలు, ఇతర ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలని సూచించారు. రైతులకు విత్తనాలు, సాంకేతిక సలహాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు తగ్గకుండా ఉపాధి హామీ పథకం కింద పెద్ద ఎత్తున పనులు చేపట్టాలని, అవసరమైతే సాధారణ పరిస్థితుల కంటే ఎక్కువ రోజులు ఉపాధి కల్పించేలా కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు.విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా అన్ని ముందస్తు ఏర్పాట్లు చేయాలని, వ్యవసాయం, తాగునీటి అవసరాలకు నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

ప్రజారోగ్య పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని మంత్రి స్పష్టం చేశారు. తాగునీటి కొరత కారణంగా నీటి ద్వారా వ్యాపించే వ్యాధులు ప్రబలకుండా ఆరోగ్య శాఖ ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రభుత్వ హాస్పిటల్స్‌లో అవసరమైన మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, అత్యవసర వైద్య సామగ్రి అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు. డెంగీ, మలేరియా, చికున్‌గున్యా, డయేరియా, గ్యాస్ట్రోఎంటరైటిస్ వంటి వ్యాధుల నివారణకు పారిశుధ్య కార్యక్రమాలు, క్లోరినేషన్, ఫాగింగ్, యాంటీ లార్వా చర్యలను ముమ్మరం చేయాలని సూచించారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఉమ్మడి జిల్లాకు ప్రత్యేక అధికారిని నియమించినట్లే, ప్రతి మండలానికి ప్రత్యేక అధికారిని నియమించాలని అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలో ఒక కంట్రోల్ రూమ్ ను, టోల్ ఫ్రీ నెంబర్ ను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మండల స్థాయిలో పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు వెంటనే చేపట్టే విధంగా వ్యవస్థను బలోపేతం చేయాలని సూచించారు.జూలై 31 నాటికి అన్ని శాఖలు తమ కార్యాచరణ ప్రణాళికలు, అవసరమైన ప్రతిపాదనలను సిద్ధం చేసి ప్రభుత్వానికి సమర్పించాలని మంత్రి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. వాటి ఆమలుకు అవసరమైన అదనపు బడ్జెట్ కేటాయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు.ఎల్‌నినో కారణంగా ఒక్కోసారి కుంభవృష్టి వర్షాలు పడి వరదలు వచ్చే ప్రమాదం కూడా ఉంటుందని వాతావరణ శాఖ నిపుణులు హెచ్చరిస్తున్న నేపథ్యంలో.. ఇందుకు కూడా అధికారులు సిద్ధంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో ఆకస్మిక వరదల వల్ల ఎక్కువ నష్టం వాటిల్లే ప్రమాదం ఉంటుందని మంత్రి హెచ్చరించారు. పంచాయతీరాజ్, మునిసిపల్ డిపార్ట్‌మెంట్, నీటి పారుదలశాఖ అధికారులు ఈ అంశంపై కూడా శ్రద్ధ పెట్టాలని మంత్రి సూచించారు.ప్రజలు, ప్రస్తుత పరిస్థితిని అర్థం చేసుకుని ప్రభుత్వానికి సహకరించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. ఇది మనుషులు సృష్టించిన సంక్షోభం కాదు... ప్రకృతి తెచ్చిన సవాల్. దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాలు ఇదే పరిస్థితిని ఎదుర్కొంటున్నాయని మంత్రి పేర్కొన్నారు. ప్రజలపై ఎల్‌నినో ప్రభావం తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని, రైతులకు అన్ని విధాలా అండగా ఉంటుందని, ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు సమష్టిగా పనిచేస్తే ఈ పరిస్థితిని విజయవంతంగా ఎదుర్కోగలమని మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు.

**ఈ నెల 24 న సమీక్ష సమావేశం**

ఉమ్మడి జిల్లాలోని 5 జిల్లాలకు సంబంధించి ఈ నెల 24 న శుక్రవారం ఉదయం 10 గంటలకు నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టరేట్‌లో నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాల అధికారులతో సమీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం మధ్యాహ్నం 2 గంటలకు మహబూబ్ నగర్ కలెక్టరేట్ లో మహబూబ్‌నగర్, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల అధికారులతో మరో సమీక్ష నిర్వహించి జిల్లాల వారీగా కార్యాచరణను ఖరారు చేయనున్నట్లు వెల్లడించారు.ముఖ్యంగా ఆర్ డబ్ల్యు.ఎస్, మిషన్ భగీరథ, పంచాయతీ రాజ్, వైద్య ఆరోగ్య శాఖ ల అధికారులు సమగ్ర వివరాలతో సమావేశానికి హాజరు కావాలని మంత్రి ఆదేశించారు.

ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కోవడం ఒక్క ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, అధికారులు, ప్రజాప్రతినిధులు, శాస్త్రవేత్తలు, రైతులు, ప్రజలు అందరూ సమష్టిగా కృషి చేస్తేనే నష్టాలను తగ్గించగలమని మంత్రి తెలిపారు. ముందస్తు ప్రణాళిక, సమన్వయం, ప్రజల్లో అవగాహన, నీటి సంరక్షణ, ప్రత్యామ్నాయ పంటల ప్రోత్సాహం ద్వారా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా తెలంగాణ రాష్ట్రానికి ఆదర్శంగా నిలవాలని మంత్రి ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

**వర్షా భావ పరిస్థితులు, వాతావరణ మార్పులకు అనుగుణంగా పంటలు సాగు చేయాలి**

తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి మాట్లాడుతూ..., ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు సుమారు 50 శాతం మేర మాత్రమే సాగు విస్తీర్ణంలో పంటల విత్తనాలు పూర్తయ్యాయని, మిగిలిన 50 శాతం విస్తీర్ణంలో ఇంకా సాగు ప్రారంభం కాలేదని తెలిపారు. వర్షాభావ పరిస్థితులు, వాతావరణ మార్పులను దృష్టిలో ఉంచుకుని రైతులు పంటల ఎంపికలో జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. ఇప్పటికే సాగు చేసిన పంటలను శాస్త్రీయ పద్ధతుల్లో సంరక్షిస్తూ, తేమను నిల్వ చేసుకునే విధానాలు, పంటల రక్షణ చర్యలను పాటించాలని రైతులకు సూచించారు.మిగిలిన సాగు విస్తీర్ణంలో రైతులు తక్కువ కాలంలో దిగుబడి ఇచ్చే, తక్కువ పెట్టుబడితో సాగు చేయగల కూరగాయల పంటలు, పప్పుధాన్యాలు, నూనెగింజల పంటలు, ఉద్యాన పంటల సాగుపై దృష్టి పెట్టేలా వ్యవసాయ అధికారులు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని అన్నారు. రైతులకు పంటల ఎంపిక, విత్తనాల లభ్యత, సాగు పద్ధతులు, మార్కెటింగ్ అవకాశాలపై సమగ్ర అవగాహన కల్పించడం ద్వారా నష్టాలను తగ్గించి ఆదాయాన్ని పెంచే దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు.అదేవిధంగా నాగర్‌కర్నూలు జిల్లాలో వరి సాగుకు బదులుగా ప్రత్యామ్నాయ పంటలైన ఆయిల్ పామ్‌తో పాటు ఇతర వాణిజ్య, ఉద్యాన పంటల సాగుపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారని తెలిపారు. నీటి లభ్యత, నేల స్వభావం, వాతావరణ పరిస్థితులకు బట్టి ఏ పంటలు అనుకూలంగా ఉంటాయో రైతులకు క్షేత్రస్థాయిలో వివరించడం వల్ల మంచి ఫలితాలు కనిపిస్తున్నాయని చెప్పారు. ఈ విధానాన్ని రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో కూడా అమలు చేసి, రైతులు పరిస్థితులకు అనుగుణంగా పంటల మార్పిడి చేపట్టేలా ప్రోత్సహించాలని అధికారులను కోరారు.ప్రత్యామ్నాయ పంటల సాగు ద్వారా నీటి వినియోగాన్ని తగ్గించడంతో పాటు సాగు ఖర్చును కూడా నియంత్రించవచ్చని చిన్నారెడ్డి తెలిపారు. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలను ప్రోత్సహించడం ద్వారా రైతులకు మెరుగైన ఆదాయం లభిస్తుందని, వ్యవసాయాన్ని లాభసాటి వృత్తిగా మార్చేందుకు ప్రభుత్వం, వ్యవసాయ శాఖ, శాస్త్రవేత్తలు, అధికారులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు.గ్రామ స్థాయిలో రైతు సమావేశాలు, అవగాహన సదస్సులు, క్షేత్ర ప్రదర్శనలు నిర్వహిస్తూ శాస్త్రీయ సాగు పద్ధతులను రైతులకు చేరవేయాలని, ప్రతి రైతు వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా సరైన నిర్ణయాలు తీసుకునేలా వ్యవసాయ విస్తరణ అధికారులు నిరంతరం అందుబాటులో ఉండాలని చిన్నారెడ్డి సూచించారు. రైతుల ఆదాయాన్ని కాపాడటం, సాగును స్థిరంగా కొనసాగించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.రైతులకు అవగాహన కల్పించేలా రాష్ట్రం నుంచి జిల్లాలకు ఎలా అయితే ప్రత్యేక అధికారి నిర్మించారో, అదేవిధంగా అన్ని జిల్లాల్లో మండలాలకు ప్రత్యేక అధికారులు నిర్మించి రైతులకు అవగాహన కల్పించే కార్యక్రమాలను చేపట్టాలన్నారు. "అన్ను 15 రోజుల్లో ప్రణాళికలను పూర్తి చేసి రాష్ట్రస్థాయి పంపించాలా అధికారం చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.ప్రస్తుత వర్షాభావ ప్రభావంతో గ్రామాల్లో రైతులు, ప్రజలకు పనులు కల్పించేలా జీరంతి ఉపాధి పథకం ద్వారా ప్రతిరోజు గ్రామాల్లో ప్రజలకు తప్పనిసరిగా పనులు కల్పించి వారి జీవనోపాధికి కృషి చేయాలని అధికారులకు సూచించారు. అదేవిధంగా గ్రామాల్లో విద్యుత్ సరఫరా అంతరాయం లేకుండా మెరుగైన వసతులతో పాటు, త్రాగునీటి సమస్యపై ప్రత్యేక దృష్టి పెట్టాలని చిన్నారెడ్డి సూచించారు.

**సమావేశంలో అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ మాట్లాడుతూ...**

నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గ పరిధిలోని ఆరు మండలాలు చెంచు గిరిజనులు అధికంగా నివసించే ప్రాంతాలని, ఈ ప్రాంత ప్రజల జీవనాధారం ప్రధానంగా పోడు వ్యవసాయంపైనే ఆధారపడి ఉందని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ తెలిపారు. సుమారు 7 వేల ఎకరాల పోడు భూముల్లో చెంచు రైతులు సాగు చేస్తూ జీవనం సాగిస్తున్నారని,మాచారం గ్రామంలో రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి ఇందిరా సౌరగిరి జల వికాసం కార్యక్రమం ద్వారా మన్ననూర్ పంటల సాగును ప్రారంభించడం గిరిజన రైతులకు ఎంతో ఉపయోగకరంగా మారిందని ఆయన అన్నారు. అయితే ప్రస్తుతం వర్షాల అనిశ్చిత పరిస్థితుల కారణంగా చెంచు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారికి ప్రభుత్వం ప్రత్యేక సహాయ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని కోరారు.అచ్చంపేట నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో కొతుల బెడద తీవ్రంగా ఉండటంతో రైతులు సాగు చేస్తున్న పంటలు భారీగా దెబ్బతింటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యను దృష్టిలో ఉంచుకొని స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించే విధంగా కార్యాచరణ రూపొందించాలని అధికారులను కోరారు.

ముఖ్యంగా ఆయిల్ పామ్ సాగు, డెయిరీ డెవలప్‌మెంట్ వంటి ఆదాయాన్ని పెంచే వ్యవసాయ, అనుబంధ రంగాలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ సమగ్ర యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని సూచించారు. రైతులకు అవసరమైన మొక్కలు, సాంకేతిక శిక్షణ, రుణ సదుపాయాలు, మార్కెటింగ్, పశుసంవర్ధక సేవలు, మౌలిక వసతులు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు.చెంచు గిరిజన రైతుల జీవనోపాధి స్థిరపడేలా, వారి ఆదాయం పెంచేలా వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రత్యేక అభివృద్ధి కార్యాచరణను అమలు చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అధికారులకు సూచించారు.ఉద్యాన పంటలు ప్రోత్సహించాలంటే ప్రతి జిల్లా కేంద్రంలో విధిగా కోల్డ్ స్టోరేజీలు నిర్మించాలని, ప్రభుత్వం ఆ విధమైన చర్యలు తీసుకుంటే ప్రజలు రైతులకు ఉద్యాన పంటలపై నమ్మకం కలుగుతుందని ఆయన తెలిపారు.నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి మాట్లాడుతూ.....గ్రామస్థాయిలో రైతులకు అవగాహన కల్పించి, అధిక అన్నితో సాగు చేసే పంటలను సాగు చేయకుండా ముందస్తుగానే రైతులకు అవగాహన కల్పించాలని , ప్రతి అధికారి విధిగా గ్రామస్థాయిలో రైతాంగానికి స్పష్టంగా తెలియపరచాలని సూచించారు.

**కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ.....**

కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలో భాగంగా నాగర్ కర్నూల్ జిల్లా పరిధిలోని కల్వకుర్తి నియోజకవర్గం లో దాదాపు 60 కిలోమీటర్లు నీటి ప్రవాహం ద్వారా ప్రజలకు చేరాలని, ఆశించిన స్థాయిలో కాలువల నిర్వహణ సరిగ్గా లేకపోవడంతో రైతుల పొలాల్లోకి నీటి ప్రవాహం ద్వారా రైతాంగం నష్టం పోతున్నారని, ప్రస్తుత వర్షాభావ ప్రభావ నేపథ్యంలో క్రాప్ హాలిడే నిర్వహించి, సాగునీటి ప్రాజెక్టుల కాలువల పెండింగ్ పనులు పూర్తిచేసి రైతాంగానికి మేలు చేయాలని ఆయన సూచించారు.

**దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ...**

ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడిన వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులకు అవగాహన కల్పించడం అత్యంత కీలకమని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి అన్నారు.

దక్షిణ తెలంగాణలో సాధారణం కంటే వర్షపాతం గణనీయంగా తగ్గిందని, ఈ పరిస్థితుల్లో రైతులు ఇప్పటికీ సాధారణ వర్షాలు వస్తాయని ఆశిస్తూ సంప్రదాయ పంటల సాగుకు సిద్ధమవుతున్నారని పేర్కొన్నారు. అలాంటి పరిస్థితుల్లో శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు, ఉద్యానవన శాఖ అధికారులు రైతు వేదికలు, గ్రామస్థాయి సమావేశాల ద్వారా ఎల్‌నినో ప్రభావం, వర్షపాత పరిస్థితులు, ప్రభుత్వం చేపడుతున్న ప్రత్యామ్నాయ చర్యలపై విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు.వర్షాధార పంటలకు బదులుగా తక్కువ నీటితో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటలను రైతులు ఎంచుకునేలా అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే అన్నారు. బాలానగర్ మండలంలోని పెద్దిపల్లి గ్రామంలో విజయవంతంగా సాగు చేస్తున్న కూరగాయల వంటి ప్రత్యామ్నాయ పంటల నమూనాలను ఇతర రైతులకు చూపించి ప్రోత్సహించాలని సూచించారు. పెట్టుబడి పెట్టి నష్టపోయే పరిస్థితి రాకుండా ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులను ప్రోత్సహించడం అవసరమన్నారు. వ్యవసాయ, ఉద్యానవన శాఖలు చేపడుతున్న చర్యలను గ్రామస్థాయి వరకు రైతులకు చేరవేయాలని, ఇందుకోసం విస్తృత ప్రచార కార్యక్రమాలు, వర్క్‌షాప్‌లు, సైన్‌బోర్డులు, ప్రకటనల ద్వారా అవగాహన కల్పించాలని కోరారు. ఎల్‌నినో పరిస్థితులపై ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ప్రజలకు స్పష్టంగా వివరించడం ద్వారా అపోహలను తొలగించాలన్నారు.

భూగర్భ జలాల సంరక్షణపై కూడా ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎమ్మెల్యే సూచించారు. వర్షపు నీరు భూగర్భంలోకి ఇంకేలా గ్రౌండ్ వాటర్ శాఖ ఇతర శాఖలతో సమన్వయం చేసుకొని చర్యలు చేపట్టాలని సూచించారు. భూగర్భ జలాల పరిస్థితిపై అధికారులు రూపొందిస్తున్న నివేదికలను ప్రజలకు తెలియజేస్తూ అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామాలు, మండలాల వారీగా భూగర్భ జలాల లభ్యతపై ప్రజలకు సమాచారం అందించకపోతే, నీరు లేని ప్రాంతాల్లో బోర్లు వేసి రైతులు ఆర్థికంగా నష్టపోయే ప్రమాదం ఉందని ఆయన పేర్కొన్నారు. అందువల్ల గ్రౌండ్ వాటర్ నివేదికలను గ్రామస్థాయి అవగాహన కార్యక్రమాల్లో తప్పనిసరిగా వివరించాలని అధికారులను ఆదేశించారు.

**జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి మాట్లాడుతూ....**

జడ్చర్ల మున్సిపల్ పరిధిలో మిషన్ భగీరథ ద్వారా సరఫరా చేస్తున్న తాగునీటి పంపిణీలో గత రెండేళ్లుగా తీవ్ర సమస్యలు కొనసాగుతున్నాయని మంత్రి దామోదర్ రాజనర్సింహ దృష్టికి తీసుకువచ్చారు. తాగునీటి సరఫరాలో తరచూ అంతరాయాలు ఏర్పడుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.ప్రత్యేకించి వేసవి కాలంతో పాటు ప్రస్తుతం వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో తాగునీటి సమస్య మరింత తీవ్రరూపం దాల్చే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. మిషన్ భగీరథ అధికారులు సమస్యను శాశ్వతంగా పరిష్కరించే దిశగా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని, అవసరమైతే అదనపు నీటి వనరులను సమకూర్చి నిరంతరాయంగా తాగునీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు.జడ్చర్ల పట్టణ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తక్షణ చర్యలు చేపట్టేందుకు ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపాలని, సంబంధిత శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని మంత్రి దామోదర్ రాజనర్సింహను ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

**గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి మాట్లాడుతూ**

ఎల్‌నినో ప్రభావంతో నెలకొన్న వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని జిల్లాలో అధిక నీటి అవసరం ఉన్న వరి, పత్తి పంటలకు ప్రత్యామ్నాయంగా తక్కువ నీటితో సాగు చేయగల పొద్దుతిరుగుడు (సన్‌ఫ్లవర్) పంటను ప్రోత్సహించాలని సూచించారు. రైతులు ఈ పంట సాగు చేయడానికి ముందుకు వచ్చేలా అవసరమైన మార్కెటింగ్ సదుపాయాలు కల్పించాలని అధికారులను కోరారు. అలాగే, వరి సాగు చేయాల్సిన పరిస్థితుల్లో సంప్రదాయ నీటి ఆధారిత సాగుకు బదులుగా డ్రై ప్యాడీ (ఆరుతడి వరి) పద్ధతులను అనుసరించేలా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఉద్యానవన శాఖ ద్వారా పాలీహౌస్‌లు, గ్రీన్‌హౌస్‌ల ఏర్పాటు కోసం ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించడంతో పాటు, ఆధునిక వ్యవసాయ సాంకేతికతలను ప్రోత్సహించి ఉద్యాన పంటల సాగును విస్తరించే చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా గద్వాల జిల్లాలో వైద్య సేవలపై ఎమ్మెల్యే ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (++ం)తో పాటు పలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో (గుజిం) తగిన సంఖ్యలో వైద్యులు, వైద్య సిబ్బంది లేకపోవడంతో ఎక్కువ మంది రోగులను కర్నూలు జిల్లాకు రిఫర్ చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని పేర్కొన్నారు. ఈ సమస్యను అత్యవసరంగా పరిష్కరించి, అవసరమైన వైద్యులు, సిబ్బందిని నియమించి జిల్లాలో మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలని మంత్రి దామోదర రాజనర్సింహను కోరారు.

## బిజినెస్

### కీలక రంగాల్లోకి ఐరన్ ఓర్



**న్యూఢిల్లీ :** కీలక రంగాల సూచీకి ఐరన్ ఓర్ ఉత్పాదకతనూ కేంద్ర ప్రభుత్వం జత చేసింది. దీంతో దేశ ఆర్థిక వ్యవస్థ పనితీరును మరింత సమర్థవంతంగా అంచనా వేయవచ్చని శుక్రవారం తెలిపింది. ఇప్పటిదాకా నెలనెలా కీలక రంగాల సూచీ లెక్కింపునకు 8 ఇండస్ట్రీల (ముడి చమురు, చమురు శుద్ధి, సహజ వాయువు, విద్యుత్తు, ఎరువులు, ఉక్కు, బొగ్గు, సిమెంట్) పనితీరునే ప్రాతిపదికగా తీసుకొనేవారు. ఇకపై ఇనుప ఖనిజం ఉత్పత్తిని కూడా పరిగణనలోకి తీసుకుంటారని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ తెలిపింది. కొత్త సిరీస్ గణాంకాలు 2022-23 ఆధారంగా ఉంటాయి. 20న 9 కీలక రంగాల ఫలితాలు విడుదల కానున్నాయి.

### రెండు నెలల ఇంటర్న్‌షిప్‌కే రూ.67 లక్షలా?



దేశంలోని ప్రముఖ ఐఐటీల విద్యార్థులకు కేవలం రెండు నెలల ఇంటర్న్‌షిప్‌కే రూ.67 లక్షల సీటీసీ (+తీశీం ఱజ) ఆఫర్ చేస్తున్నట్లు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఓ నియామక ప్రకటన తీవ్ర చర్చకు దారితీసింది. అంశంపై విద్యార్థులు, టెక్ నిపుణులు పెద్దఎత్తున చర్చిస్తున్నారు. వైరల్ పోస్టు ప్రకారం.. హర్యానాలోని గురుగ్రామ్‌లో క్వాంటిటేటివ్ స్ట్రాటజిస్ట్ ఇంటర్న్ పోస్టులకు ప్రీ-ఫైనల్ ఇయర్ విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానించారు. ఇందులో నెలకు రూ.30 లక్షల స్టైపెండ్, రెండు నెలల ఇంటర్న్‌షిప్‌కు మొత్తం రూ.67 లక్షల గ్రాస్ సీటీసీ పేర్కొన్నట్లు కనిపిస్తోంది. బీఎస్-ఎంఎస్ (మ్యాథ్స్ అండ్ కంప్యూటింగ్), బీటెక్ (సీఎస్ఈ, ఈఈ, డీఎస్ఏఐ, ఈసీఈ తదితర విభాగాలు) చదువుతున్న, కనీసం 8.5 సీజీపీఏ ఉన్న విద్యార్థులు అర్హులని పోస్టులో పేర్కొన్నారు. అయితే వైరల్ స్క్రీన్‌షాట్‌లో సంస్థ పేరు స్పష్టంగా లేకపోయినా, పలువురు నెటిజన్లు ఇది గురుగ్రామ్‌కు చెందిన ప్రముఖ క్వాంటిటేటివ్ ట్రేడింగ్ సంస్థ 'క్వాడెయీ' (ఱబఖఙవవఎవ)కు సంబంధించినదై ఉండొచ్చని అభిప్రాయపడ్డారు. దీనికి కారణం, ఆ సంస్థ అధికారిక కెరీర్ పేజీలో ప్రస్తుతం ఇంటర్న్- క్వాంట్ స్ట్రాటజిస్ట్ పోస్టుకు నియామకాలు కొనసాగుతుండటమే. అయితే అక్కడ ఇంటర్న్‌షిప్ స్టైపెండ్ వివరాలు వెల్లడించలేదు. పూర్తి స్థాయి ఉద్యోగంగా ఎంపికైతే కనీసం రూ.93 లక్షల వార్షిక వేతనం (ఱజ) ఉంటుందని మాత్రమే పేర్కొంది. ఈ నేపథ్యంలో సోషల్ మీడియాలో విభిన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు ఇది అగ్రశ్రేణి హై-ఫ్రీక్వెన్సీ ట్రేడింగ్ (ఎఖీ), క్వాంట్ ట్రేడింగ్ సంస్థల్లో అసాధారణం కాదని చెబుతుండగా, మరికొందరు వైరల్ స్క్రీన్‌షాట్‌లోని గణాంకాలను స్వతంత్రంగా నిర్ధారించే ఆధారాలు లేవని పేర్కొంటున్నారు. ప్రస్తుతం రూ.67 లక్షల ఇంటర్న్‌షిప్ సీటీసీపై సంబంధిత సంస్థ నుంచి అధికారిక ప్రకటన వెలువడలేదు.

# సూచీలకు బ్లూచిప్స్ సంస్థల దన్ను..

## ఒక్కశాతానికి పైగా లాభపడిన మార్కెట్లు

**ముంబై :** దేశీయ స్టాక్ మార్కెట్లు కదంతొక్కాయి. బ్లూచిప్ సంస్థల షేర్లకు మదుపర్ల నుంచి లభించిన మద్దతుతో పాటు బ్యాంకింగ్, ఐటీ రంగ షేర్లు దౌడ్‌తీయడంతో ఇరు సూచీలు ఒక్క శాతానికి పైగా లాభపడ్డాయి. ఇంట్రాడేలో వెయ్యి పాయింట్లకు పైగా లాభపడిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు మార్కెట్ ముగిసే సమయానికి 964.58 పాయింట్లు లేదా 1.25 శాతం ఎగబాకి 78,151.45 వద్ద నిలిచింది. మరో సూచీ ఎన్ఎస్ఈ నిఫ్టీ సైతం 261.55 పాయింట్లు లేదా 1.09 శాతం బలపడి 24,334.30 వద్ద స్థిరపడింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి బలోపేతం కావడం, బ్యాంకింగ్, ఐటీ రంగ షేర్లలో కొనుగోళ్లు మదుపర్లలో ఉత్సాహాన్నినింపిందని జియోజిట్ ఇన్వెస్ట్‌మెంట్స్ లిమిటెడ్ రీసర్చ్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు. విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులతో పోలిస్తే దేశీయ మదుపర్లు భారీగా నిధులు కుమ్మరించడం సూచీల ర్యాలీకి కలిసొచ్చిందన్నారు. మొత్తంమీద ఈ వారంలో బీఎస్ఈ సెన్సెక్స్ 582.06 పాయింట్లు, నిఫ్టీ 127.4 పాయింట్లు బలపోతేం అయ్యాయి. నేటి సూచీల్లో టెక్ మహీంద్రా అత్యధికంగా 3.91 శాతం ఎగబాకగా, కొటక్ మహీంద్రా బ్యాంక్, టీసీఎస్, రిలయన్స్ ఇండస్ట్రీస్, యాక్సిస్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లు కూడా నష్టపోయాయి. బీఎస్ఈ స్మాల్‌క్యాప్ ఇండెక్స్, మిడ్‌క్యాప్ ఇండెక్స్‌లు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. రంగాలవారీగా



బ్యాంకెక్స్, ఐటీ, ఫోకస్డ్ ఐటీ, ఆర్థిక సేవల రంగ షేర్లు నష్టపోగా..కమోడిటీస్, ఇండస్ట్రియల్స్, టెలికాం, మెటల్ రంగ షేర్లు నష్టపోయాయి. ఇంధన ధరలు భారీగా తగ్గడం కూడా సూచీలకు కిక్కునిచ్చింది. కార్పొరేట్ల ఆశాజనక ఆర్థిక ఫలితాలు, ప్రైవేట్ రంగ బ్యాంకుల షేర్లు కూడా లాభాల్లో ముగియడం కూడా కలిసొచ్చింది.

# నిరాశపరిచిన రిలయన్స్..

**క్యూ1లో 22 శాతం తగ్గిన ప్రాఫిట్**

**రూ.20,946 కోట్లకు పరిమితం**

**న్యూఢిల్లీ :** చమురు నుంచి టెలికాం వరకు సేవలు అందిస్తున్న రిలయన్స్ ఇండస్ట్రీస్ నిరాశాజనక ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. జూన్‌తో ముగిసిన మూడు నెలల కాలానికిగాను సంస్థ రూ.20,946 కోట్ల కన్సాలిడేటెడ్ లాభాన్ని నమోదుచేసుకున్నది. కిందటేడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.26,994 కోట్ల లాభంతో పోలిస్తే 22 శాతం తగ్గుదల నమోదు చేసుకున్నది. ఏషియన్ పెయింట్స్‌లో షేర్లను విక్రయించడంతో ఒకేసారి భారీగా రూ.8,942 కోట్ల ఆదాయం సమకూరడంతో గతేడాది రికార్డు స్థాయి లాభాలను ఆర్జించిది సంస్థ. చమురు నుంచి కెమికల్స్, టెలికాం రంగాలు అంచనాలకుమించి రాణించడం వల్లనే ఈ మాత్రమైన లాభాలను నమోదు చేసుకున్నట్టు వెల్లడించింది. సమీక్షకాలంలో కంపెనీ కన్సాలిడేటెడ్ ఆదాయం 24.5 శాతం అధికమై రూ.3,40,257 కోట్లకు చేరుకున్నట్టు బీఎస్ఈకి సమాచారం అందించింది.



**జియో లాభం 7,764 కోట్లు**

దేశీయ టెలికాం దిగ్గజం రిలయన్స్ జియో అంచనాలకుమించి రాణించింది. జూన్ త్రైమాసికానికిగాను సంస్థ రూ.7,764 కోట్ల లాభాన్ని ఆర్జించింది. అంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో వచ్చిన రూ.7,110 కోట్ల లాభంతో పోలిస్తే 9.2 శాతం వృద్ధిని కనబరిచింది. మార్కెట్ వాటా పెరగడం, కస్టమర్ నుంచి వచ్చే ఆదాయం అధికమవడం వల్లనే లాభాల్లో భారీ వృద్ధి నమోదైందని కంపెనీ వర్గాలు వెల్లడించాయి. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం ఏడాది ప్రాతిపదికన 11.8 శాతం అందుకొని రూ.39,173 కోట్లకు చేరుకున్నది. సరాసరిగా ఒక్కో కస్టమర్ నుంచి వచ్చే ఆదాయం 3.3 శాతం అధికమై రూ.215.6కి చేరుకోవడం కంపెనీకి కలిసొచ్చిందని పేర్కొంది. ప్రస్తుతం సంస్థకు 53.3 కోట్ల మంది కస్టమర్లు ఉన్నారు. డిజిటల్ కామర్స్ విభాగంపై ప్రత్యేక దృష్టి సారించడంతో ఇతర రంగాలు నేలచూపులు చూస్తున్నదని, ముఖ్యంగా రిటైల్ రంగంలో వృద్ధి ఫ్లాట్‌గా ముగిసినట్టు పేర్కొంది.

గడిచిన త్రైమాసికంలో సంస్థ రూ.38, 682 కోట్ల పెట్టుబడులు పెట్టగా, రూ.41, 254 కోట్ల నగదు నిల్వలు ఉన్నాయి.

అలాగే జూన్ చివరినాటికి కంపెనీకి రూ.1,22,914 కోట్ల రుణాలు ఉన్నాయి.

రిలయన్స్ రిటైల్ విభాగం రూ.90,408 కోట్ల ఆదాయంపై రూ.2,806 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది.

# రెండో వన్డేలో భారత్‌పై గెలిచిన ఇంగ్లాండ్

కార్డిఫ్ వేదికగా భారత్?తో జరిగిన రెండో వన్డేలో ఇంగ్లాండ్ 4 వికెట్ల తేడాతో గెలిచింది. భారత్ నిర్దేశించిన 234 పరుగుల టార్గెట్?ను ఆతిథ్య ఇంగ్లాండ్ 44.1 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఇంగ్లాండ్ బ్యాటర్లలో జో రూట్ (99 పరుగులు నాటౌట్) రాణించాడు. టీమ్ఇండియా బౌలర్లలో గుర్నూర్ బ్రార్ 2, బుమ్రా, ప్రసిద్ధ్, దూబె, అక్షర్ తలో 1 వికెట్ దక్కించుకున్నారు. తాజా విజయంతో మూడు వన్డేల సిరీస్ 1-1తో సమం అయ్యింది. ఇరుజట్ల మధ్య మూడో వన్డే జులై 19న లార్డ్స్ వేదికగా జరగనుంది.

అంతకుముందు టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన భారత్ 44 ఓవర్లలోనే 233 పరుగులకు ఆలౌటైంది. శ్రేయస్ అయ్యర్ (66 పరుగులు), విరాట్ కోహ్లీ (65 పరుగులు) హాఫ్ సెంచరీలతో రాణించారు. కెప్టెన్ శుభ్?మన్ గిల్ (31 పరుగులు), రోహిత్ శర్మ (26 పరుగులు) చేశారు. చివర్లో జస్ప్రీత్ బుమ్రా (20 పరుగులు నాటౌట్ 3 ఫోర్లు, 1 సిక్స్?) మెరుపులు మెరిపించాడు. మిగతా బ్యాటర్లంతా సింగిల్ డిజిట్ స్కోరుకే పరిమితమయ్యారు. ఇషాన్ కిషన్ (1), వాషింగ్టన్ సుందర్ (2), అక్షర్ పటేల్ (1), శివమ్ దూబే (0), గుర్నూర్ బ్రార్ (7), ప్రసిద్ధ్ కృష్ణ (0) ఫెయిల్ అయ్యారు. ఇంగ్లాండ్ బౌలర్లలో జోఫ్రా ఆర్చర్, గస్ అట్కిన్సన్ చెరో 3, సాదిక్ మహ్మద్ 2, శామ్ కరన్, విల్ జాక్స్ తలో 1 వికెట్ పడగొట్టారు.

### 233 పరుగులకే ఆలౌటైన టీమ్ఇండియా

ఇంగ్లాండ్‌తో జరుగుతున్న మూడు వన్డేల సిరీస్ తొలి మ్యాచ్‌లో ఇండియా గెలుపొందగా, రెండో వన్డేలో మాత్రం అనూహ్యంగా పరాజయం పాలైంది. ఇండియా కాలమానం ప్రకారం గురువారం అర్ధరాత్రి అనంతరం ముగిసిన మ్యాచ్‌లో టీమ్ ఇండియా 4 వికెట్ల తేడాతో ఓడి అభిమానులను షాక్?కు గురి చేసింది. టాస్ ఓడి బ్యాటింగ్ చేసిన టీమ్ఇండియా ఇన్నింగ్స్‌ను చక్కగా ఆరంభించి, ఒక దశలో అలవోకగా 300 స్కోరు చేసే స్టేజ్?లో కనిపించింది. 30 ఓవర్ల వరకు పూర్తి ఆధిపత్యం సాధించిన భారత్ జట్టు ఆ తర్వాత మాత్రం తన దూకుడును కొనసాగించలేకపోయింది. ఫామ్‌లేక నానా తంటాలు పడుతున్న రోహిత్ (26; 47 బంతుల్లో 1ఐ4, 1ఐ6) అవతలి ఎండ్‌లో అంత సౌకర్యంగా కనిపించలేదు. కెప్టెన్ శుభ్‌మన్ (31; 30 బంతుల్లో 6ఐ4) మాత్రం ఫర్వాలేదనిపించాడు. కానీ జోరుమీదున్న గిల్‌ను అట్కిన్సన్ ఔట్ చేశాడు. ఇలాంటి పరిస్థితుల్లో మూడో స్థానంలో వచ్చిన కోహ్లి నిలకడైన ఆట తీరుతో జట్టును మెరుగైన స్థితిలో నిలిచేలా చేశాడు.

విరాట్ కోహ్లీ మంచి డ్రైవ్ షాట్లు ఆడుతూ బౌండరీలు



కొడుతూ స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. రోహిత్ అట్కిన్సన్ బౌలింగ్‌లో ఒక సిక్సర్ కొట్టినప్పటికీ, ఆ తర్వాత అతని జోరు తగ్గింది. అంతేకాకుండా స్పిన్నర్ జాక్స్ బౌలింగ్‌లో రోహిత్ స్వీప్ చేయబోయి చివరకు వికెట్ కీపర్‌కు దొరికిపోవడంతో మొత్తం 104 పరుగుల వద్ద టీమ్?ఇండియా తన రెండో వికెట్?ను కోల్పోవాల్సి వచ్చింది. కాసేపటికే ఇషాన్ (1) కూడా ఔటైపోయినా సరే కోహ్లీకి శ్రేయస్ జతకలవడంతో భారత్‌కు ఇబ్బంది లేకపోయింది. ఇద్దరూ నిలకడగా ఆడుతూ జట్టును స్ట్రాంగ్? చేశారు. కోహ్లి సరిగ్గా 50 బంతుల్లో హాఫ్ సెంచరీ చేశాడు. శ్రేయస్ సైతం అర్ధసెంచరీకి దగ్గర్లోకి రాగా, 31 ఓవర్లకు భారత్ 177/3తో 300 స్కోరును టార్గెట్ చేసింది. అయితే ఆ తర్వాత ఓవర్లో ఆర్చర్ కోహ్లిని ఔట్ చేయడంతో ఆట సరికొత్త మలుపు తిరిగింది. ఇక ఆ తర్వాత వికెట్లు ఒక్కొక్కటి పడుతూ వచ్చాయి. దాంతో 6 ఓవర్లు ఉండగానే ఈ ఇన్నింగ్స్‌కు తెరపడింది. మొదటగా జోఫ్రా ఆర్చర్ (3/47), గస్ అట్కిన్సన్ (3/50), సకిబ్ మహమూద్ (3/52)ల ధాటికి భారత్ 44 ఓవర్లలో 233 పరుగులకే టీమ్ మొత్తం ఆలౌటైంది.

### ఇంగ్లాండ్‌ను గెలిపించిన జోరూట్

స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన ఇంగ్లాండ్ మొదట్లోనే పీకల్లోతు కష్టాల్లో పడింది. ఓపెనర్లు బెన్ డకెట్ (0), జాకబ్ బెతెల్ (4) ఆరంభంలోనే ఔటైపోవడం, కెప్టెన్ బ్రూక్ (16) కూడా ఎక్కువసేపు నిలవకపోవడంతో ఇంగ్లాండ్ 53/3తో కష్టాల్లో పడింది. అయితే తొలి వన్డేలో మాదిరిగానే జో రూట్ ఆత్మవిశ్వాసంతో నిలవడంతో ఇంగ్లాండ్ విన్నింగ్?కు దారులు తెరుచుకున్నాయి. జో రూట్ (99 నాటౌట్; 133 బంతుల్లో 9ఐ4) సూపర్ ఇన్నింగ్స్ ఆడాడు. సామ్ కరన్ (26), జోస్ బట్లర్ (17), విల్ జాక్స్ (30), గస్ అట్కిన్సన్ (23 నాటౌట్)ల సహకారంతో రూట్ తన జట్టును గెలిపించాడు. బుమ్రా (1/45), అక్షర్ పటేల్ (1/35), గుర్నూర్ బ్రార్ (2/67), ప్రసిద్ధ్ కృష్ణ (1/52) కట్టుదిట్టమైన బౌలింగ్‌తో ఇంగ్లాండ్‌పై ఒత్తిడి తెచ్చినప్పటికీ రూట్ గొప్ప పట్టుదలతో ఆటను నడిపించాడు. దీనితో 234 పరుగుల లక్ష్యాన్ని 44.1 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి ఇంగ్లాండ్? ఛేదించింది.

## స్పోర్ట్స్

### సెమీస్‌కు సింధు



టోక్యో: జపాన్ ఓపెన్‌లో తెలుగమ్మాయి పీవీ సింధు సెమీస్‌కు ప్రవేశించింది. మహిళల సింగిల్స్ క్వార్టర్స్ పోరులో భాగంగా శుక్రవారం నొజొమి ఒకుహరతో సింధు తలపడాల్సింది. కానీ, కాలి గాయం కారణంగా జపాన్ ప్లేయర్ వాకోవర్ ఇవ్వడంతో సింధు సెమీస్‌కు అర్హత సాధించింది. కాగా జపాన్ ఓపెన్‌లో సింధుకు ఇదే తొలి సెమీస్. 2023 డెన్మార్క్ ఓపెన్ 750లో లాస్ట్-4కు చేరుకున్న తర్వాత బీడబ్ల్యూఎఫ్ 750 ఈవెంట్‌లో సెమీఫైనల్స్‌కు వెళ్లడం మూడేండ్ల తర్వాత ఆమెకు ఇది మొదటిసారి. సెమీస్‌లో ఆమె.. చైనాకు చెందిన ప్రపంచ నాలుగో ర్యాంకర్ చెన్ యూఫీతో తలపడనుంది. ఈ ఇద్దరి మధ్య ముఖాముఖి పోరుల్లో చైనా షట్లర్ 8-6తో ముందంజలో ఉండటం గమనార్హం.

### 'ఎక్కడికీ పోయేది లేదు'

### రోహిత్ రిటైర్మెంట్ ప్రచారంపై బీసీసీఐ క్లారిటీ




రోహిత్ శర్మ ఫ్యాన్స్‌కు గుడ్ న్యూస్. ఇంగ్లాండ్ పర్యటనలో ఉన్న హిట్‌మ్యాన్‌కు జులై 19న లార్డ్స్ వేదికగా జరగనున్న వన్డే మ్యాచ్ చివరిది అని జరుగుతున్న ప్రచారంపై స్పష్టత వచ్చింది. ఇవన్నీ ఊహాగానాలే అని బీసీసీఐ కొట్టిపారేసింది. రోహిత్ వన్డే భవిష్యత్ విషయంలో బోర్డు పరిధిలో ఎలాంటి చర్చలు జరగలేదని బీసీసీఐ పేర్కొంది. ఈ మేరకు బోర్డు సెక్రటరీ దేవజిత్ సైకియా వెల్లడించారు. ఆదివారం లార్డ్స్ వేదికగా ఇంగ్లాండ్‌తో జరగనున్న మూడో మ్యాచ్ రోహిత్?కు క్యాజువల్ మ్యాచ్?లాంటిదే అని, అందులో ఎలాంటి ప్రత్యేకత లేదని చెప్పారు. ఈ వన్డే తర్వాత కూడా రోహిత్ టీమ్ఇండియా తరఫున ప్రాతినిధ్యం వహిస్తాడని స్పష్టం చేశారు. "రోహిత్ శర్మ భవిష్యత్తు గురించి మీడియాలో అనేక ఊహాగానాలు వస్తున్నాయి. ఆదివారం లార్డ్స్‌లో జరిగే మ్యాచ్ రోహిత్‌కు చివరిది అవుతుందనే విషయంపై ఎటువంటి చర్చ జరగలేదు. దీని గురించి నేను స్పష్టంగా చెప్పదలుచుకున్నాను. భారత వన్డే జట్టులో రోహిత్ ఇప్పటికీ కీలక ఆటగాడు. జట్టు ప్రణాళికల్లో భాగమైనంత కాలం అతడు టీమ్ఇండియాకు ప్రాతినిధ్యం వహిస్తూనే ఉంటాడు. క్లుప్తంగా చెప్పాలంటే, హిట్?మ్యాన్?కు లార్డ్స్ వన్డే చివరి మ్యాచ్ కాదు" అని బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా పీటీఐతో జరిగిన ప్రత్యేక ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. దీంతో రోహిత్ ఫ్యాన్స్ ఫుల్ ఖుషీ అవుతున్నారు.



# ఈసారి కథ మారింది!

అగ్ర హీరో రామ్‌చరణ్ ‘పెద్ది’ చిత్రం బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని నమోదు చేసుకుంది. దాదాపు గత ఏడాదిగా ఈ సినిమాపైనే దృష్టి పెట్టారు రామ్‌చరణ్. ‘పెద్ది’ హంగామా ముగియడంతో సుకుమార్ దర్శకత్వంలో రామ్‌చరణ్ చేయబోయే తదుపరి సినిమా అప్‌డేట్స్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. వీరిద్దరి కాంబినేషన్‌లో ‘రంగస్థలం’ వంటి బ్లాక్‌బస్టర్ హిట్ రావడంతో తాజా ప్రాజెక్ట్‌పై ఇప్పటికే అంచనాలు పెరిగిపోయాయి. ఈ నేపథ్యంలో ఈ సినిమా లాంచింగ్ డేట్, ఇది ఏ జోనర్ కథాంశమనే విషయాలపై సోషల్‌మీడియాలో జోరుగా చర్చలు జరుగుతున్నాయి. విశ్వసనీయ సమాచారం ప్రకారం సెప్టెంబర్‌లో పూజా కార్యక్రమాలతో ఈ సినిమాను లాంఛనంగా ప్రారంభించి, నవంబర్ నుంచి రెగ్యులర్ షూటింగ్ మొదలుపెడతారని తెలిసింది. ఇప్పటికే ఈ సినిమా స్క్రిప్ట్‌ను దర్శకుడు సుకుమార్ లాక్ చేశారని సమాచారం. అందరూ అనుకుంటున్నట్లుగా ఇది‘రంగస్థలం’ తరహా రూరల్ డ్రామా కాదని, రామ్‌చరణ్ కోసం దర్శకుడు సుకుమార్ ఈసారి సరికొత్త కథను సిద్ధం చేశారని, నగర నేపథ్యంలో స్టైలిష్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని తీర్చిదిద్దబోతున్నారని ఇన్‌సైడ్ టాక్. ఈ ప్రతిష్టాత్మక చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సంయుక్తంగా తెరకెక్కించబోతున్నాయి. ‘ఆర్‌సీ 17’ వర్కింగ్ టైటిల్‌తో ఈ సినిమా రూపొందనుంది.



# ప్రశాంత్‌వర్మ దర్శకత్వంలో?


‘కేజీఎఫ్’తో రాత్రికి రాత్రి పాన్ ఇండియా స్టార్‌గా అవతరించారు కన్నడ స్టార్ హీరో యశ్. ‘హను–మాన్’ విజయంతో యావత్ భారతీయ సినిమా దృష్టినే ఆకర్షించారు దర్శకుడు ప్రశాంత్‌వర్మ. ప్రస్తుతం ‘టాక్సిక్’, ‘రామాయణ’ చిత్రాలతో యశ్ బిజీగా ఉంటే, రిషబ్‌శెట్టితో పాన్ ఇనిండియా స్థాయిలో ‘జై హనుమాన్’ని తెరకెక్కిస్తూ ఆడియన్స్‌లో ఆసక్తిని పెంచుతున్నారు ప్రశాంత్‌వర్మ. తాజాగా వీరిద్దరి కాంబినేషన్‌లో సినిమా అంటూ ఇండస్ట్రీ వర్గాల్లో చర్చ నడుస్తున్నది. ఇటీవలే తన తదుపరి ప్రాజెక్ట్ కోసం యశ్‌ని సంప్రదించారట ప్రశాంత్‌వర్మ. ఈ వార్త నిజమే అయితే.. ఆ సినిమా సౌతిండియన్ సినిమాను మరోస్థాయికి తీసుకెళ్లడం ఖాయమని సినీపండితులు అభిప్రాయపడుతున్నారు. ప్రశాంత్‌వర్మ సినిమాలంటే ఫాంటసీ, మైథలాజికల్ అంశాల మేళవింపుగా ఉంటాయి. మరి యశ్ కోసం ఆయన ఏ తరహా కథను తయారు చేశారో చూడాలి. ప్రస్తుతం వీరిద్దరి మధ్య కథాచర్చలు ప్రాథమిక దశలో ఉన్నాయట.

# రాకా కోసం దీపిక సాహసం?



ప్రెగ్నెన్సీలో కూడా సెట్స్‌కి వచ్చి నటించిన నటీమణులు భారతీయ చలనచిత్ర చరిత్రలో చాలామందే ఉన్నారు. కానీ ప్రెగ్నెన్సీతో ఉండి యాక్షన్ సన్నివేశాల్లో నటించిన హీరోయిన్లు మాత్రం దాదాపుగా లేరనే చెప్పాలి. కానీ దీపిక పదుకోన్ ఆ ఫీట్ చేసి హిస్టరీ క్రియేట్ చేశారు. అల్లు అర్జున్ నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం ‘రాకా’లో ఆమె కథానాయికగా నటిస్తున్న విషయం తెలిసిందే. ఇటీవలే దీపికా పదుకోన్‌పై కీలకమైన యాక్షన్ సన్నివేశాలను దర్శకుడు అట్లీ చిత్రీకరించారట. రెండో బిడ్డకు జన్మనివ్వబోతున్న దీపిక.. ప్రెగ్నెనీతోనే కఠినమైన యాక్షన్ సన్నివేశాల్లో పాల్గొన్నారని సమాచారం. అంతేకాదు, తన ‘ఎనిమిది గంటల పని’ నిబంధనను కూడా ఈ సినిమా విషయంలో ఆమె పక్కన పెట్టారని తెలిసింది. మెటర్నిటీ బ్రేక్ తీసుకునే ముందు, ‘రాకా’లో తన పార్ట్ షూటింగ్ మొత్తాన్ని పూర్తి చేయాలని ఆమె నిర్ణయించారట. అటు షూట్‌లో పాల్గొంటూనే ఇటు తన మొదటి కూతురు దువాను కూడా చూసుకుంటూ, లొకేషన్‌లో నటిగా, తల్లిగా రెండు బాధ్యతలనూ నిర్వర్తిస్తూ అందరి దృష్టినీ దీపిక ఆకర్షించారట. దీపిక తన జీవితాన్ని బ్యాలెన్స్ చేసుకునే తీరును చూసి నెటిజన్లు ప్రశంసల వర్షం కురిస్తున్నారు.





# రాజు.. జాకీ.. రాణి

1990ల కాలంలో సాగే పీరియడ్ క్రైమ్ డ్రామా ‘కేజేక్యూ’. ‘ఖఱఅస్త్ర జీఘఎఎఱవ ఌబవవఱ’ అనేది ఉపశీర్షిక. దసరా, ది గర్ల్‌ఫ్రెండ్ చిత్రాలతో తెలుగునాట గుర్తింపు తెచ్చుకున్న దీక్షిత్‌శెట్టి హీరోగా, శశి ఓదెల హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రానికి స్వర్గీయ కె.కె దర్శకుడు. ఎస్ఎల్‌వీ సినిమాస్ పతాకంపై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న ఈ చిత్రం ఆగస్ట్ 7న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్నది. ఈ చిత్ర దర్శకుడు కేకే గత ఏడాది కన్ను మూశారు. ఆయనకు సినిమాపై ఉన్న పాషన్, విజన్‌కి నివాళిగా ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తెస్తున్నట్టు మేకర్స్ తెలిపారు. ఇప్పటికే ప్రచార చిత్రాల వల్ల సినిమాపై అంచనాలు పెరిగాయని, సినిమా తప్పకుండా ప్రేక్షకులకు ఓకొత్త అనుభూతినిస్తుందని మేకర్స్ నమ్మకం వెలిబుచ్చారు. యుక్తి తరేజా కీలకపాత్ర పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: నగేష్ బానెస్, సంగీతం: పూర్ణచంద్ర తేజస్వి.

వార్తాతరంగాలు



# పార్లమెంట్ సమావేశాలకు సర్వం సిద్ధం

పార్లమెంటు వర్షాకాల సమావేశాలు సోమవారం నుంచి జరగనున్నాయి. ఆగస్టు 13 వరకు కొనసాగనున్న ఈ సమావేశాల్లో ప్రవేశపెట్టేందుకు కేంద్రం 8 బిల్లులను సిద్ధం చేసింది. ముఖ్యంగా సోమవారమే పార్లమెంట్ ముందుకు రెండు కీలక బిల్లులు రానున్నాయి. సుప్రీంకోర్టు న్యాయ మూర్తుల సంఖ్య 33 నుంచి 37 కు పెంచుతూ రూపొం దించిన బిల్లును లోక్సభలో ప్రవేశపెట్టనుంది. వందేమాతరం గేయానికి జాతీయగీతం హోదా కల్పిస్తూ రూపొందించిన బిల్లును కేంద్ర హోంమంత్రి అమిత్ షా రాజ్యసభలో ప్రవేశపెట్టనున్నారు. ఈ క్రమంలోనే సమావేశాలు సజావుగా సాగేందుకు అన్ని పార్టీలు సహకరించాలని కేంద్రం కోరింది. మరోవైపు అయోధ్య రామమందిరం విరాళాల దుర్వినియోగం, నీట్ పేపర్ లీకేజీ సహా పలు కీలక అంశాలపై ప్రభుత్వాన్ని నిలదీస్తామని విపక్షాలు ప్రకటించాయి. ఈ మేరకు కేంద్రం నిర్వహించిన అఖిలపక్ష భేటీలో తమ వైఖరిని స్పష్టం చేశాయి. దీంతో పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు వాడీవేడీగా సాగనున్నాయి.



**రాజ్?నాథ్ అధ్యక్షతన అఖిల పక్ష సమావేశం**

అన్ని పార్టీల ఫ్లోర్ లీడర్లతో రక్షణ మంత్రి రాజ్ నాథ్ అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా సహా 40 రాజకీయ పార్టీలకు చెందిన 58 మంది నాయకులు హాజరయ్యారు. ఈ భేటీలో అయోధ్య రామమందిరం విరాళాల దుర్వినియోగం, నీట్ పేపర్ లీక్, పెట్రోల్లో ఈ20 ఇంధన మిశ్రమం వంటి అంశాలపై పార్లమెంట్లో చర్చ జరపాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. మణిపూర్లో పరిస్థితులపైనా చర్చించాలని కోరినట్లు కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగోయ్ తెలిపారు. సోనమ్ వాంగ్చుక్ చేస్తోన్న నిరసనపై కూడా చర్చ జరగాలని సమాజ్వాదీ పార్టీ డిమాండ్ చేసింది. మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రస్తుతమున్న 543 లోక్సభ స్థానాల బలంతోనే అమలు చేయాలని డీఎంకే కోరింది. అటు పార్లమెంట్ ఎంత బాగా పనిచేస్తే దేశానికి అంత ఎక్కువ ప్రయోజనం చేకూరుతుందని అఖిలపక్ష భేటీలో పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు పేర్కొన్నారు. ఉభయ సభల్లో విపక్షాల అభిప్రాయాలను వింటామని స్పష్టం చేశారు. విపక్షాలు కూడా తమ వాదనలను వింటారని ఆశిస్తున్నామని కిరణ్ రిజిజు ఆశాభావం వ్యక్తం చేశారు. సానుకూల చర్చల తర్వాత ప్రభుత్వం తీసుకొచ్చే బిల్లులకు అన్ని పార్టీలు మద్దతు ఇవ్వాలని కోరారు. ప్రస్తుతం ఎనిమిది బిల్లుల జాబితా మాత్రమే ఉందని తెలిపారు. అదనంగా మరే బిల్లును ప్రవేశపెట్టాల్సి వచ్చినా ముందుగా బిజినెస్ అడ్వైజరీ కమిటీ (బీఏసీ)లో చర్చించి, ప్రతిపక్షాలకు సమాచారం ఇచ్చిన తర్వాతే ముందుకు వెళ్తామని స్పష్టం చేశారు. జీరో అవర్, ప్రత్యేక ప్రస్తావనలు వంటి అంశాలు సాధారణ పార్లమెంటరీ ప్రక్రియలో భాగమేనని, ప్రతి సభ్యుడికి వాటిపై మాట్లాడే హక్కు ఉంటుందని చెప్పారు.

**వాడీవేడీగా అఖిలపక్ష సమావేశం**

అయితే ఈ అఖిలపక్ష భేటీ వాడీవేడిగా సాగింది. సమావేశం ప్రారంభమైన కొద్దిసేపటికే కాంగ్రెస్, టీఎంసీ, సమాజ్వాదీ పార్టీ, డీఎంకే, జేఎంఎం, నేషనల్ కాన్ఫరెన్స్, శివసేన (యూబీటీ), ఆమ్ఆద్మీ, వామపక్ష పార్టీలు వాకౌట్ చేశాయి. 20 మంది తిరుగుబాటు ఎంపీలకు ఆహ్వానం పంపడంపై టీఎంసీ నిరసన తెలిపింది. తిరుగుబాటు ఎంపీల విలీనానికి స్పీకర్ ఆమోదం తెలపలేదని టీఎంసీ ఎంపీ మహువా మొయిత్రా పేర్కొన్నారు. టేబుల్ ఆఫీస్ జాబితాలో టీఎంసీ బలం 28గా ఉందన్నారు. 91వ సవరణ తర్వాత ప్రత్యేక కూటమికి ఆస్కారం లేదని వివరించారు. రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకే వాకౌట్ చేశామని కాంగ్రెస్ ఎంపీ ప్రమోద్ తివారీ తెలిపారు. తుది నిర్ణయం తీసుకోకుండా టీఎంసీ సంఖ్యాబలం అంచనా వేయడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. కాసేపటికి విపక్ష ఎంపీలు మళ్లీ సమావేశానికి తిరిగొచ్చారు.

## అఖిలపక్ష సమావేశాన్ని బహిష్కరించిన విపక్షాలు

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలకు ముందు నిర్వహించే అఖిలపక్ష సమావేశం వివాదంలో చిక్కుకుంది. తృణమూల్ కాంగ్రెస్కు చెందిన రెబల్ ఎంపీలు ఏర్పాటు చేసిన నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియా (ఎన్సీపీఐ)కి ఆహ్వానం పంపడాన్ని నిరసిస్తూ ప్రతిపక్ష పార్టీలు సమావేశాన్ని బహిష్కరించాయి. గుర్తింపులేని పార్టీని అఖిలపక్ష సమావేశానికి ఎలా పిలిచారని ప్రశ్నించాయి. తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ సౌగత రాయ్ ఈ నిర్ణయంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. స్పీకర్ అధికారిక గుర్తింపు లేని పార్టీకి సమావేశంలో చోటు కల్పించడం సరికాదన్నారు. పార్లమెంట్ అధికారిక వెబ్సైట్లో ఇప్పటికీ ఆ పార్టీ ఎంపీలు తృణమూల్ సభ్యులుగానే నమోదై ఉన్నారని గుర్తు చేశారు. అలాంటి పరిస్థితుల్లో వారికి ప్రత్యేక పార్టీ హోదాతో ఆహ్వానం పంపడం అర్థం కావడం లేదని వ్యాఖ్యానించారు. తృణమూల్కు చెందిన సుమారు 20 మంది రెబల్ ఎంపీలు ఇటీవల నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియాలో చేరారు. అయితే ఆ పార్టీకి ఇంకా అధికారిక గుర్తింపు లభించలేదు. ఈ అంశమే ఇప్పుడు అఖిలపక్ష సమావేశం చుట్టూ రాజకీయ చర్చకు దారి తీసింది. మరోవైపు ఎన్సీపీఐ పార్లమెంటరీ పక్ష నేత కాకోలి ఘోష్ దస్తిదార్ స్పందించారు. తమ పార్టీకి అఖిలపక్ష సమావేశంలో పాల్గొనే అవకాశం కల్పించినందుకు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. పార్లమెంట్లో తమ అభిప్రాయాలు వినిపించే అవకాశంగా దీన్ని భావిస్తున్నట్లు పేర్కొన్నారు.

## చారిత్రక పర్యటనకు రాష్ట్రపతి..

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము వారం రోజుల విదేశీ పర్యటనకు ఆదివారం బయల్దేరారు. తూర్పు ఐరోపాలోని మాల్డోవా, నార్త్ మాసిడోనియా, రొమేనియా దేశాల్లో ఆమె పర్యటించనున్నారు. భారత రాష్ట్రపతి మాల్డోవా, నార్త్ మాసిడోనియాలకు వెళ్లడం ఇదే తొలిసారి కావడం ఈ పర్యటనకు చారిత్రక ప్రాధాన్యాన్ని ఇచ్చింది. అలాగే, మూడు దశాబ్దాల తర్వాత భారత రాష్ట్రపతి రొమేనియాలో పర్యటించనున్నారు. జులై 19 నుంచి 25 వరకు సాగే ఈ పర్యటనలో భాగంగా మూడు దేశాలతో ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసుకోవడంపై దృష్టి సారిస్తారు. వాణిజ్యం, పెట్టుబడులు, టెక్నాలజీ, వ్యవసాయం, విద్య, వైద్య ఆరోగ్య రంగాల్లో సహకారాన్ని పెంచుకోవడమే లక్ష్యంగా చర్చలు జరుపుతారు. పర్యటన తొలి అంకంలో మాల్డోవా అధ్యక్షురాలు మైయా సాండు ఆహ్వానం మేరకు ఆ దేశంలో పర్యటిస్తారు. అనంతరం నార్త్ మాసిడోనియాకు వెళతారు. ఈ రెండు దేశాల్లోని అధ్యక్షులు, పార్లమెంట్ స్పీకర్లతో రాష్ట్రపతి ముర్ము సమావేశమవుతారు. అక్కడి వ్యాపార ఫోరమ్లలో ప్రసంగించడంతో పాటు ప్రవాస భారతీయులతోనూ భేటీ అవుతారు. పర్యటన చివరి అంకంలో భాగంగా జులై 23 నుంచి 25 వరకు రొమేనియాలో పర్యటిస్తారు. ఈ పర్యటనతో ఆయా దేశాలతో భారత సంబంధాలకు కొత్త ఊపు వస్తుందని విదేశాంగ శాఖ ఆశాభావం వ్యక్తం చేసింది. పెట్టుబడి అవకాశాలను పరిశీలించేందుకు రాష్ట్రపతి వెంట ఉన్నతస్థాయి వ్యాపార ప్రతినిధి బృందం కూడా ఈ పర్యటనలో పాల్గొంటోంది.

# బూతులు, తిట్లు, అసభ్య పదజాలం వాడడం 'అశ్లీలత' కాదు

బూతు మాటలు, దూషణలు, అసభ్య పదజాలం ఉపయోగించినంత మాత్రాన, అవి ఎంత అభ్యంతరకరంగా లేదా సభ్యత లేనివిగా ఉన్నప్పటికీ 'అశ్లీలత' నేరం కిందకు రావని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. భారత శిక్షా స్మృతి (ఐపీసీ)లోని సెక్షన్? 294 కింద ట్రయర్? కోర్టు తనకు విధించిన శిక్షను హైకోర్టు సమర్థించడాన్ని సవాల్? చేస్తూ ఓ వ్యక్తి సుప్రీం కోర్టును ఆశ్రయించాడు. దీనిపై విచారణ చేపట్టిన జస్టిస్? సంజయ్? కరోల్?, జస్టిస్? విపుల్ ఎం.పంచోలీలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం, "కేవలం తిట్టడం లేదా అసభ్య పదజాలం వాడడం మాత్రమే ఐపీసీ సెక్షన్ 294 కింద అశ్లీలత నేరంగా మారదు" అని పేర్కొంది. "ఒక మాటను అశ్లీలమైనదిగా పరిగణించాలంటే, అది కామ ప్రకోపాన్ని కలిగించేదిగా, కామవాంఛలను రేకెత్తించేదిగా ఉండాలి. దానిని వినే లేదా చూసే వారి మనస్సులను భ్రష్టు పట్టించేలా, చెడగొట్టేలా ఉండాలి. ఈ ప్రమాణాల ప్రకారం పరిశీలిస్తే, ఫిర్యాదులో పేర్కొన్న ఆరోపణలన్నీ నిజమేనని పూర్తిగా అంగీకరించినప్పటికీ, ఆ మాటలను అశ్లీలమైనవిగా పరిగణించలేము. ఇలాంటి మాటలు ఎంత దూషణతో కూడినవి, వినడానికి వీలులేనివి లేదా సభ్యత లేనివి అయినప్పటికీ, ఇవి ఐపీసీ సెక్షన్? 294 (బి) పరిధిలోకి రావు" అని సుప్రీంకోర్టు పేర్కొంది. "ఈ బూతు మాటలు, అసభ్య పదజాలం వాడకం వల్ల బహిరంగ ప్రదేశంలో ఇతరులకు, ముఖ్యంగా ఫిర్యాదుదారునికి తీవ్ర అసౌకర్యం లేదా ఇబ్బంది కలిగిందని ఎక్కడా రుజువు కాలేదు. ఈ సెక్షన్కు ఇది అత్యంత కీలకమైన నిబంధన. ఇది లేనప్పుడు, ఐపీసీ సెక్షన్ 294 (బి) కింద నేరం జరిగినట్లు పరిగణించలేము" అని ధర్మాసనం స్పష్టం చేసింది.



**కేసు నేపథ్యం**

తమిళనాడులో 2017 ఆగస్టులో ఒక వ్యవసాయ భూమి గురించి వివాదం చెలరేగింది. ఆ సమయంలో పిటిషినర్?కు, అతడి బావమరిదికి మధ్య వాగ్వాదం జరిగింది. రెండు రోజుల తర్వాత, అదే భూమి విషయమై మేనల్లుడితో పిటిషనర్ మళ్లీ గొడవ పడ్డాడు. దీనితో ఆయన బావమరిది జోక్యం చేసుకున్నాడు. కోపంతో పిటిషినర్? తన బావమరిదిని అసభ్య పదజాలంతో, కులం పేరుతో దూషించాడు. దీనితో ట్రయల్ కోర్టు ఐపీసీ సెక్షన్? 294 (బి) అశ్లీలత, సెక్షన్ 326 (తీవ్రంగా గాయపరచడం), 506 (ఐఐ) (క్రిమినల్ బెదిరింపు)తో పాటు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ నిరోధక చట్టం కింద దోషిగా తేల్చింది. దీనితో పిటిషనర్? మద్రాస్? హైకోర్టును ఆశ్రయించారు. మద్రాస్? హైకోర్టు ఎస్సీ, ఎస్టీ చట్టం కింద ఆరోపణల నుంచి పిటిషినర్?ను నిర్దోషిగా విడుదల చేసింది. కానీ ఐపీసీ సెక్షన్ల కింద విధించిన శిక్షలను మాత్రం సమర్థించింది. ఈ నేపథ్యంలోనే సదరు పిటిషనర్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

**పోక్సో దుర్వినియోగం**

మరో కేసు విచారణ సందర్భంగా, పరస్పరం ప్రేమించుకున్న అమ్మాయి, అబ్బాయి కలిసి వెళ్లిపోకుండా రాష్ట్రం ఎలా అడ్డుకోగలదని సుప్రీం కోర్టు ప్రశ్నించింది. యుక్త వయసులో పరస్పర సమ్మతితో ఏర్పడే ప్రేమ సంబంధాలపై పోక్సో (ఛాజూూ) చట్టం నిబంధనల్ని దుర్వినియోగం చేస్తున్న ఘటనలు పెరిగిపోతున్నాయని సర్వోన్నత న్యాయస్థానం ఆందోళన వ్యక్తం చేసింది. పిల్లలపై లైంగిక దాడులు, లైంగిక దోపిడీని అరికట్టేందుకు తీసుకొచ్చిన చట్టాన్ని ప్రతి ప్రేమ వ్యవహారానికి వర్తింపజేయడం సరైనదేనా? అని ప్రశ్నించింది. న్యాయమూర్తులు జస్టిస్ బి.వి. నాగరత్న, జస్టిస్ ఆర్. మహదేవన్లతో కూడిన ధర్మాసనం, యుక్తవయస్కుల గోప్యత హక్కులకు సంబంధించిన కేసును సుమోటోగా విచారణ చేస్తూ ఈ కీలక వ్యాఖ్యలు చేసింది. 15 నుంచి 18 ఏళ్ల మధ్య వయసు అత్యంత సున్నితమైన దశ అని, ఈ వయసులో యువతలో సహజంగానే ఆకర్షణలు, భావోద్వేగాలు, ప్రేమ సంబంధాలు ఏర్పడుతుంటాయని కోర్టు వ్యాఖ్యానించింది.

## ఇకపై రామ్, రహీమ్, రాబిన్లకు సమాన హక్కులు




ఉమ్మడి పౌర స్మృతి (యూసీసీ)తో ఇకపై రామ్, రహీమ్, రాబిన్లకు సమాన హక్కులు లభిస్తాయని మధ్యప్రదేశ్ సీఎం మోహన్ యాదవ్ వ్యాఖ్యానించారు. మధ్యప్రదేశ్ కేబినెట్ ఆదివారం యూసీసీ ముసాయిదా బిల్లుకు ఆమోదం తెలిపిన నేపథ్యంలో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. సోమవారం నుంచి ప్రారంభం కానున్న రాష్ట్ర శాసనసభ వర్షాకాల సమావేశాల్లో ఈ బిల్లును ప్రవేశపెట్టనున్నామని తెలిపారు. మధ్యప్రదేశ్ కేబినెట్ ఉమ్మడి పౌర స్మృతి బిల్లు, 2026కు ఏకగ్రీవంగా, హృదయపూర్వకంగా ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా నా కేబినెట్ సహచరులకు, మీ అందరికీ నా అభినందనలు తెలియజేస్తున్నాను. రాజ్యాంగబద్ధమైన సమానత్వానికి మా ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఈ బిల్లు చారిత్రక భారతీయ సంస్కృతికి, విలువలకు కట్టుబడి ఉంది. జులై 20 నుంచి ప్రారంభం కానున్న శాసనసభ సమావేశాల్లో ఈ యూసీసీ బిల్లును ప్రవేశపెడతాం."

**ప్రజల మద్దతుతోనే!**

ఉమ్మడి పౌర స్మృతికి ప్రజల నుంచి భారీ మద్దతు లభిస్తోందని, రాష్ట్ర జనాభాలో 93 శాతం కంటే ఎక్కువ మంది ఈ చట్టానికి మద్దతు ఇస్తున్నారని సీఎం మోహన్ యాదవ్ అన్నారు. ముస్లిం సమాజం నుంచి వచ్చిన ఫీడ్?బ్యాక్?కు సంబంధించిన డేటాను ప్రస్తావిస్తూ, ఆ సమాజంలోని మెజారిటీ మహిళలు ఈ యూసీసీ చట్టానికి అనుకూలంగా ఉన్నారని ఆయన పేర్కొన్నారు. "మా డేటా ప్రకారం, 80 శాతం మంది ముస్లిం మహిళలు, 40 శాతం ముస్లిం పురుషులు ఒకే విధమైన ఉమ్మడి చట్టం ఉండాలని విశ్వసిస్తున్నారు. మాకు 3 కోట్ల సందేశాలు (ూమీూ) వచ్చాయి. మేము ప్రింట్?, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియా ద్వారా కూడా ప్రజాభిప్రాయాన్ని సేకరించాం. నేను స్వయంగా వివిధ ర్యాలీలు, సభల ద్వారా ప్రజల నుంచి నేరుగా అభిప్రాయాలను కోరాను. ఏప్రిల్? 24న ఒక ఏడుగురు సభ్యుల కమిటీని ఏర్పాటు చేశాం. అందరి నుంచి సూచనలను ఆహ్వానించాం. యూసీసీ ఇప్పటికే అమలులో ఉన్న రాష్ట్రాలపై కూడా మేము అధ్యయనం చేశాం. మాకు మొత్తం 9.58 లక్షల సూచనలు వచ్చాయి. రాష్ట్రంలోని 93.54 శాతం మంది ప్రజలు ఈ చట్టానికి మద్దతు ఇచ్చారు" అని సీఎం మోహన్ యాదవ్ అన్నారు. సమాజంలోని వివక్షను తొలగించడానికి, అన్ని వర్గాలను ఒకే చట్టపరమైన ఛత్రం కిందికి తీసుకురావడానికి ఈ యూసీసీ చట్టాన్ని రూపొందించినట్లు ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ స్పష్టం చేశారు. "సమాజంలో ఎలాంటి వివక్ష లేకుండా ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు లభించేలా చూస్తామని మేము సంకల్పం తీసుకున్నాం. అది రామ్ అయినా, రహీమ్ అయినా, రవీందర్ అయినా, రాబిన్ అయినా- ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు కల్పించాలి" అని ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ పేర్కొన్నారు.

కాంగ్రెస్?పై విమర్శలు

"కమిటీ ముందు బీజేపీ, ఆమ్? ఆద్మీ పార్టీ, వామపక్ష పార్టీలు తమ అభిప్రాయాలను వెల్లడించాయి. కానీ ప్రతి అంశాన్ని హిందూ-ముస్లిం, ఓటు బ్యాంకు రాజకీయాల కోణంలో చూసే కాంగ్రెస్ మాత్రం తన అభిప్రాయాలు చెప్పకుండా దూరంగా ఉంది" అని ముఖ్యమంత్రి విమర్శించారు. వివాహం, సహజీవనం, దత్తత, సరోగసీ, ఏఆర్?టీ ద్వారా జన్మించిన పిల్లలందరికీ ఈ చట్టం సమాన చట్టపరమైన హోదాను కల్పిస్తుందని యాదవ్? పేర్కొన్నారు.

గిరిజనులకు మినహాయింపు

మధ్యప్రదేశ్?లో యూసీసీ ముసాయిదాను రూపొందించడానికి ప్రభుత్వం నియమించిన కమిటీకి సుప్రీంకోర్టు రిటైర్డ్? జడ్జి జస్టిస్? రంజనా ప్రకాశ్? దేశాయ్ నేతృత్వం వహించారు. ఈ కమిటీ ఇటీవల ముఖ్యమంత్రికి తన నివేదికను సమర్పించింది. షెడ్యూల్? తెగలను (ఆదివాసీలను) దీని పరిధి నుంచి మినహాయించాలని ఈ నివేదిక సిఫారసు చేసింది. దీనితో ఈ ఉమ్మడి పౌర స్మృతి ముసాయిదా బిల్లులో గిరిజన వర్గాన్ని మినహాయించారు. ఈ ప్రతిపాదిత బిల్లులో వివాహం, విడాకులు, భరణం, వారసత్వం, సహజీవనం, దత్తత, వారసత్వం వంటి పలు అంశాలను చేర్చారు. ఈ బిల్లు ప్రకారం, ఇకపై వివాహ నమోదు తప్పనిసరి. పురుషులకు వివాహ వయస్సు 21 ఏళ్లు, మహిళలకు 18 ఏళ్లు నిండాలి.

## నాగాలాండ్లో కొండచరియలు విరిగిపడి 8మంది మృతి

నైరుతి రుతపవనాల ప్రభావంతో దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో భారీ వర్షాలు బీభత్సం సృష్టిస్తున్నాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న కుండపోత వర్షాలు, ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడిన ఘటనల్లో దేశవ్యాప్తంగా సుమారు 30 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. రాబోయే వారం రోజు పాటు ఉత్తర, ఈశాన్య రాష్ట్రాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ వెల్లడించింది. భారీ వర్షాలకు ఈశాన్య రాష్ట్రాలు అతలాకుతలమయ్యాయి. నాగాలాండ్ మోన్ జిల్లాలో ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడి 8 మంది మృతి చెందారు. డజన్ల కొద్ది గల్లంతయ్యారు. పది నుంచి పదిహేను ఇళు దెబ్బతినగా శిథిలాల కింద మరింత మంది ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు. శిథిలాల కింద చిక్కుకున్న వారిని బయటకు తీసేందుకు రెస్క్యూ సిబ్బంది సహాయ చర్యలను ముమ్మరం చేశాయి. నీటి ఉధృతి ఎక్కువగా ఉండడంతో సహాయక చర్యలకు ఆటంకం కలుగుతున్నట్లు తెలుస్తోంది. భారీ వర్షాల కారణంగా అసోం గువాహటిలోని ఖార్ఘులి ప్రాంతంలో కొండచరియలు విరిగిపడ్డాయి. కొండ పైభాగంలో ఉన్న ఓ రక్షణ గోడ ఒక్కసారిగా కుప్పకూలింది. పలు వాహనాలు ధ్వంసమయ్యాయి. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. పశ్చిమ బెంగాల్లో కూడా రాబోయే రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ హెచ్చరించింది. డార్జిలింగ్, కాలింపాంగ్, జల్పాయ్గుడీ , అలీపుర్దువార్, కూచ్ బెహార్ జిల్లాల్లో తీస్తా, తోర్సా, జల్దఖా, రైడక్ నదుల నీటిమట్టాలు ప్రమాదకరంగా పెరిగే అవకాశం ఉందని హెచ్చరించింది.

హిమాచల్ప్రదేశ్లోని పలు జిల్లాల్లో భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని శిమ్లా వాతావరణ కేంద్రం 'రెడ్ అలర్ట్' జారీ చేసింది. దీంతో అన్ని ప్రభుత్వ శాఖలు అప్రమత్తమయ్యాయి. వాతావరణ కేంద్రం చంబా, కాంగ్రా, మండి, సిర్మౌర్, కులు జిల్లాలకు రెడ్ అలర్ట్ హెచ్చరికలను జారీ చేసింది. శనివారం సాయంత్రం నుంచి రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురిశాయి. ధర్మశాలలో అత్యధికంగా 82.2 మి.మీ వర్షపాతం నమోదైంది. వాతావరణ శాఖ లెక్కల ప్రకారం, ఒక రోజులో 115.6 నుంచి 204.5 మి.మీ మధ్య కురిసే వర్షాన్ని 'చాలా భారీ వర్షం'గా, 204.5 మి.మీ కంటే ఎక్కువ కురిసే వర్షాన్ని 'అత్యంత భారీ వర్షం'గా పరిగణిస్తారు. ప్రజలు అనవసర ప్రయాణాలను నివారించాలని, కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉన్న ప్రాంతాలకు దూరంగా ఉండాలని అధికారులు కోరారు. ఏదైనా అత్యవసర పరిస్థితి ఏర్పడితే రాష్ట్ర అత్యవసర హెల్ప్లైన్ నంబర్ 1070 లేదా జిల్లా అత్యవసర హెల్ప్లైన్ నంబర్ 1077 ను సంప్రదించాల్సిందిగా అధికారులు కోరారు. ఉత్తరాఖండ్ను భారీ వర్షాలు వణికిస్తున్నాయి. హరిద్వార్ జిల్లాలో పిడుగులు పడి ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. ఎడతెరిపి లేని వానలు, కొండచరియలు విరిగిపడిన వంటి ఘటనలతో రాష్ట్రవ్యాప్తంగా 84 రహదారులు దెబ్బతిన్నాయని అధికారులు తెలిపారు. కుంభవృష్టి వర్షాలకు రిస్పానా నది నీటిమట్టం ప్రమాదకర స్థాయికి చేరుకుంది. ఫలితంగా దాలన్వాలా సహా పలు లోతట్టు ప్రాంతాలు పూర్తిగా జలమయమయ్యాయి. రానున్న కొన్ని రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో ఉత్తరాఖండ్లోని 10 జిల్లాలకు అధికార యంత్రాంగం రెడ్, ఆరెంజ్ అలెర్ట్లు జారీ చేసింది. అటు జమ్మూ కాశ్మీర్లో భారీ వర్షాలు పెను విషాదాన్ని నింపాయి. సరిహద్దు జిల్లాలైన పూంచ్, రాజౌరీలో ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడిన ఘటనల్లో 17 మంది మృతి చెందారు. పదుల సంఖ్యలో ప్రజలు గల్లంతయ్యారు. వరదల్లో చిక్కుకున్న పలువురిని రెస్క్యూ సిబ్బంది సురక్షితంగా రక్షించారు. ఆకస్మిక వరదలకు ఇళ్లు, కార్లు, రహదారులు దెబ్బతిన్నాయి. భారీ వర్షాలకు చినాబ్ నది ఉధృతంగా ప్రవహిస్తోంది. భారీగా వరద వచ్చి చేరుతుండటంతో సలాల్ డ్యామ్ గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. డ్యామ్ నుంచి చినాబ్ నది పరవళ్లు తొక్కుతూ దిగువకు ప్రవహిస్తోంది. జమ్మూకశ్మీర్లో నెలకొన్న విపత్కర పరిస్థితుల దృష్ట్యా సీఎం ఒమర్ అబ్దుల్లా తన దిల్లీ పర్యటనను రద్దు చేసుకున్నారు. వరద ప్రభావిత జిల్లాల్లో తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వరదల కారణంగా నష్టపోయిన కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో పహల్గామ్, బల్తాల్ మార్గాల్లో అమర్నాథ్ యాత్రను అధికారులు తాత్కాలికంగా నిలిపివేశారు. అమర్నాథ్ యాత్ర అకస్మాత్తుగా నిలిచిపోవడంతో ప్రధాన రహదారుల్లో కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయి భారీ ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. బల్తాల్, నున్వాన్, చందన్వాడి బేస్ క్యాంపులతో పాటు జమ్మూలోని భగవతి నగర్ యాత్రి నివాస్ నుంచి భక్తులు ముందుకు వెళ్లకుండా నిషేధం విధించారు.

VaarthaTarangalu Printed Published Edited and Owned by K.A.Vijayaraju Printed at SR Publications,Amberpet,Hyderabad. Published from PRME Home.Old Bus Stand Road Mahabubnagar - 509001 ,Editor K.A.Vijayaraju Ph.08542-222208 ,Website: www.vaarthatarangalu.com,Email: vtarangalu_222208@rediffmail.com,RNI.NO:APTEL 2004/14137